# నడుస్తున్న తెలంగాణ

ISSN 2349-2376

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి:14 సంచిక:11 165 నవంబర్ 2024 హైదరాబాద్

*'కృత్రిమ మేధ' ఈనాటి అనివార్య సందర్భం

*హైడ్రా - పర్యావరణ సవాళ్లు: సామాజిక న్యాయం

*ప్రజాపోరాటాలే నా రచనలకు ప్రేరణ: అల్లం రాజయ్య

*నేను గొర్రెల్ని కాస్తుంటాను

*అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో అవినీతి వ్యతిరేకత

*బుడ్డపొల్లగాడు మెత్తవడ్డడు



UGC CARE LISTED JOURNAL

# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

నవంబర్ 2024

సంచిక : 11

సంపుటి : 14

UGC APPROVED JOURNAL

UGC CARE LISTED JOURNAL



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి

**అల్లం నారాయణ**

చైర్మన్(పూర్వ)-ప్రెస్ అకాడమి

**ప్రొఫెసర్ గణేష్**

ప్రిన్సిపాల్(పూర్వ), ఆర్ట్స్ కళాశాల, ఓయు.

ప్రధాన సంపాదకుడు

**ప్రొఫెసర్ చింతకింది కాశీం**

సంపాదకురాలు

**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**ప్రొఫెసర్ ఎ. సిల్మానాయక్,** ప్రిన్సిపాల్, టి.ఎస్.పి. కళాశాల

**క్రాంతి**, జర్నలిస్టు

**డా॥చంద్రయ్య ఎస్.** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**డా॥శివరాత్రి సుధాకర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

**ఇమ్మిడి మహేందర్** అసిస్టెంట్ ప్రొఫెసర్ (PT)

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు పంపాల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

ఇంటి నెం. 2-95, ఫ్లాట్ నెం. 301,

వైష్ణవి స్మార్ట్, రోడ్ నెం. 2,

కాకతీయ నగర్, హబ్సిగూడ

హైదరాబాద్-500 007.

మెయిల్: nadusthunnatelangana@gmail.com

**ఫోన్ నెం.: 9290745490**


## సంపాదకుని ఉత్తరం

*నా ప్రియమైన దక్కలి పిల్లా*
*సూర్యోదయం కొసమీద*
*నీ నవ్వును అద్ది*
*నా వాకిట్లో వాలిపోతావు*

*ఆకలి సంగీతాన్ని వినిపించి*
*నా కుండలో ఉడికిన*
*అన్నం మెతుకు మీద*
*నీ గాడిద వ్యాకరణం రాసిపోతావు*

*మిట్ట మధ్యాహ్నం*
*రెండు నేత్రాల మధ్య*
*సూర్యగోళాన్ని మోసుకొని*
*కట్టెల మోపుతో ఇంటికొస్తావు*

*సంధ్యావేళ*
*బొడ్డుమల్లె పువ్వులు ధరించిన*
*అరుంధతి నక్షత్రంలా*
*జాంబవ పురాణాన్ని గానం చేస్తావు*

*అర్ధమ రాతిరి*
*ఏకాంత క్షణాల్లో*
*అజ్ఞాత ప్రియురాలిలా*
*నన్ను వదిలి వెళ్ళిపోతావు*

*మేఘం ప్రియుడు*
*వర్షించే వేళ*
*ఒకే గుడిసె కింద*
*నీ మూగకనుల్ని ప్రేమించే*
*రోజొకటి రావాలి*

**30 నవంబర్, 2024**

*నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదకవర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.*

# తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

'కృత్రిమ మేధ' ఈనాటి అనివార్య సందర్భం | **డా॥ చంద్రయ్య శివన్న** | 5

**సామాజికం**

ముప్పయ్యేళ్ల దండోరా (MRPS) ఉద్యమం: దశ–దిశ | **డా॥గోపని చంద్రయ్య** | 6

హైడ్రా– పర్యావరణ సవాళ్లు: సామాజిక న్యాయం | **డా॥చాకేటి రాజు** | 15

**తొవ్వ ముచ్చట**

ప్రజాపోరాటాలే నా రచనకు ప్రేరణ: అల్లం రాజయ్య | **డా॥శివరాత్రి సుధాకర్** | 21

**విమర్శ**

తడి ఆరని 'ఒంటరిగొంతు' | **డా॥సద్మెక లలిత** | 34

**పరిశోధన**

'నేను గొర్రెల్ని కాస్తుంటాను' | **ఇమ్మిడి మహేందర్** | 36

జయరాజు పాట; ప్రకృతి కవిత్వం | **ఎం. విప్లవ కుమార్** | 42

అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో అవినీతి వ్యతిరేకత | **పి.రాజీవ్‌కుమార్** | 44

**పల్లెసుద్దులు**

బుద్దపొల్లగాడు మెత్తవద్దదు | **రవి కుర్మకోరె** | 47

**పరిశోధన పరిచయం**

దళిత సాహిత్యంలో ఆత్మకథలు పరిశీలన | **డా॥గిన్నారపు ఆదినారాయణ** | 49

**రచయితలకు సూచనలు:**

**1. రచనలను డీటీపీ చేసి పంపేవారు ప్రతినెల 12వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో లేదా వర్డ్ ఫైల్‌లో పత్రిక మెయిల్ అడ్రస్‌కు పంపించగలరు.**

**2. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**3. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**4. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**5. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

సంపాదకీయం

# 'కృత్రిమ మేధ' ఈనాటి అనివార్య సందర్భం

డా. చంద్రయ్య శివన్న

కంప్యూటర్ వచ్చిన తొలిరోజుల్లో ఉద్యోగాల భద్రతకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమయ్యాయి. వివిధ కార్యాలయాల్లో మనుషులు చేసే రోజువారీ డేటాఎంట్రీ, బుక్ కీపింగ్ మొదలైన పనుల్ని తొలిదశలో వచ్చిన కంప్యూటర్ చేసిపెట్టేది. ముఖ్యంగా మళ్లీ మళ్లీ చేసే ఒకే పనిని (రిపీటెడ్‌గా) కంప్యూటర్ విసుగులేకుండా చేయడమనేది ఆ కాలంనాటికి ఒక అద్భుతం. కంప్యూటర్, దానికున్న సామర్థ్యంవల్ల, కచ్చితత్త్వంవల్ల అనేకమంది ఉద్యోగాలను రీప్లేస్ చేసింది. ఉద్యోగులు తమకు అప్పటివరకు పరిచయంలేని కొత్త నైపుణ్యాలను, సాంకేతికను విధిగా నేర్చుకోవాల్సి వచ్చింది. దీనికి అలవాటుపడనివాళ్లు ఉద్యోగాలు కోల్పోయారు. కానీ అనతికాలంలోనే కంప్యూటర్ రంగంలో సరికొత్త ఉద్యోగాల కల్పన జరిగింది. సరిగ్గా ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్–ఏఐ) సందర్భంలోనూ ఇదే రకమైన భయాందోళనలు వ్యక్తమవుతోన్నాయి. ఈ రెండు సందర్భాల్లో ఉన్న తేడా ఏంటంటే, అప్పుడు కంప్యూటర్‌ను మనుషులు ఆపరేట్ చేసేవాళ్లు. కొన్ని యాంత్రికమైన పనులకోసం మాత్రమే ఉపయోగించేవారు. కానీ, ఇప్పుడున్న ఏఐ దానికదిగా ఒక మనిషి ఆలోచించినట్టు ఆలోచిస్తోంది. కొన్నిసార్లు అచ్చం మనిషిలానే నిర్ణయాలు తీసుకుంటోంది. పరిష్కారాల్ని సూచిస్తోంది. ఎప్పటికప్పుడు కొత్త విషయాల్ని నేర్చుకుంటోంది. అనేక రకాల అనుభవాల ద్వారా 'డీప్ లర్నింగ్' చేస్తోంది. ఎప్పటికప్పుడు తన జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకుంటోంది. ఇది మానవ మేధను రీప్లేస్ చేయడానికి క్రమంగా సంసిద్ధమౌతోంది.

కృత్రిమ మేధ, శ్రమలో మనుషుల పాత్రను తగ్గించడంతోపాటూ, పనివేగాన్ని, కచ్చితత్త్వాన్ని సాధిస్తుంది. విద్య, వైద్యం, వ్యవసాయం, న్యాయవ్యవస్థ, వాణిజ్యం మొదలైన సమాజ సంబంధమైన పనుల్ని ఎన్నింటినో మానవాళికి చేసి పెడుతుంది. ఇట్లా మానవ మేధ చేసే ప్రతి పనిని రాబోవు కాలంలో కృత్రిమ మేధ చేయబోతుందంటే ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు. ప్రస్తుతానికి తన దగ్గరున్న పరిమితమైన డాటాసెట్స్ తోనే ఈ అద్భుతాలు చేయగలుగుతుందంటే, ఇక రాబోవుకాలంలో బహుళజాతి సంస్థలు ఏఐని తెలుగులాంటి భారతీయ భాషావసరాలకు తగినట్టుగా అభివృద్ధిచేయడం కోసం పెట్టుబడులు పెడితే, మరిన్ని ఊహకందని ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. ఇది ఇంకా ఎంతో దూరంలో లేదనిపిస్తోంది.

మనల్ని అబ్బురపరిచే విషయమేమిటంటే, సాహిత్యం, కళలు, భాష, సంస్కృతి మొదలైన భావోద్వేగ సందర్భాల్లోనూ ఈ కృత్రిమ మేధ ప్రమేయం క్రమంగా ఎక్కువవుతోంది. ఏఐ సొంతంగా సృజన చేయగలదు. ముఖ్యంగా కవిత్వం, కథ, నవల, సినిమా స్క్రిప్ట్ లాంటి సృజన ప్రక్రియల్లో సైతం తన పనితనాన్ని చూపిస్తుంది. వ్యాఖ్యానాలు, సాహిత్య విశ్లేషణలు, అనువాదాలు, విమర్శ, సమీక్షలు చేసి ఇస్తుంది. భాషకు సంబంధించి పెద్ద పెద్ద డాటాసెట్స్ ఇస్తే, అది చాలా సులభంగా, వేగంగా, కచ్చితమైన గణాంకాలతో భాషావిశ్లేషణ చేయగలుగుతుంది. వాక్యాలను, అక్షరదోషాల్ని సరిచేయడంవంటి పనుల్ని ఇప్పటికే ఆంగ్లంలో చేయగలుగుతుంది. ఏదైనా ఒక అంశం ఇచ్చి నిర్దిష్ట పద్ధతిలో కావాలని అడిగితే, వెంటనే కంటెంట్‌ను తయారుచేసి, మన కళ్లముందుంచుతుంది. ఇలాంటి పనుల్ని తొందర్లో తెలుగుభాషలో చేసినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేదు.

రాబోవుకాలంలో ఇది ఇంకా కొనసాగుతుంది. ముఖ్యంగా విద్యారంగంలో హైస్కూల్ విద్యార్థులైతే తమ రోజువారీ హోంవర్క్, ఉన్నత విద్యాస్థాయిల్లో అసైన్ మెంట్స్, ప్రాజెక్ట్స్, పిహెచ్.డీలను రాయడంకోసం ఏఐ మీద విపరీతంగా ఆధారపడుతున్నారు. ప్రధానాచార్యులకు రాయాల్సిన వినతిపత్రాన్ని రాయడంకోసం కూడా ఏఐని సంప్రదిస్తున్నారు. అంతమాత్రమే కాదు రాసివ్వమని ఏఐనే బాజాప్తుగా అడుగుతున్నారు. అది రాసిపెడ్తుంది కూడా. ఇవన్నీ ఇప్పుడు మన కళ్లముందు జరుగుతున్న వాస్తవాలు. ఇప్పుడు మానవాళి అంతా ఏఐ వండివార్చిన సమాచారంకోసం అర్రులు చాస్తోంది. క్రమంగా మానవాళి తమ మెదడును ఉపయోగించే పనినుంచి తప్పుకుంటోంది. ఇది ఎంతవరకు పోయిందంటే, ఏఐ చెప్పిందే కచ్చితమైన సమాచారం అనేదాకా పోయింది. మనుషుల మేధను నమ్మే స్థితికి మానవాళి క్రమంగా దూరమవుతోంది. ఈ ఏఐ ప్రభావంతో ఉద్యోగాలు కోల్పోవడం పరిపాటి అయినా, మానవ సృజనకు కూడా పెనుముప్పు వాటిల్లబోతుందనేది మేధావుల్ని ఎక్కువ ఆందోళనలకు గురిచేస్తున్న విషయం.

ప్రపంచీకరణలో భాగంగా జరిగిన కంప్యూటరీకరణ కేవలం ఉద్యోగాలనుంచి మనుషుల్ని బేదఖలు చేస్తే, ఈ ఏఐ, ఉద్యోగాలతోపాటూ మానవ మేధనూ ఖాళీ చేసేస్తుండటం అత్యంత భయానక సన్నివేశం. ప్రపంచీకరణకు అభివృద్ధి విధ్వంసాలు బొమ్మాబొరుసులుగా ఉన్నట్టే, కృత్రిమమేధకూ ఉన్నాయి. ముఖ్యంగా, భాషాసాహిత్యాలకు పరిమితమై ఆలోచిస్తే, మానవ సృజనరంగంపై ఆధిపత్యాన్నీ, జ్ఞాపకశక్తిపై తీవ్రమైన ప్రభావాన్ని నెరుపబోతుంది. అయినా, ఏఐ ఈనాటి అనివార్య సందర్భం. తప్పించుకోలేని సంకట స్థితి. ఏఐని సృజనాత్మకంగా వాడుకోగలిగే నైపుణ్యాల్ని సాధించుకునే దేశాలు అభివృద్ధిపథంలో నడుస్తాయి. దాని ఆగమనాన్ని గుర్తించని, గుర్తించినా ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించే సమూహాలైనా, దేశాలైనా అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉండిపోతాయనేది వాస్తవం. మొత్తంగా మానవ సర్వతోముఖాభివృద్ధికోసం ఏఐని 'సద్వినియోగం' చేసుకోవడంపైనే మానవ మేధ సజీవత్వం ఆధారపడి ఉంటుంది.

T

# ముప్పయ్యేళ్ల దండోరా (MRPS) ఉద్యమం : దశ - దిశ

డా॥గోపని చంద్రయ్య

**వ్యాస సంగ్రహం**

జులై 7, 2024తో దండోరా (MRPS) ఉద్యమం ముప్పయ్యేళ్లు పూర్తిచేసుకున్నది. ఈ ముప్పయ్యేళ్ల దండోరా ఉద్యమం తెలుగు నేలపై బలమైన ప్రభావం చూపింది. మాదిగలకు దక్కవల్సిన సామాజిక న్యాయంకోసం పోరాడుతూనే అనేక మానవీయ ఉద్యమాలను కులాలకు, మతాలకు అతీతంగా నిర్మాణం చేసి మానవ హక్కులకు బాసటగా నిలబడ్డది. ఈ పోరాటాలతో దండోరా అస్తిత్వ ఉద్యమాల పరిధిని విస్తృతం చేసింది. దండోరా ఉద్యమం దళిత ఉద్యమానికి కొత్త ప్రశ్నలు సంధించి, సామాజిక న్యాయానికి దళితుల్లో అట్టడుగువర్గాలు ప్రాతిపదిక కావాలని ప్రతిపాదించింది. దండోరా ఉద్యమ నేపథ్యంలో వచ్చిన మాదిగ సాహిత్యం దళిత సాహిత్య తాత్వికతను, విస్తృతిని పెంచి నేటికి ఒక ప్రవాహంగా కొనసాగుతుంది. ముప్పయ్యేళ్ల తర్వాత సుప్రీమ్‌కోర్టు తీర్పుతో చట్టపరంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పుడు న్యాయంగా వర్గీకరణను అమలుచేసుకోవాల్సిన అవసరం మిగిలివుంది. అయితే ముప్పై సంవత్సరాల దండోరా ఉద్యమం మాదిగలకు కొత్త చైతన్యాన్ని, నాయకత్వాన్ని అందించినప్పటికీ అది సాంస్కృతికంగ, రాజకీయంగ, భావజాలపరంగ ఒక ప్రత్యామ్నాయ నిర్మాణంపై దృష్టి పెట్టలేదు. మాదిగల ప్రతి సమస్య వర్గీకరణ చుట్టూ తిప్పుతూ మాదిగల రాజకీయ చైతన్యాన్ని విస్మరించడం మాదిగల భవిష్యత్‌కు ప్రమాదకరం. ఈ ముప్పయ్యేళ్ల దండోరా ఉద్యమ ఒడిదుడుకులు, దశ-దిశను సద్విమర్శ (Critical view) తో క్షేత్రస్థాయి పరిశోధనతో వివరించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశ్యం.

Key words : *దండోరా, మాదిగలు, సామాజిక న్యాయం, మందకృష్ణ, పోరాటం, రిజర్వేషన్లు, దళితులు.*

**పరిచయం :** కారంచేడు సంఘటన జులై 17, 1985 ఆధునిక తెలుగు దళిత ఉద్యమ చరిత్రను మౌలికంగా మార్చివేసింది. ఈ సంఘటన తర్వాత వచ్చిన ప్రశ్నలు, వాదనలు, దళిత పోరాటాలు, దళిత మహాసభ ఆధ్వర్యంలో ఒక స్వతంత్రమైన దళిత ఉద్యమానికి పునాది వేసినవి. అయితే చుండూరు (1991) సంఘటన నాటికి లేదా 1994 సంవత్సరం నాటికి దళిత ఉద్యమ నాయకత్వానికి అనేక ప్రశ్నలు కిందిస్థాయి దళిత సమూహాల నుండి వచ్చాయి. అలా వచ్చిన ముఖ్యమైన ఉద్యమం మాదిగల దండోరా ఉద్యమం. బాగా ప్రజాదరణ పొందిన పేరు ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి). ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నది మందకృష్ణ మాదిగ. ఇప్పుడు ఈ ఉద్యమం ముప్పై సంవత్సరాలు పూర్తి చేసుకున్నది. ఇదొక చారిత్రక సందర్భం. దండోరా ఉద్యమం, కృష్ణ మాదిగ నాయకత్వం ఎంతగా కలగలసిపోయాయంటే కృష్ణ మాదిగ లేకుండా దండోరా ఉద్యమాన్ని దండోరా ఉద్యమం లేకుండా కృష్ణ మాదిగ ఉద్యమ జీవితాన్ని ఊహించడం కష్టం. దండోరా ఉద్యమం అనేక చారిత్రాత్మక ప్రశ్నలు లేవనెత్తింది. అవి : దళితులంటే ఎవరు? వివిధ దళిత కులాల్లో ఉన్న భిన్నత్వాన్ని, అసమానతలను ఎలా అర్థం చేసుకోవాలి? షెడ్యూల్డ్ కులాల్లో ఉన్న సామాజిక, ఆర్థికపరమైన అసమానతలను పరిష్కరించే మార్గాలేవి? షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్స్ వర్గీకరణ దళితులను విభజిస్తుందా ? ఎందుకు ఎస్సీ రిజర్వేషన్స్ ఫలాలు కొన్ని కులాలు మాత్రమే అనుభవిస్తున్నాయి. మాల మహానాడు ఐక్యత పేరుతో ఆధిపత్యాన్ని చెలాయించడానికి కారణాలేమిటి? దళితుల్లో సంఖ్యాపరంగా చిన్న కులాలు లేవనెత్తుతున్న ప్రశ్నల నేపథ్యంలో అంబేద్కర్ దృక్పథాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్నలు అన్ని రకాల ప్రజా సమూహాలను ఆలోచింపజేశాయి.

సుమారు 1990 దశకం నుండి దేశం మొత్తం మీద దళితుల్లో ఉన్న కిందిస్థాయి కులాలనుండి తమ వాటాకోసం, తమకు రావాల్సిన అవకాశాలకోసం తమ ఉనికిని ప్రజాస్వామ్య వ్యవస్థల్లో చాటిచెప్పడానికి ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈ ఉద్యమాలతో చిన్నకులాలకు కొత్త నాయకత్వం వచ్చి అప్పటికే దళిత ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నవారిని ప్రశ్నించింది. మొత్తంమీద ఈ ఉద్యమాలకు దళిత నాయకత్వం, దళిత బుద్ధిజీవులనుండి రావాల్సినంత మద్దతు రాకపోగా వ్యతిరేక వాదనలు వచ్చాయి. ఇదొక దళిత ఉద్యమ విషాద సందర్భం. ఎస్సీ వర్గీకరణ 1975లోనే పంజాబ్ రాష్ట్రం గ్రూప్ - ఎ మరియు గ్రూప్-బిగా చేసి అమలు చేసింది. ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో ప్రభుత్వం వేసిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్, ఉషా మెహరా కమిషన్ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థించాయి. ఎమ్మార్పీఎస్ స్ఫూర్తితో కర్ణాటకలో మాదిగలు చైతన్యమై వర్గీకరణకోసం ఉద్యమాలు చేయగా ప్రభుత్వం సదాశివ కమిషన్ నియమించింది. సదాశివ కమిషన్ వర్గీకరణను సమర్థించింది.

తమిళనాడులో అరుంధతీయుల ఆధ్వర్యంలో ఉద్యమం జరుగగా ఎం.ఎస్.జనార్ధన్ కమిషన్‌ను నియమించారు. కమిషన్ అరుంధతీయులకు ప్రత్యేక రిజర్వేషన్లను సమర్థించింది. తమిళనాడు రాష్ట్రం 3 శాతం ప్రత్యేక రిజర్వేషన్లను అరుంధతీయులకు అమలు చేస్తున్నది. పంజాబ్‌లో సుప్రీంకోర్టు 2004 జడ్జిమెంట్ తర్వాతి ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఒక పాలసీగా ఎస్సీలను గ్రూప్-ఎ, గ్రూప్-బిల ద్వారా ఎస్సీ రిజర్వేషన్లను అముల చేస్తున్నది. హర్యానాలో పంజాబ్ తరహా పాలసీ అమలు చేయాలని ఉద్యమాలు జరిగాయి. (గుండిమేడ సాంబయ్య, 2006). మొదటి నుండి ఎస్సీ వర్గీకరణ ఉద్యమం దేశవ్యాప్త ఉద్యమం చేయడంలో దండోరా, కృష్ణమాదిగ కృషి బలంగా ఉంది.

**ఈదుముడిలో కృష్ణమాదిగ నాయకత్వంలో MRPS ఆవిర్భావం**

మందకృష్ణ మాదిగ వరంగల్‌లో విప్లవోద్యమంలో పనిచేసి బయటకు వచ్చారు. విప్లవోద్యమం చైతన్యంతో గ్రామంలో ఆధిపత్య కులాల దోపిడి, దౌర్జన్యాలను అంబేద్కర్ దృక్పథంలో ఎదుర్కోవడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అటు విప్లవోద్యమంనుండి, ఇటు రాజ్య నిర్బంధంనుండి బయటకు రావడానికి కెజి సత్యమూర్తి పిలుపును అందుకొని దళిత ఉద్యమంలో పనిచేయడం ప్రారంభించారు. ఉద్యమంలో భాగంగా చీరాల విజయనగర్ కాలనీలో ఉండి పనిచేస్తున్న రోజుల్లోనే అనేక మంది మాదిగ యువకులతో, ఉద్యోగస్తుల పరిచయాలు ఏర్పడడంతో, మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షుణ్ణంగా అర్థంచేసుకోవడం ప్రారంభించి, రిజర్వేషన్ ఫలాల్లో మాదిగలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. అప్పటికే దళిత ఉద్యమంలో ఈదుముడి నుండి పనిచేస్తున్న కొమ్మూరి విజయ్‌కుమార్ లాంటివారితో చర్చించడం జరిగింది. ఈ మొత్తం చర్చలు జరుగుతున్నప్పుడు తాను ఉంటున్న చీరాల విజయనగర్ కాలనీలో కులపెద్దలు మందకృష్ణ మాదిగను మందలించి మాదిగ ఉద్యమంవల్ల మాల-మాదిగల మధ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని చెప్పి, కాలనీనుండి కృష్ణమాదిగను వెళ్ళమని ఆదేశించారు. వెంటనే కాలనీనుండి బయటకు వచ్చి అప్పటికే దళిత ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్న ఈదుముడి గ్రామ మాదిగ యువకులతో జులై 7, 1994న సమావేశమైనారు. ఈ సమావేశంలో మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని చర్చించి సభ్యులంత ఏకగ్రీవంగా మందకృష్ణను రాష్ట్ర కన్వీనర్‌గా ఎమ్మార్పీఎస్‌కి ఎన్నుకున్నారు. వెంటనే గ్రామాలకు వెళ్ళి మాదిగలను చైతన్యం చేయడం ప్రారంభించి ఎమ్మార్పీఎస్ నాయకులు తాము వేసిన కరపత్రాలతో జులై 17న విజయనగర్ కాలనీల్లో జరిగిన కారంచేడు మృతవీరుల సంస్మరణ సభలో రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చిన వారికి పంచిపెట్టారు. కరపత్రాన్ని చూసిన మాలలు ఆగ్రహించి మందకృష్ణ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలపై దాడి చేసారు. ఈ సంఘటనతో మాదిగ యువకుల్లో ఎమ్మార్పీఎస్ నిర్మాణం చేయాలనే కసి పెరిగింది (గోపని చంద్రయ్య, 2019).

మాదిగ అనే పేరు వినడానికే అసహ్యించుకున్న సమాజంలో, మాదిగ అనే పదాన్ని ఒక బూతుగా వాడే స్థాయి నుండి ఎమ్మార్పీఎస్ ఉద్యమంతో 'మాదిగ'ను తమ పేరు చివరన గౌరవ సూచకంగా పెట్టుకునే స్థాయికి, అది మాదిగల ఆత్మగౌరవానికి నిదర్శనంగా కృష్ణమాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేసారు. అలా కృష్ణగా ఉన్న పేరు మందకృష్ణ మాదిగ తగిలించుకోవడాన్ని తప్పుపట్టిన వాళ్ళు సైతం కొంతకాలం తరువాత తమ పేర్లకు చివర లేదా మొదట తమ తమ కులాల పేర్లను సంతోషంగా పెట్టుకొని తమ కులాల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రచారం చేయడం జరిగింది.

**దండోరా ఉద్యమ నిర్మాణం, విస్తరణ, ఉద్యమ రూపాలు**

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ఉధృతం చేసే క్రమంలో మొదటగా ఒంగోలులో జిల్లా మహాసభలు నిర్వహించడంతో జిల్లాలో పెద్ద ఎత్తున మాదిగ జనాలు కదలివచ్చారు. కృష్ణ మాదిగ, జిల్లాలో తయారైన కార్యకర్తలను ఇతర వివిధ జిల్లాకు తరలించి ఉద్యమ విస్తృతికి తోడ్పడవల్సిందిగా కోరారు. తర్వాత కందుకూరులో రాష్ట్ర తొలి మహాసభలను నిర్వహించి, సదాలక్ష్మీని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. రాష్ట్ర మహాసభలు విజయవంతం కావడంతో రాష్ట్ర మహాసభలకు వచ్చిన అనేకమంది మాదిగ యువకులు, ఉద్యమకారులతో ఉద్యమ వ్యాప్తి దృష్ట్యా ఇటు ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉద్యమ నిర్మాణంకోసం ప్రత్యేక ప్రణాళిక వేసుకున్నారు. ఇలా వైజాగ్, కర్నూల్‌లో భారీ బహిరంగ సభలు నిర్వహించి ఆ సభలకు వచ్చిన అనేక మంది మాదిగ యువకులతో, మాదిగ పెద్దలతో పరిచయాలు ఏర్పడి తెలంగాణప్రాంతానికి ఉద్యమం విస్తరించింది. మాల మహానాడు, ఆర్డినెన్స్‌పై హైకోర్టుకు వెళ్ళడంతో రాష్ట్ర ప్రభుత్వాన్ని కమిషన్ వేయవల్సిందిగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వేస్తున్నట్లుగా ప్రకటించింది. ఈ కమిషన్ త్వరగా రిపోర్ట్ ఇవ్వవల్సిందిగా డిమాండ్ చేస్తూ కమిషన్ నుండి అన్ని రకాలుగా సహకరించింది.

**దండోరా ఆధ్వర్యంలో 2000-2004 మధ్యకాలంలో విశాల రాజకీయాల ప్రయత్నం**

2000వ సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ హేతుబద్ధ చట్టం 2000వ సంవత్సరంలో తెచ్చి షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్లను ఎబిసిడిలుగా వర్గీకరించి అమలుచేశాడు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బలమైన నిర్మాణం ఉన్న ఎమ్మార్పీఎస్

మందకృష్ణ నాయకత్వం విశాల ప్రజా ఉద్యమాలు, ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు దృష్టి సారించారు. అప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద ఎత్తున అణగారిన కులాలు తమ కుల సంఘాలతో ఆత్మగౌరవ పోరాటాలకు సిద్ధమవుతున్న సమయం అంతేకాకుండా రాష్ట్రంలో కమ్యూనిస్టు భావజాలంతో కుల-వర్గ నిర్మూలన ఆలోచనను కల్గిన శక్తులు ఏకతాటిపైకి రావడానికి కృషి జరుగుతున్న సందర్భం కూడా. ఈ ఆలోచనతో "మహాజన సంఘర్షణ సమితికి" మందకృష్ణ అధ్యక్షునిగా, ఎంజి గౌతమ్ సెక్రెటరిగా, ఉ.సాంబశివరావు గౌరవ అధ్యక్షులుగా ఆవిర్భవించింది. 2000-2004 మధ్యకాలంలో 'మహాజన సంఘర్షణ సమితి" అలియెన్స్, ఐడెంటిటి దృక్పథంతో అనేక పోరాటాలను చేపట్టారు. (చింతాడ గౌరీ ప్రసాద్, 2007).

బాబ్రీ మసీదు కూల్చివేతకు, గుజరాత్‌లో ముస్లిం ఊచకోత సంఘటనపై అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్న ముస్లింలకు నైతిక మద్దతునిస్తూ 'ముస్లిం, దళిత్ భాయి భాయి' అనే నినాదం ప్రచారం చేసి మహాజన, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిజాం కాలేజ్ గ్రౌండులో జూన్ 8, డిసెంబర్ 6, 2003న భారీ బహిరంగ సభ జరిపి ముస్లీంలకు మద్దతు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగ ప్రమోషన్స్‌లో రిజర్వేషన్స్ కల్పించాలంటూ కోరుతూ 1 జులై, 2002న హైద్రాబాద్ నగరంలో బషీర్‌బాగ్ ప్రాంతాన్ని 36 గంటల పాటు దిగ్బంధం చేసి జీవో ఎంఎఫ్. నెం.5.21.123లను సాధించారు. దళిత మహిళలకు అంగన్‌వాడి కేంద్రాలలో వంట వండడంలో వివక్ష చూపిస్తున్న దానికి నిరసనగా మార్చ్ 2003 అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వేలాది మంది అణగారినవర్గాల మహిళలతో హైద్రాబాద్‌లో ప్రదర్శన జరిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎస్‌సి (మహాజన సంఘర్షణ సమితి) చేసిన మరో అంశం ప్రైవేట్‌రంగంలో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో మహాజన సంఘర్షణ సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. ఈ విధంగా ఎస్సీ వర్గీకరణ అమల్లో ఉన్న రోజుల్లో విశాల మహాజన రాజకీయాలకోసం ప్రయత్నాలు కొనసాగాయి (మందకృష్ణ ఇంటర్వ్యూ 2010). 1994 నుండి ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎంతోమంది ఎన్నో రకాలుగా త్యాగాలు చేశారు. మరికొందరు ప్రాణాలను సహితం అర్పించారు. ఎమ్మార్పీఎస్ తన ముప్పై సంవత్సరాల్లో చేపట్టిన అనేక సామాజిక ఉద్యమాలు ఉన్నాయి.

**దండోరా చేపట్టిన మానవత్వ ఉద్యమాలు, చిన్న పిల్లల గుండె ఆపరేషన్ ఉద్యమం**

ఎమ్మార్పీఎస్ చేపట్టిన చారిత్రాత్మకమైన ఉద్యమం చిన్న పిల్లల ఉచిత గుండె ఆపరేషన్ ఉద్యమం. 2004వ సంవత్సరంలో మధిరలో కృష్ణమాదిగ ఎన్నికల్లో ఉండగా ఖమ్మంకి చెందిన ముస్లీం అమ్మాయి నసీమా తల్లిదండ్రులు వచ్చి నసీమాకు ఉన్న గుండె శస్త్రచికిత్స గురించి కృష్ణమాదిగతో చెప్పి, ఏదైనా సహాయం చేయవల్సిందిగా కోరారు. ఆ క్షణానికి ఆ తల్లిదండ్రులకు రెండు రోజుల తర్వాత తనను కలవమని చెప్పి వెళ్ళారు. కొన్ని రోజుల తర్వాత నసీమా తల్లిదండ్రులను తీసుకెళ్ళి ముఖ్యమంత్రితో నసీమాకు ఏదైనా సహాయం చేయవల్సిందిగా కోరారు. ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి కొంత ఆర్థిక సహాయం చేయగా అది సరిపోదు మొత్తం గుండె ఆపరేషన్‌కు ప్రభుత్వమే భరించాల్సిందిగా కోరగా, ముఖ్యమంత్రి తిరస్కరించారు. ఈ తిరస్కారాన్నే సవాలుగా తీసుకొని కృష్ణమాదిగ చిన్నపిల్లల గుండె ఆపరేషన్ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణం చేయడం ప్రారంభించారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వివిధ ఆరోగ్య సమస్యలను పరిష్కరించే క్రమంలో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ" ప్రవేశపెట్టి ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడా పేదలు వైద్య సదుపాయాలు పొందేటట్లు ప్రభుత్వ పథకం తేవడానికి ఎమ్మార్పీఎస్ చారిత్రాత్మమైన పాత్ర పోషించింది.

**దండోరా నిర్మించిన వికలాంగుల హక్కుల ఉద్యమం**

మందకృష్ణ మాదిగ ఉషామెహర కమిషన్‌కోసం రాష్ట్రం మొత్తం తిరుగుతున్నప్పుడు విశాఖపట్నంలో కొంతమంది వికలాంగులు తమ సమస్యలను వివరించుకున్నారు. కృష్ణ మాదిగ సాయంత్రం వికలాంగుల హాస్టల్స్‌కు వెళ్ళి ప్రత్యక్షంగా వాళ్ళ సమస్యలను తెలుసుకున్నాడు. వెంటనే హైద్రాబాద్ వచ్చి వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌తో కలిసి అనేక సమస్యలు చర్చించి ఒక ప్రత్యేక పోరాటాన్ని నిర్మించాలని పూనుకున్నారు. వికలాంగుల ఆత్మగౌరవం, మానవ హక్కులు పరిరక్షించే ఉద్దేశ్యంతో తేది 28 ఆగష్టు 2007లో "వికలాంగుల హక్కుల పోరాట సమితి" (విహెచ్‌పిఎస్) ఏర్పాటు చేశారు. ప్రధానంగా వికలాంగులకు 500 నుండి 1000 రూపాయల పెన్షన్ పెంచాలని, ప్రభుత్వమే వికలాంగుల హాస్టల్స్ నిర్వహించి, వికలాంగులకు సదుపాయాలు కల్పించాలని, ఉద్యోగాల్లో ప్రభుత్వం వికలాంగుల కోటాను అమలుపరుచాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్‌రెడ్డి మొదటగా అంగీకరించినప్పటికీ, ఆలస్యం కావడంతో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం రోజు పెద్ద ఎత్తున తేది 4డిసెంబర్, 2007 ధర్నా చేయడంతో ప్రభుత్వం సభ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటి సూచనలను అమలుపరచడానికి విహెచ్‌పిఎస్ మళ్ళీ ఉద్యమాన్ని ఉధృతం చేసే క్రమంలో అనేక మీటింగులు, సమావేశాలు ఏర్పాటు చేశారు. వికలాంగుల డిమాండ్స్‌ను అమలుపరిచే క్రమంలో తేది 20 నుండి 25 ఫిబ్రవరి, 2008 వరకు రిలే నిరాహార దీక్షలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం సుముఖంగా లేకపోవడంతో కృష్ణమాదిగ "ఆమరణ నిరాహార దీక్ష చేయాలని నిర్ణయించుకోవడంతో మార్చిలో 2008 మూడు రోజుల దీక్ష

కొనసాగిన తర్వాత ప్రభుత్వం తమ ప్రతినిధులను చర్చలకు పంపింది. దీనితో ప్రభుత్వం 500, 600, 700 వికలాంగులకు పెన్షన్‌ను ఒప్పుకుంది (డప్పోళ్ల రమేష్, 2021). ఈ విజయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళే క్రమంలో మండల స్థాయినుండి రాష్ట్రస్థాయి వరకు సదస్సులు, సభలు నిర్వహించారు. తర్వాత హైద్రాబాద్‌లో 'వికలాంగుల ఆత్మగౌరవ సభను' నిర్వహించారు. రాజకీయాల్లో కూడా వికలాంగులకు ప్రాతినిధ్యం ఉండాలనే ఉద్దేశ్యంతో కృష్ణమాదిగ నాయకత్వంలో "వికలాంగుల రాజ్యాధికార" యాత్రను తేది 11 జులై నుండి 25 ఆగష్టు వరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించారు. ఈ యాత్ర హైద్రాబాద్ నిజాంకాలేజ్ గ్రౌండ్‌లో "వికలాంగుల ఆత్మగౌరవ హక్కుల, రాజ్యాధికార మహాసభ ద్వారా ముగిసింది. ఈ సభ ద్వారా 7 శాతం వికలాంగులకు ప్రాతినిధ్యం డిమాండ్ చేశారు.

**వృద్ధుల, వితంతువుల సంక్షేమ ఉద్యమం**

ఎమ్మార్పీఎస్ మరోసారి చారిత్రాత్మకమైన ఉద్యమానికి తెరతీసింది. సమాజంలో ఎంతో నిరాదరణకు గురై, కన్నపిల్లలు కూడా చూసుకోలేని స్థితిలో ఉన్న వృద్ధులను, వితంతువుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే ఉద్దేశ్యంతో కృష్ణమాదిగ వారి సంక్షేమంకోసం ప్రభుత్వాన్ని నిలదీసే పనిలో భాగంగా "వృద్ధుల సంక్షేమ సంఘం" (విఎస్ఎస్), "వితంతువుల సంక్షేమ పోరాట సమితి (విఎస్‌పిఎస్) ప్రారంభించి, రాష్ట్రంలో ఉన్న వృద్ధులకు, వితంతువులకు వారి సంక్షేమంపై ఎమ్మార్పీఎస్ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలతో కమిటీలు వేసి దాదాపు రెండు నెలలు రాష్ట్రం మొత్తం తిరిగి సుమారు 200 మీటింగులు ఏర్పాటు చేశారు. తేది 27 నవంబర్ రోజున ఛలో హైద్రాబాద్, ఎన్‌టిఆర్ గ్రౌండ్స్‌లో లక్షలాది మంది వృద్ధుల, వితంతువులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వృద్ధుల పెన్షన్ 200 నుండి 1000కు పెంచాలని అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించడంతో కొత్త రాష్ట్రాలు ఏర్పడిన తర్వాతి కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో వృద్ధులకు, వితంతువులకు 1000 రూపాయల పెన్షన్ ప్రారంభించారు. (డప్పోళ్ల రమేష్, 2021).

**రాష్ట్ర విభజన : ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో బహుజన గొంతుకగా దండోరా పాత్ర**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ఎమ్మార్పీఎస్‌కు సంస్థ పరంగా ఒక విధానపరమైన దృక్పథం ఉంది. 2001లోనే అంటే మలిదశ ఉద్యమం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంకోసం ప్రారంభమవుతున్న సందర్భంలో ఎమ్మార్పీఎస్ సంస్థపరంగా అంబేద్కర్ ఆలోచన విధానస్ఫూర్తితో చిన్న రాష్ట్రాలకు ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ప్రకటించి, చిన్న రాష్ట్రాల్లో ఆధిపత్య కులాల దోపిడిని, ఆధిపత్యాన్ని ఎదుర్కోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. కేసిఆర్ ఆధ్వర్యంలో టిఆర్ఎస్ ఏర్పడి ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని ముందుకు తెస్తున్న నేపథ్యంలో తెలంగాణలో దొరల రాజ్యం రాబోతున్నది జర జాగ్రత్త అని 'మహాజన సంఘర్షణ సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో "తల్లి తెలంగాణ" పుస్తకం రాసి అచ్చువేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ముసుగుల్లో దొరల పాలన ప్రమాదం ఉందని ప్రచారం చేశారు. దానితోపాటు తెలంగాణలో విద్యా, ఉద్యోగ అవకాశాలను 610 జీవో ద్వారా అమలుపరుచాలని డిమాండ్ చేశారు. 2009లో తెలంగాణ ఉద్యమం ప్రారంభం నుండి చేదోడువాదోడుగా ఉద్యమానికి అండగా ఉన్నారు. ఉద్యమం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున రాయలసీమ, కోస్తా ఆంధ్ర సమైఖ్యాంధ్ర పేరుతో తీవ్ర వ్యతిరేక ఉద్యమాలు చేస్తున్న సందర్భంలో ఎమ్మార్పీఎస్ కార్యక్తలు, నాయకులు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాలకు మద్దతుగా వివిధ జిల్లాస్థాయిల్లో దీక్షలు, నిరసన ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు (జగన్, 2019).

తెలంగాణ రాజకీయ జెఎసి ఏర్పడడంతో తెలంగాణ ఉద్యమానికి ఒక మలుపు వచ్చింది. ఈ జెఎసి ఏర్పడడంతో అగ్రకుల రాజకీయాలు ఎలా ప్రభావం చూపారో, ఎలా అణగారిన కులాలకు న్యాయం జరగకుండా సరైన ప్రాతినిధ్యం లేకుండా ఎలా చేశారో ఎప్పటికప్పుడు ఎండగట్టడం ద్వారా సరైన అంబేద్కర్ దృక్పథాన్ని తెలంగాణలో బహుజన కులాలకు అందించారు. ఉద్యమానికి మద్దతు ఇస్తూనే ఉద్యమంలో కులం ఎలా పని చేస్తుందో ఎండగంటారు. జెఎసి ఎలా బడుగు వర్గాలను, వారి ప్రాతినిధ్యాన్ని విస్మరించిందో వివరించారు. తెలంగాణ సాధించింది టిఆర్ఎస్, తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని ప్రచారం చేసుకుంటున్న సందర్భంలో చారిత్రాత్మకంగా అమరుల త్యాగాలు విస్మరించే ప్రమాదం ఉందనే ఉద్దేశ్యంతో నిజాం కాలేజి గ్రౌండ్‌లో "అమరుల తల్లుల కడుపుకోత మహాసభ" వేలాది మంది దాదాపు 200 అమరుల తల్లులను వేదికపై నుండి మాట్లాడించి తెలంగాణ వచ్చిందని చెప్పి వారి త్యాగాలు చరిత్ర పుస్తకాల్లో లిఖించాలని డిమాండ్ చేశారు. టిఆర్ఎస్, మిగతా అగ్రకులస్థులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని తయారు చేసి ప్రచారం చేస్తున్న క్రమంలో "ఐలమ్మ మా అమ్మ" అనే వ్యాసం ద్వారా తెలంగాణలో దొరల గడీలకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ అసలైన తెలంగాణ తల్లి అని సభలు, సమావేశాలు కరపత్రాలు వేశారు. (మందకృష్ణ, 2003).

**ఉపకులాల చైతన్యానికి దండోరా చేయూత**

1994లో మాదిగ దండోరా ఉద్యమం వచ్చేవరకు దళితుల్లో దళితులుగా, ఎస్సీ కులాల్లో అల్పసంఖ్యాక సమూహాలుగా ఉన్న మాదిగ, మాల ఉపకులాలు లేదా అనుబంధ కులాలు దక్కలి, చిందు, మాష్టీ, గోసంగి, గుర్రం మల్లయ్యలు, రెళ్ళి, నేతకాని, మొదలైన సుమారు 60 చిన్న

కులాల జీవితం, వారి సమస్యలు, ఉనికిపై చర్చ ఏ కోనాన వచ్చేదికాదు. ఎమ్మార్పీఎస్ ఎస్సీ కులాలలో ఉన్న ప్రతికులం జనాభా నిష్పత్తి ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లలో వారి వాటా దక్కాలనే డిమాండ్‌తో రావడంతో సంఖ్యాపరంగా మైనార్టీలుగా ఉన్న మాల, మాదిగేతర కులాలపై చర్చ ప్రారంభమైంది. ఒక విధంగా చెప్పాలంటే ఎమ్మార్పీఎస్ లేకుంటే ఈ కులాల గురించి పట్టించుకునేవారే లేరని చెప్పవచ్చు. అనేక సందర్భాల్లో కేవలం మాదిగలే కాదు. మాదిగల్లో ఉన్న అత్యంత అణిచివేతకు గురైన డక్కలి, చిందు, మాస్టి, మొదలైన కులాలకు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అవసరమని నొక్కి చెప్పారు. ఈ వర్గీకరణ జరగడంద్వారా కిందిస్థాయి కులాలకు న్యాయం జరుగుతుందని ఈ కులాలను నిర్మాణం చేయడం ప్రారంభించారు. బహుశ 2005నుంచి ఎమ్మార్పీఎస్ మాదిగ ఉపకులాలను నిర్మాణం చేస్తూ ప్రతి ఉపకులానికి ఒక సంఘం పెట్టి ఉపకులాల నాయకత్వాన్ని ప్రోత్సహించింది. అలా వచ్చిన సంఘాల్లో డక్కలి హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్), చిందు హక్కుల పోరాట సమితి, మాస్టి హక్కుల పోరాట సమితి మొదలైనవి. ఎమ్మార్పీఎస్ చాలా సందర్భాల్లో కిందికులాలకు న్యాయం జరగాలని కోరుకున్నది. ఉదాహరణకు ఎమ్మార్పీఎస్ ముందు నుండి సామాజికంగా, ఆర్థికంగా అత్యంత వెనుకబాటుకు గురైన రెల్లి కులాన్ని, ఎస్సీ వర్గీకరణలో గ్రూపు-ఎలో చేర్చాలని డిమాండ్ చేశారు. (మందకృష్ణ, 2010).

ఎస్సీ సబ్‌ప్లాన్ పై చర్చ వచ్చినప్పుడు కూడా ఎస్సీలో అత్యంత నిరాదరణకు గురైన, సంఖ్యాపరంగా మైనార్టీలుగా ఉన్న దళిత కులాలకు న్యాయం జరగడంకోసం సబ్‌ప్లాన్ నిధులను వారి జనాభా నిష్పత్తి ప్రకారం విభజించాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్ చేసి ఆంధ్రప్రదేశ్‌లో ఆ పాలసిని సాధించింది. దీనికి కొనసాగింపుగా కృష్ణమాదిగ ఎస్సీలో ఉన్న సంచార ఉపకులాలకు వారి అభివృద్ధికోసం "ఫెడరేషన్" ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాడు. బహుశా 2010లో ఉపకులాలకు ఆర్‌డిఓ నుండి కాక ఎంఆర్ఓ నుండి కుల ధృవీకరణ పత్రాన్ని పొందే విధానాన్ని సాధించింది.

**దండోరా ఉద్యమ చీలికలు**

మొదటి నుండి దండోరా ఉద్యమాన్ని బలహీనపరిచే క్రమంలో అనేక కుట్రలు, చీలికలు వివిధ రాజకీయ పార్టీలు చేశాయి. ఇందులో భాగంగా 1997లో టిడిపి పార్టీ కృష్ణమాదిగకు సమాంతరంగా కొంతకాలం ఎదిగిన ఎమ్మార్పీఎస్ నాయకులను ప్రోత్సహించి అంతర్గతంగా కలహాలను సృష్టించే ప్రయత్నం చేశారు. ప్రధానంగా చాలాకాలం పని చేసిన నాయకులను చేరదీసి అన్ని రకాల అవసరాలను సమకూర్చి ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని, నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నం చేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన ఈదుముడి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక సభ్యుడు కనకరావు పిఆర్‌పిలో, వైఎస్ఆర్‌సిపిలో చేరి ఎన్నికల్లో పోటీ చేశారు. రాయలసీమ నుండి రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన దండు వీరయ్య రాష్ట్ర విభజన నేపథ్యంలో ఎమ్మార్పీఎస్‌తో విభేదించి కృష్ణమాదిగ తెలంగాణవాడు కాబట్టి తెలంగాణకు మద్దతు తెల్పుతున్నాడు అనే వాదనలో తాను కొంత మందితో మరో ఎమ్మార్పీఎస్‌ను ప్రారంభించి కరపత్రాలు, కార్యక్రమాలు చేయడం ప్రారంభించాడు. అయితే కృష్ణ మాదిగ ఏకపక్ష నిర్ణయాల పట్ల విసుగు చెందిన నాయకులు కూడా ఎమ్మార్పీఎస్ నుండి దూరమైన సందర్భాలు ఉన్నాయి. అయితే వీళ్ళు కృష్ణమాదిగకు ప్రత్యామ్నాయంగా క్షేత్రస్థాయిలో బలంగా నిజాయితీగా నిర్మాణం చేయలేకపోయారు. అయితే గతంలో ఎమ్మార్పీఎస్‌లో పనిచేసిన విశారదన్ బలమైన మాదిగల సాంస్కృతిక ఉద్యమాన్ని తెలంగాణ ప్రాంతంలో నిర్మాణం చేస్తున్నారు. మిగతా ఏ గ్రూపులు క్షేత్రస్థాయిలో నిర్మాణంలో లేవు. అయితే సుప్రీంకోర్టు వర్గీకరణ అనుకూల తీర్పుతో కొంత కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వస్తున్నది. ఇది మళ్ళీ నిర్మాణంగా మారగలదా. అనేది పెద్ద ప్రశ్న.

**దండోరా ఉద్యమంలో మహిళలు :**

మాదిగ మహిళలు మొదటినుండి దండోరా ఉద్యమంలో స్ఫూర్తివంతమైన పాత్రను పోషించారు. 1994 నాటికి గొప్ప రాజకీయవేత్తగా పేరున్న సదాలక్ష్మి లాంటివారు, శాయశక్తుల దండోరా ఉద్యమానికి బాసటగా నిలిచారు. నిజానికి రాజకీయ నాయకులనుండి పూర్తి మద్దతు దొరికింది. సదాలక్ష్మినుండే అని చెప్పాలి. తాను ఎంఎల్ఎ గా వుంటూనే ఎంఆర్‌పిఎస్ నిర్వహించే అనేక సభల్లో, సమావేశాల్లో, ధర్నాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మొదటినుండి అండగా, ఒక పెద్ద దిక్కుగా వున్నారు. ఉద్యమానికి ఆర్థికంగా సహాయం చేయడంతోపాటు తన ఎంఎల్ఎ నివాసాన్ని ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలకు ఆఫీస్‌గా వాడుకునే అవకాశాన్ని ఇచ్చారు. తాను చనిపోయే వరకు దండోరా ఉద్యమానికి అండగా వున్నారు (గోగుశ్యామల, 2011).

ఎంఆర్‌పిఎస్ మొదట్లో ప్రజా చైతన్యానికి సుదీర్ఘ పాదయాత్రలు చేసింది. ఇలాంటి యాత్రలో మగవారితో సమానంగా పాదయాత్రలో పాల్గొన్న మహిళలు అనేక మంది వున్నారు. మేరి మాదిగలాంటివారు ఒక కార్యకర్తగా, ఒక గాయనిగా, లీడర్‌గా ఉద్యమంలో తన పాత్రను పోషించారు. ఏమాత్రం పేరును, పదవిని ఆశించకుండా మాదిగ జాతి అభివృద్ధే ఆశయంగా పనిచేసిన మహిళల చరిత్ర ఎక్కడ రాయబడలేదు. షాద్‌నగర్ జంగమ్మ, యాదక్క లాంటి వారంటే ఉద్యమంలో అందరికీ గౌరవం వుండేది. అందరూ ఈమెను జంగక్క అనేవారు, కార్యకర్తలకు ఏ రాత్రి వెళ్ళినా అన్నం పెట్టే

పెద్దక్క అని కార్యకర్తలు చెప్పుకునేవారు. ప్రతి ధర్నాల్లో మాదిగ మహిళలు ముందుండి ఉద్యమానికి రక్షణ కవచంగా ఎన్నో లాఠీ దెబ్బలు తిన్నారు. జైళ్ళ పాలై, కోర్టుల చుట్టూ తిరిగారు. రాష్ట్రస్థాయి పిలుపులను అందుకొని ఎన్నో బహిరంగ సభలు విజయవంతం చేయడంతోపాటు వీరోచిత అసెంబ్లీ ముట్టడిలో కూడా వెనుకడుగు వేయలేదు. అలా వీరోచితంగా పోరాడిన భారతి మాదిగ పోరాటంలోనే చివరి శ్వాస విడిచారు.

ఉద్యమకారులుగా, రచయితలుగా పౌర సమాజంలో దండోరా ఉద్యమానికి మద్దతు కూడగట్టడం మేథోపరమైన కృషిని చేస్తున్నవారు వున్నారు. జుపాక సుభద్ర, గోగు శ్యామల, జాజుల గౌరి, సూరేపల్లి సుజాత నిరంతరం పనిచేస్తున్నారు. ఏది ఏమైనా మాదిగ మహిళల శ్రమ, దండోరా ఉద్యమంలో మరువలేనిది. వారి త్యాగం, స్ఫూర్తి అక్షరీకరించబడాలి.

**దళిత సాహిత్య తాత్వికతను, విస్తృతిని పెంచిన మాదిగ సాహిత్యం**

దళిత, తెలుగు సాహిత్య ప్రపంచంలో మాదిగ సాహిత్యం ఒక ప్రవాహంగ వచ్చింది. ముప్పై సంవత్సరాల తర్వాత కూడా ఒక కొత్త వెలుగు ఇస్తున్నది. మాదిగ సాహిత్యం దళిత సాహిత్య తాత్వికతను, విస్తృతిని పెంచింది. కుల నిర్మూలన ఉద్యమంలో సాహిత్యానికి ఉండవల్సిన దృక్పథం, లక్ష్యం స్పష్టంగా ప్రకటించింది. దండోరా ఉద్యమ నేపథ్యంలో మాదిగ సాహిత్యం వచ్చినప్పటికి కేవలం ఉద్యమ ప్రచార సాధనకు ఉపయోగపడే సాహిత్యంగా నిలిచిపోలేదు మాదిగ సాహిత్య ఉద్యమం. దండోరా (ఎంఆర్‌పిఎస్) ఉద్యమం సమాంతరంగా జరిగాయని చెప్పవచ్చు. చుట్టూ మేధో నిశబ్దం, అలుముకున్న సందర్భంలో "మాదిగ సాహిత్య వేదిక" దళిత సాహిత్యానికి కొత్తవెలుగు నిచ్చింది. ఇందులో నాగప్పగారి సుందర్రాజు కృషి మరువలేనిది. సుందర్రాజు వెలువరించిన చండాల చాటింపు (1996) కవితా సంపుటి, దండోరాకు సాహిత్య చాటింపు నిచ్చింది. ఆ తర్వాత 1997 లో "మాదిగ చైతన్యం" కవితా సంపుటి సుందర్రాజు సంపాదకత్వంలో మాదిగ రచయితలను ఏకం చేసే ప్రయత్నం చేశారు. మాదిగ అస్తిత్వాన్ని, సామాజికన్యాయాన్ని ఒక సమూహంగా వ్యక్తీకరించారు (దార్ల వెంటకేశ్వరరావు 2007). తర్వాతకాలంలో వచ్చిన "మాదిగోడు", 'మా ఊరి మైసమ్మ' వంటి రచనలు గొప్ప స్ఫూర్తినిచ్చాయి. సుందర్రాజు తన జీవితకాలంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సభలు, చర్చలు మాదిగ సాహిత్యాన్ని ఒక ఉద్యమంగా నిర్మాణం చేశాయి. ఎండ్లూరి సుధాకర్ చేసిన పరిశోధన, వివిధ రచనలు (1) వర్గీకరణీయం, (2) కొత్తగబిలం, (3) మల్లె మొగ్గల గొడుగు (మాదిగ కథలు) (4) నల్లద్రాక్ష పందిరి వంటి రచనలు దండోరా ఉద్యమానికి మద్దతిస్తూ, సాహిత్యకారుల నిశ్శబ్దాన్ని ప్రశ్నిస్తూ, సామాజికన్యాయాన్ని వ్యక్తీకరించాయి. అనేక మంది కొత్త రచయితలకు స్ఫూర్తినిచ్చాయి (దార్ల వెంకటేశ్వరరావు 2007).

ఉద్యమంలో పాల్గొంటూ రచనలు చేసిన కృపాకర్ మాదిగ, సుపాక సుభద్రల కృషి విలువైనది. కృపాకర్ ఉద్యమంలో నాయకునిగ బాధ్యతలు నిర్వహిస్తూనే వ్యాసాలు రాశారు. జాపాక సుభద్ర కవిత్వం, కథలు, వ్యాసాలు అన్నీ దళిత, అస్తిత్వవాద, ప్రాంతీయ సాహిత్యాలను మాదిగ స్త్రీల అస్తిత్వం నుండి సమీక్షించారు. చాలాగొప్పగా నిరంతరం రచనలు చేస్తున్నారు. వేముల ఎల్లయ్య, గ్యార యాదయ్య లాంటివారు భాష, వస్తు పరంగ తిరుగులేని రచనలు చేసి మాదిగ అస్తిత్వాన్ని ఒక తాత్విక పునాదిగ మలిచారు. జాపాక సుభద్ర, గ్యార యాదయ్య, నాగప్పగారి సుందర్రాజు, బోయ జంగయ్య, వేముల ఎల్లయ్య భాషాపరంగ తమ రచనలో కొత్త వరవడిని తీసుకొచ్చి అగ్రకుల ఆధిపత్య సాహిత్యాన్ని ప్రశ్నించారు. గోగు శ్యామల, జూపాక సుభద్ర సంపాదకత్వంలో వచ్చిన ''నల్లరేగటిసాలు'' (మాదిగ ఉపకులాల స్త్రీల కథలు) గొప్ప స్ఫూర్తి నిచ్చే రచన. మాదిగ ఉపకులాల స్త్రీల నేపధ్యం, జీవిత అనుభవాలనుండి సాహిత్యాన్ని సృష్టించడం చారిత్రాత్మక అవసరం. దండోరా ఉద్యమానికి మేధోపరంగా వ్యాసాలు, చిన్న చిన్న బుక్‌లెట్‌లు అందించిన తేనేటి జయరాజు రచనలు (1) మాదిగలకు ఏమి కావాలి, (2) మాదిగలు నిన్న నేడు రేపు, (3) మాదిగ, చమార్ పర్మినెంట్ పర్సనాలిటీస్ మొదలైన రచనలు తెచ్చారు. ఒక డాక్టర్‌గా పనిచేస్తూనే మొదటి నుండి మేధోపరమైన రచనలు అందించిన వ్యక్తి, నిరంతరం తన పరిధిలో కార్యాచరణలో ఉండే వ్యక్తి డా॥ తేన్నీటి జయరాజు. చింతాడ గౌరీప్రసాద్ మొదటినుండి ఉద్యమంలో పాల్గొని (1) మాదిగలు మేల్కొన్నారు, (2) జాంబవంతుడు, (3) ఆరం జ్యోతి, (4) పోరాట పథంలో మందకృష్ణ మాదిగ, (4) వర్గీకరణ – అంబేద్కర్ అభీష్టం లాంటి రచనలు చేశారు. ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ కాశీం నిరంతరం రచనలు, మేధోపరమైన చర్చల్లో పాల్గొంటూ దండోరా ఉద్యమానికి, మాదిగ సాహిత్య ప్రవాహానికి చేయూత నిస్తున్నారు. ముప్పయేళ్ల తర్వాత కూడా మాదిగ సాహిత్యం ఒక ప్రవాహంగా నడుస్తున్నది.

సాహిత్యంలో పాట ముఖ్యమైన పాత్ర పోషించింది. దండోరా సామాజికన్యాయాన్ని, మాదిగల అస్తిత్వాన్ని పాటల రూపంలో స్థిరీకరించి, గొప్పగా ఆవిష్కరించిన మాదిగ మహజన మోధుడు "ఎర్ర ఉపాళి నేనే", ఎర్ర ఉపాళి ఎన్నో పాటలు రాసి ఇటు ఉద్యమానికి, అటు మాదిగ సమాజానికి చైతన్యాన్ని అందించాడు. తాను రాసిన పాటలు అనేక మంది పాడారు, మాదిగల పోరాట పాట, జంబూద్వీప జాంబవంతునిపై పాట, సబ్బండ కులాలపై పాట, మాదిగ ఉపకులాలపై పాట, లందపై పాట, కాకిపై పాట, మాదిగ సాహిత్య ఉద్యమంలో ఎప్పటికీ నిలిచిపోయే పాటలు (డప్పోళ్ల రమేష్ 2001).

గతంలో దళిత సాహిత్యంలో జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకొని మాదిగ రచయితలు మాదిగ కులాలపై కవిత్వం, కథలు, పాటలు రాశారు. ఎండ్లూరి సుధాకర్ గోసంగులు, డక్కలి, మెహతర్ వారిపై, వేముల ఎల్లయ్య గోసంగులపై పరిశోధన చేశారు. జుపాక సుభద్ర, డక్కలి, చిందు, గోసంగి మొదలైనవారిపై, మేరీ మాదిగ మాష్టిలపై, గోగు శ్యామల డక్కలి, చిందు, గోసంగి, బైండ్ల మెహతర్ వారిపై పరిశోధనలు, రచనలు చేశారు. ఈ స్ఫూర్తితోనే ఉపకులాలనుండి వచ్చిన వ్యక్తుల్లో గడ్డం మోహనరావు కృషి విలువైనది. తాను సుమారు 8 రచనలు, తీసుకొచ్చారు. చిందు కులం నేపథ్యంగా కళాకారుల జీవిత చరిత్రలు (1) చిందుల ఎల్లమ్మ జీవిత చరిత్ర, (2) చిందుల శ్యామ్ జీవిత చరిత్ర, (3) గడ్డం సమ్మయ్య జీవిత చరిత్ర, (4) గడ్డం మచ్చయ దాసు చేసిన చిందు జాంబవ పురాణం, ఇతర రచనలు మోహన్ తన సంపాదకత్వంలో తీసుకొచ్చారు. తాను రాసిన "కొంగవాలు కత్తి" నవలకు కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం కూడా దక్కింది. ఉపకులాలపై ఉదహరణకు డక్కలి జాంబవ పురాణం, జయధీర్ తిరుమలరావు, నులక చందయ్య జాంబవ పురాణం పులికొండ సుబ్బాచారి, బైండ్ల జాంబవ పురాణాన్ని జిలుకర శ్రీనివాస్ రచనల రూపంలో తీసుకొచ్చారు. జిలుకర శ్రీనివాస్ తీసుకొచ్చిన బైండ్ల సెంద్రయ్య కథలు, బైండ్లవారి జీవితాన్ని, సంస్కృతిని తెలియజేస్తాయి. గనిశెట్టి రాములు గోసంగుల పై రచనలు చేస్తున్నారు. వారి రచనలు గోసంగుల జీవితం సంస్కృతి పోరాటాన్ని తెలియజేస్తాయి.

ఇప్పటి యువ రచయితలు కూడా చాలా సృజనాత్మకంగ రచనలు చేస్తున్నారు. పౌరసమాజంలో సాహిత్య రచనలు చేస్తున్నారు. పసునూరి రవీందర్ "అవుట్ ఆఫ్ కవరేజ్" కథాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమి యువ పురస్కారం కూడా దక్కింది. నలిగంటి శరత్ లాంటివారు మాదిగ జీవిత నేపథ్యం నుండి అనేక పాటలు రాసి పాడారు. గుర్రం సీతారాములు, కత్తికళ్యాణ్ లాంటివారు పరిశోధన చేస్తున్నారు. కోవిడ్ తర్వాత ఒక కొత్త ప్రయోగంగా "జంబూ సాహితి" పేరుతో మరో సాహిత్య వేదిక ఏర్పాటు చేసి విస్తృతంగా గుడిపల్లి నిరంజన్, సిద్దెంకి యాదగిరి, తప్పెట ఓదయ్య, ఎజ్రాశాస్త్రి ఎందరో నిరంతరం సాహిత్య కృషి, సభలు, సమావేశాలు, రచనలు చేస్తున్నారు. దళిత కథావార్షికను కూడా నూతన రచయితలకు పరిచయం చేస్తూ, సాహిత్యాన్ని విస్తృతపరుస్తున్నారు. దార్ల వెంకటేశ్వరరావు మొదటి నుండి మాదిగ సాహిత్యంపై పరిశోధన చేస్తూ, వాటిని రచనలుగా వెలువరిస్తున్నారు. (1) వారు తెచ్చిన ఒక మాదిగ- స్మృతి- సుందర్రాజుగారి జీవితం – సాహిత్యం, (2) దళిత సాహిత్యం – మాదిగ దృక్పథం విలువైనవి. దార్ల వెంటేశ్వరరావు మాదిగల సాహిత్యంపై ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను నడపడం స్ఫూర్తినిచ్చే అంశం. ఇప్పుడు దళిత సాహిత్యం మాదిగల సాహిత్య రూపంలో ముందుకు నడుస్తున్నది. దండోరా చేపట్టిన మానవీయ సమస్యలపై కూడా సాహిత్యం తీసుకొచ్చారు. వేముల ఎల్లయ్య, సంపంగి శంకర్, అవిటి కథలు పుస్తకంగా వెలువరించారు. మాదిగ సాహిత్యం సమాజంలో అట్టడుగు కులాల అనుభవాలు, ఆకాంక్షలు, ప్రాతినిధ్యం పునాదులుగ, సృష్టించాలని నిరూపించింది.

**దండోరా స్వతంత్ర, ప్రత్యామ్నాయ రాజకీయాల వెలుగు – నీడలు**

చాలాకాలంగా తెలుగు రాష్ట్రాల్లో ఒక బలమైన చర్చ జరుగుతున్నది అది–వర్గీకరణ ముందా, లేదా రాజ్యాధికారం ముందా అనే అంశం. బహుజన రాజకీయాలకోసం పనిచేసే శక్తులు వర్గీకరణను చాలా చిన్న అంశంగా లేదా ఒక అనవసర అంశంగా పరిగణిస్తున్నాయి. అటు వర్గీకరణకోసం పోరాడే శక్తులకు, బహుజన రాజకీయాలపై ఒక విరక్తి ఉంది. రాజకీయ ఆచరణ లేదు. ఈ రెండు రకాల వాదనలు ఒక తప్పుడు అవగాహనను పెంచేవేగాక విశాల రాజకీయాలకూ, అంబేద్కర్ భావజాలవ్యాప్తికీ అడ్డంకిగా నిలుస్తాయి. కనుక ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌కు మద్దతు తెలపటమూ, బహుజన రాజకీయాలు నిర్మించడమూ రెండూ విరుద్ధమైన అంశాలు కావు. అవి పరస్పర ప్రోత్సాహక అంశాలు. కాబట్టి తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణను బలపరిచే బహుజన రాజకీయాల నిర్మాణం నేటి అవసరం. మాల మహానాడు నాయకులు రాజ్యాధికార నినాదాన్ని వర్గీకరణ వ్యతిరేక వాదనకు వాడుకుంటున్నారు. కానీ కొంతలో కొంతైనా నిజాయితీతో వర్గీకరణను సమర్థించే బహుజన రాజకీయాల కోసం పని చేస్తున్నవారు ఉన్నారు. కొన్ని సందర్భాల్లో మినహాయించి, ఎమ్మార్పీఎస్ మొదటినుంచి స్వతంత్ర రాజకీయాల అవగాహనతోగానీ, ఆ లక్ష్యంతోగానీ పనిచేయలేదు. ఎమ్మార్పీఎస్ ఇతర పార్టీల్లో ఉన్న తమ జాతి నాయకులను పెంచుకోవడంతోనో వాళ్ళ ప్రాబల్యం చూపించుకోవడంతోనో సరిపెట్టుకుంటే మాదిగజాతి ఎప్పటికీ స్వతంత్ర రాజకీయాలను నిర్మించలేదు.

చాలామంది ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు చెప్పేదేమిటంటే వర్గీకరణ అయిన వెంటనే స్వతంత్ర రాజకీయాలను నిర్మిస్తామని, ఆ వైపున కార్యకర్తలను సన్నద్ధం చేస్తామని చెబుతారు. అయినా ముప్పై సంవత్సరాల్లో రాని లేదా అలవాటుపడని స్వతంత్ర రాజకీయాలు, మన ఓట్లు మనం వేయించుకుందాం అనే అవగాహన, ఆచరణ వర్గీకరణ అయిన తెల్లారే రావడానికి ఇదేమైనా మాయజాలమా? ఈ రకమైన వాదన దాటవేతకూ, సమర్థించుకోవడానికి ఉపయోగపడే

వాదననే కానీ కార్యకర్తల్లో వర్గీకరణతోపాటు స్వతంత్ర రాజకీయాలను పెంపొందించే ఆలోచనగాని, ఆచరణగాని కాదు. స్వతంత్ర రాజకీయాలను నిర్మించాలనే ఆలోచన భావజాల పునాదిగా ఉన్న కార్యకర్తలను, నాయకులను తయారు చేస్తుంది. ముప్పై ఏళ్ళలో ఎమ్మార్పీఎస్ రాజకీయ విజయం ఇతర పార్టీలలోని మాదిగ ప్రతినిధుల్లో చూసుకోవడం తప్ప తనకంటూ ఒక గ్రామస్థాయి సర్పంచ్ లేకపోవడం ఒక విషాదకర వైఫల్యం.

**ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణను అనుమతిస్తూ సుప్రీంకోర్టు తీర్పు, తర్వాత పరిణామాలు**

తేది 1 ఆగస్టు, 2024, నాడు సుప్రీంకోర్టు ఎస్సీల రిజర్వేషన్స్ వర్గీకరణను అనుమతిస్తూ, రాష్ట్రాలకు అధికారం ఇచ్చింది. దీనితో దేశంలో దళితులంతా అత్యంత వెనుకబడిన కులాల ఉద్యమాలకు కొంత మేరకు చట్టపరంగ, సానుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పవచ్చు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎస్సి వర్గీకరణ ఉద్యమం చట్టపరంగ విజయం సాధించిందని చెప్పవచ్చు. కోర్టు తీర్పు వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా రిజర్వేషన్లు, వర్గీకరణ, కోర్టు ప్రస్తావించిన క్రీమిలేయర్‌పై నిరసనలు జరిగాయి. ఆగస్టు 21 తేదీన భారత్‌బంద్‌కు మద్దతుగా మాయావతి, చంద్రశేఖర్ ఆజాద్, ప్రకాష్ అంబేద్కర్, చిరాక్ ఫాస్వాన్, తిరువలన్ మద్దతిచ్చారు. తిరువలవన్ ఒక అడుగు ముందుకువేసి సుప్రీమ్ కోర్టులో రివ్యూ పిటిషన్ వేశారు. తెలుగు రాష్ట్రాల నుండి మల్లేల వెంకటరావు రివ్యూ పిటిషన్ వేశారు. అయితే సుప్రీమ్ కోర్టు పిటిషన్స్‌ను కొట్టి వేసింది. సుప్రీంకోర్టు రాజ్యాంగంలో ఆర్టికల్ 15, 16 ప్రకారం అందరికి సమానత్వం, సమాన అవకాశాల సూత్రం ప్రకారం అర్టికల్ 341 కి ఎలాంటి భంగం లేకుండా రాష్ట్రాలు సరైన, సమాచారం, ఆధారాలతో వివిధ ఎస్సి కులాల మధ్య అసమానతలను నిరూపించి, వాటి నిర్మూలనకు వర్గీకరణ చేయవచ్చు. ఈ ప్రక్రియ ఎస్సి జాబితాలో వున్న కులాలను తొలగించడానికి లేదా చేర్చడానికి సంబంధించింది కాదని చెప్పింది. కాబట్టి రాజ్యాంగ పరిధిలోనే రాష్ట్రాలు వర్గీకరణ చేసుకోవచ్చని వాదించింది. ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా వున్నవారు ఇది రాజ్యాంగ విరుద్ధమని పార్లమెంటుకు మాత్రమే 341 ఆర్టికల్స్‌ను ముట్టుకునే అధికారం ఉందని ఆరోపిస్తున్నారు. చాలామంది కోర్టు తీర్పును ఆహ్వానిస్తూనే జడ్జీలు తమ అభిప్రాయంగా చెప్పిన ఎస్సి లో క్రీమిలేయర్ ప్రస్తావన సామాజిక న్యాయ సూత్రానికి వ్యతిరేకమని గమనించారు. (మందకృష్ణ మాదిగ 2024). ఏది ఏమైనా దేశవ్యాప్తంగా ఎన్ని నిరసనలు వున్నా వివిధ రాష్ట్రాల్లో వర్గీకరణ తీర్పుపై దాని అమలుకు కమీషన్స్ నియమించాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సి వర్గీకరణ మొదటగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కమిషన్స్ నియమించి కావాల్సిన చర్యలు తీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మాదిగలు కృష్ణ మాదిగ నాయకత్వంలో విస్తృతంగా సభలు సమావేశాలు నిర్వహిస్తూ, రెండు ప్రభుత్వాలను వర్గీకరణ అమలుకు డిమాండ్ చేస్తున్నది. దీనికి వ్యతిరేకంగా మాల మహానాడు లేదా మాలల ఆధ్వర్యంలో వ్యతిరేక సమావేశాలు జరుగుతున్నాయి. ఇదే అదునుగా పాలక రాజకీయ పార్టీలు వివిధ గ్రూపుల ద్వారా లేదా వారి వారి మాల మాదిగ ఎంఎల్ఎల ద్వారా ఆత్మీయ సభలతో ఒక ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. పౌర సమాజంలో వర్గీకరణ ఏ పద్ధతిలో జరగాలి అన్న చర్చ చాలావరకు జరగడం లేదు. అగ్రవర్ణాలకు ఎలాంటి నష్టం లేదు. కాబట్టి వర్గీకరణ తప్పనిసరిగా చేసే అవకాశం వున్నది. అయితే ఇదే పాలక వర్గాలు ఈ సమస్య నిరంతరం కొనసాగడానికి పాలక పార్టీలే మాల గ్రూపులకు ఆర్థికంగా చట్టపరంగా సహకరించి మళ్ళీ కోర్టులో పిటిషన్స్ వేసి వాటి ద్వారా మాల–మాదిగ, లేదా బహుజన రాజకీయాలకు తావు లేకుండా చేసే కుట్రదాగి వున్నది కాబట్టి వర్గీకరణను కోరుకునే మాదిగలు ఈ కుట్రలను పసిగట్టి వర్గీకరణను అమలు పరుచుకుంటూనే, మాదిగల ప్రత్యామ్నాయ రాజకీయాలను నిర్మాణం చేయవలసిన తక్షణ అవసరం వున్నది. దీనితోపాటు వర్గీకరణ సమస్య ముసుగులో నాయకులు చేసే కుట్రలు, మాదిగల భవిష్యత్ రాజకీయాలకు వ్యతిరేక వాదనలు ఎండగట్టి, వారి కార్యచరణను, వారు వివిధ పార్టీలకు మాదిగల భవిష్యత్తు తాకట్టుపెట్టే చర్యలను ఎప్పటికప్పుడు బట్టబయలు చేయవలసి ఉంది.

**ముగింపు**

ముప్పై సంవత్సరాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమం తెలుగు నేలపై బలమైన ప్రభావం చూపింది, ఎన్నో ప్రజా ఉద్యమాలకు ప్రాణం పోసింది. ఇది కేవలం మాదిగ సమాజంపైనే కాకుండా ప్రజా ఉద్యమాల చరిత్రల్లో కొత్త ఒరవడిని అందించింది. అయితే ఒక కులం, ఒక డిమాండ్ కేంద్రంగా నిర్మాణం అయ్యే ఉద్యమాల పరిమితిని కూడా దండోర ఉద్యమం ద్వారా తెలుసుకోవచ్చు. రిజర్వేషన్ ఫలాలలో మాదిగలకు, కిందిస్థాయి కులాలకు జరుగుతున్న అన్యాయాన్ని బయట పెట్టడంలో, వారి ఆత్మగౌరవాన్ని పౌర సమాజంలో నిలబెట్టి చైతన్యాన్ని కొంతమేరకు ఇది అందించింది. కాని వారికి సాంస్కృతిక, రాజకీయ జీవితానికి ప్రత్యామ్నాయాన్ని ఇవ్వలేదు. ఆ వైపున కార్యాచరణను ఇప్పటికీ నిర్దిష్టంగా ప్రకటించలేదు. ఎమ్మార్పీఎస్‌తో చాలాకాలంగా పనిచేసి వివిధ కారణాలద్వారా ఎమ్మార్పీఎస్‌కు దూరమైనవారు కూడా ఎమ్మార్పీఎస్‌కు ప్రత్యామ్నాయంగా మాదిగలను నిర్మాణం చేయలేదు. ఒక విశారదన్ మహారాజ్ తెలంగాణ ప్రాంతంలో మాదిగల్లో ఒక

బలమైన సాంస్కృతిక ఉద్యమం పదిహేను సంవత్సరాల నుండి నిర్మాణం చేస్తున్నారు. డిఎస్‌పి ఉద్యమం భవిష్యత్‌లో మాదిగ సమాజంలో ఒక మౌలిక మార్పు తీసుకొచ్చే అవకాశం ఉంది.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సూత్రప్రాయంగా అన్ని రాజకీయ పార్టీలు అనుకూలమని చెప్పినప్పటికి ప్రతి ఎన్నికల్లో ఈ సమస్యను తమ తమ రాజకీయాలకు అనుకూలంగా వాడుకుంటూ మాదిగ సమాజాన్ని ఓట్ల రాజకీయాలకు బలిచేస్తూ వచ్చారు. ఇప్పుడైన రాజకీయ పార్టీలు మద్దతు తెల్పి ఆచరణలో మాదిగలకు అండగా ఉండాలి. అయితే ఈ ముప్పై సంవత్సరాల్లో ఓటు చైతన్యాన్ని తేవడంలో ఎమ్మార్పీఎస్ విఫలమయింది, కేవలం వివిధ పార్టీల్లో మాదిగ ప్రతినిధులను పెంచుకోవడంతో సంతృప్తి చెందడం మాదిగ సమాజ భవిష్యత్‌ను ఆందోళనలో పడేసే అంశం. కనుక రాజకీయాలతో ముడిపడి ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను ప్రత్యామ్నాయ రాజకీయాలతోనే పరిష్కరించగలమని తెలుసుకోవాలి.

ఎమ్మార్పీఎస్ ముప్పై సంవత్సరాల్లో వందలాది మంది నాయకులను తయారుచేసింది. ఎమ్మార్పీఎస్ అందించిన నాయకత్వం మరే కుల సంఘం అందించలేదని చెప్పవచ్చు. ఎమ్మార్పీఎస్‌తోనే మాదిగ ఉపకులాల నాయకత్వం కూడా పెరిగింది. వివిధ రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణ సమస్య కేంద్రంగా ఎమ్మార్పీఎస్ కృష్ణమాదిగ న్యాయకత్వంలో చర్చ ప్రారంభించింది. ఈ చర్చ దేశవ్యాప్తంగా కొన్ని కొత్త ప్రశ్నలను దళిత ఉద్యమానికి అందించింది. దళిత మేధావి వర్గం, నాయకత్వం దళిత కులాలలో ఇప్పటికే ఎదిగిన కులాల ప్రతినిధులు, మాల మహానాడు నాయకులు అంబేద్కర్ దృక్పథంలో ఈ సమస్యను అర్థం చేసుకొని మద్దతు తెల్పవలసి ఉంది. వీరు మౌనంగా ఉన్నా, వ్యతిరేకంగా పనిచేసినా నైతికంగా వైఫల్యం చెందినవారవుతారు. ఈ వర్గీకరణ సమస్యను కేవలం రిజర్వేషన్ల పంపిణి సమస్యగానే కాకుండా దీని మూలాలు దళితకులాల్లో ఉన్న సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక అసమానతలను, అంటరానితనం అనే అంశాలను లోతుగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను అన్వేషించాలి.

కారంచేడు ఉద్యమం తర్వాత దళిత సాహిత్యం తెలుగు సాహిత్యాన్ని ప్రజాస్వామీకరించింది. దండోరా ఉద్యమ ప్రభావంతో మాదిగ కవులు, రచయితలు, కళాకారులు, అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టించారు. ముప్పై ఏళ్ళ తర్వాత కూడా మాదిగ సాహిత్యం ఒక ప్రవాహంగా కొనసాగుతున్నది. ఈ స్ఫూర్తితోనే ఉపకులాల రచయితలు, కవులు కూడా గొప్ప సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. ఈ సాహిత్యం దళిత సాహిత్య తాత్వికతను మరింత విస్తృతం చేస్తున్నది. మాదిగ సాహిత్యకారులు బహుజన సాహిత్య స్పృహ కలిగి ఉండడం మంచి పరిణామం. రాజ్యాధికార స్ఫూర్తినిచ్చే సాహిత్యం ఇంకారావల్సి ఉంది.

మాదిగలకు ప్రత్యామ్నాయ భావజాల పునాది గల రాజకీయాల ఆలోచననూ, ఆచరణనూ అందించలేని ఏ నాయకుడు, ఏ సంస్థ మాదిగల, ఉపకులాల విముక్తికి పూర్తి న్యాయం చేయలేదు. నేడు మాదిగల భవిష్యత్‌ను కోరుకుంటున్న ప్రజలు, కార్యకర్తలు, నాయకులు, బుద్ధిజీవులు ఎస్సీ వర్గీకరణ సాధనతోపాటు స్వతంత్ర రాజకీయాల నిర్మాణం వైపు భవిష్యత్ ఉద్యమాలను నిర్మించవల్సిన అవసరం ఉంది. మాదిగలు పూలే, అంబేద్కర్, కాన్షీరామ్ సిద్ధాంతాల వెలుగులో బహుజన, మహాజన సమాజానికి దిక్సూచిగా నిలువల్సిన అవసరం ఉంది.

**ఉపయుక్త గ్రంథాలు**


1. కృష్ణ మాదిగ ఇంటర్వ్యూ (2010) "ఓపెన్ హార్ట్‌విత్ ఆర్‌కె" ఎబిఎన్ (సోర్స్ యూట్యూబ్)
2. కృపాకర్ మాదిగ, జుపాక సుభద్ర - సంపాదకులు (2008) "కైతునకల దండెం" దండోరా ప్రచురణలు, హైదరాబాద్.
3. చింతాడ గౌరీ ప్రసాద్ (2007) "పోరాట పథంలో మందకృష్ణ మాదిగ" ప్రచురణ రంగటి సత్యం మాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ఆంధ్రప్రదేశ్.
4. చిలుమూరి శ్రీనివాసరావు (2011) "మాదిగల చరిత్ర - సంస్కృతి" జ్యోతి గ్రంథమాల ప్రచురణ, తిరుపతి.
5. డప్పోల్ల రమేష్ (సంపాదకులు, 2021) "అక్షర దండోరా", బహుజన సాంస్కృతిక వేదిక, తెలంగాణ.
6. దార్ల వెంకటేశ్వరరావు (2007) "ఒక మాదిగ స్మృతి" తెలుగు సాహిత్య వేదిక, హైదరాబాద్
7. పచ్చల రాజేష్ (2020) "రాత నా దండోరా" పచ్చల రాజేష్ ప్రచురణ, గుంటూరు.
8. మందకృష్ణ మాదిగ (2003) "తల్లి తెలంగాణ" ప్రచురణ మాదిగ, మహాజన సంఘర్షణ సమితి, హైదరాబాద్.
9. స్టూడెంట్ మార్చ్ (2019) "25 వసంతాల దండోరా ఉద్యమం" ప్రత్యేక సంచిక-6, సంపుటి-5 (జులై మాసం)
10. సాంబయ్య గుండిమెడ (2006) "బ్రాహ్మణత్వ మాలత్వమా-మానవత్వ అంబేద్కరత్వమా...?" రాజ్యం ప్రచురణలు, హైదరాబాద్.


★ **రచయిత: అసోసియేట్ ప్రొఫెసర్, అలహాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ**

# హైడ్రా - పర్యావరణ సవాళ్లు: సామాజిక న్యాయం

డా. చాకేటి రాజు

*"పర్యావరణ సమస్యలు, సామాజిక న్యాయం వీటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకపోతే, మనం సుస్థిర భవిష్యత్తును సృష్టించలేము"*

"హైడ్రా'...'హైడ్రా'... తెలంగాణలో ఇప్పుడు దీనిచుట్టే చర్చ అంతా..!! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక ఈ 'హైడ్రా' ప్రాజెక్టు. ఇప్పుడు రాష్ట్రంలో "హాట్ టాపిక్"గా మారింది. హైడ్రా పేరు, దీని హైరానా ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తోపాటు ప్రతి పల్లెల్లోను మారుమోగుతుంది. ఏర్పాటైన అతికొద్ది రోజుల్లోనే అత్యంత చర్చా ప్రాముఖ్యతను సంతరించుకొని దూకుడుగా ముందుకెళ్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అక్రమ కట్టడాల కూల్చివేతల పనిలో నిమగ్నం అయ్యింది. కబ్జా అని తేలితే చాలు నోటీసులు కూల్చివేతల పర్వం కొనసాగిస్తుంది. తమ్మిడికుంటలో సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలు కూల్చివేతతో హైడ్రా ఒక్కసారిగా పతాక శీర్షికన వార్తల్లోకి ఎక్కింది.

ఒకవైపు కూల్చివేతలు, ఇంకోవైపు బాధితుల రోదనలు వెరసి "హైడ్రా స్థాపన" గురించి అనుకూల, ప్రతికూల వాదనలు సామాజిక, రాజకీయ సంఘర్షణకు దారితీశాయి. ఈ అంశాన్ని సామాజిక న్యాయం, స్థిరమైన అభివృద్ధి, విపత్తుల నిర్వహణవంటి వివిధ కోణాల్లో క్లుప్తంగా విశ్లేషణ చేయాల్సిన ఆవశ్యకత ఉంది. హైడ్రా స్థాపనకు ఉద్దేశించబడిన లక్ష్యాలు మానవ-పర్యావరణ సమతుల్యత అలాగే పట్టణ పేదలకు ఒనగూరే సామాజిక న్యాయం అనే కోణంలో విశ్లేషణ అత్యంత సంక్లిష్టమైన అంశంగా భావించవచ్చు. సమకాలీన రాజకీయ ఛత్రంలో ప్రభుత్వాలు రూపొందించే ఎటువంటి అభివృద్ధి పథకమైన/ప్రాజెక్టు అయినా ముఖ్యంగా 'ఆవశ్యకత', 'నిబద్ధత', 'నిర్మాణాత్మకత' అను మూడు ప్రధాన అంశాలను కూడా కలిగి ఉండాలి. ఇందులో ఏ ఒక్కటి లోపించినా అది లోపభూయిష్టంగా తయారవుతుంది. ఈ అంశాల ఆధారంగా చూస్తే, "హైడ్రా స్థాపన ఎటువైపు సాగుతుందో ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది.

## హైడ్రా ఏంటి..?

హైడ్రా (HYDRA) అంటే 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్'. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) పరిధి, పరిసర ప్రాంతాల్లోని నీటి వనరులపై ఆక్రమణలను అరికట్టడానికి ఉద్దేశించిన 'ఎన్ఫోర్స్మెంట్', 'విజిలెన్స్, విపత్తు నిర్వహణ' (ఇవిడిఎం) విభాగంలో మార్పులు చేర్పులు చేసి దీన్ని స్థాపించారు. జూలై 19, 2024 లో జీవో-99 ద్వారా, ఎన్ఫోర్స్మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాన్ని పునర్-వ్యవస్థీకరించి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూమి, నీటి వనరులపై ఆక్రమణలను తొలగించటానికి ఉద్దేశించినదే హైడ్రా అనే సంస్థ.

జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేసారు. హైదరాబాద్ సిటీ విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలను అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ను రూపొందించారు. హైదరాబాద్ నగర పరిధిలోని చెరువులు కబ్జాకు గురికాకూడదనేది ప్రధాన లక్ష్యం. చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటైన హైడ్రా పరిధి, ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) వరకు విస్తరించి ఉంటుంది. ప్రభుత్వం కల్పించిన విస్తృత అధికారాలతో అక్రమ నిర్మాణాలను బుల్డోజ్ చేసేస్తోంది.

ప్రభుత్వ డేటా ప్రకారం, గడిచిన మూడు నెలల్లో 'ఆక్రమణదారుల' నుంచి అన్యాక్రాంతమైన 43.94 ఎకరాలను హైడ్రా తిరిగి స్వాధీనం చేసుకుంది. ఇప్పటివరకు హైడ్రా 166 ఆక్రమణలపై చర్యలు తీసుకుంది అలాగే ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని పరిసర ప్రాంతాలలో 18 ఆస్తులను కూల్చివేసింది. హైడ్రాకు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారు. అంతేకాకుండా ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మంత్రులు ఇందులో సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, జీహెచ్ఎంసీ మేయర్ కి కూడా ఇందులో చోటు కల్పించారు. హైడ్రాకు సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ

రంగనాథ్ కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఈయన వరంగల్, హైదరాబాద్ సీపీగా వివిధ హోదాల్లో పని చేశారు. ఆక్రమణలను అడ్డుకోవడంలో, చట్టబద్ధంగా వాటిని తొలగించడంలో ఆయన శక్తివంతమైన నిర్ణయాలు తీసుకుంటారని భావిస్తున్నారు. జీహెచ్ఎంసీతోపాటు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పనిచేయాల్సి ఉంటుంది. పని విభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశంతోపాటు కొద్దిరోజుల క్రితమే ప్రభుత్వ జీవోని గవర్నర్ ఆమోదించడముతో చట్టబద్ధత కల్పించారు. కానీ ఆ చట్టం రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కచ్చితంగా ఆమోదం కావాల్సి ఉంది.

## హైడ్రా ఏం చేస్తుంది..?

విపత్తుల నిర్వహణతోపాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలను తొలిగించటం, అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుంది. నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, ప్రకటనల తొలిగింపు వంటివి కూడా హైడ్రా కిందకే వచ్చాయి.

## హైడ్రా లక్ష్యాలు: చెరువుల పరిరక్షణలో కొత్త శకం

హైడ్రా, ప్రధాన లక్ష్యం హైదరాబాద్ నగర పరిధిలో చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడటం. హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాలు, కబ్జాలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో హైడ్రా అనే సంస్థ ఏర్పాటు చేయడంవల్ల ఈ సమస్యలపై కఠినంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. హైడ్రా పరిధి ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించి ఉంటుంది. అందులోని చెరువుల పరిరక్షణతోపాటు అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంవంటి బాధ్యతలు ఉన్నాయి.

ఇప్పటికే పని ప్రారంభించిన హైడ్రా... చాలాచోట్ల అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోంది. హైడ్రా కూల్చివేతలో ప్రధాన పాత్ర వహించే రెండు అంశాలు: నీటి వనరులను రక్షించడానికి, వాటి సహజ స్థితిని నిర్వహించడానికి, వరదల ప్రమాదాన్ని తగ్గించడానికి ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL), బఫర్ జోన్లు ముఖ్యమైనవి. ఒకటి–ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) అనేది ఒక చెరువు లేదా సరస్సు వంటి ఒక జలాశయం చేరుకోగల గరిష్ట నీటి మట్టం. జలాశయాల చుట్టూ బఫర్ జోన్ల ఏర్పాటుకు ఇది కీలక రిఫరెన్స్ పాయింట్ గా చెప్పవచ్చు. రెండోది–బఫర్ జోన్, నీటి వనరుల చుట్టూ, నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యకలాపాలు పరిమితం చేయబడిన ఒక నిర్దిష్ట ప్రాంతం. జలాశయం పరిమాణం ఆధారంగా బఫర్ జోన్లకు తెలంగాణ కొన్ని మార్గదర్శకాలను ఏర్పాటు చేసింది. భారీ నీటి వనరులు: కనీసం 30 మీటర్లు, మధ్యతరహా జలాశయాలు: 15 నుంచి 20 మీటర్లు, చిన్న నీటి వనరులు: కనీసం 9 మీటర్లు గా ఉండాలి.

వివరంగా చెప్పాలంటే 1. నగరపాలక సంస్థ, మున్సిపాలిటీ, నగర పంచాయతీ పరిధిలో కట్టడాలు చెరువు లేదా సరస్సు సరిహద్దుకు 50 మీటర్ల దూరంలో ఉండాలి. 2. 10 హెక్టార్లు (హెక్టార్లు) లేదా అంతకంటే ఎక్కువ వైశాల్యం కలిగిన సరస్సులు, చెరువులు లేదా కుంటల FTL సరిహద్దుకు 30 మీటర్ల దూరంలో, 30 మీటర్ల బఫర్ స్ట్రిప్ లోపల 12 అడుగుల వెడల్పుతో వాకింగ్ ట్రాక్ ఉండాలి. 3. 10 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న సరస్సులు, చెరువులు లేదా కుంటల ఎఫ్టిఎల్ సరిహద్దు నుండి 9 మీటర్లు (శిఖం భూములు) 4. కాలువ సరిహద్దు నుండి 9 మీటర్లు, వాగు (చిన్న ప్రవాహం), నాలా లేదా 10 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న వాటికి వర్షపునీటి కాలువ అదనం. ఇలా చెరువుల చుట్టూ అక్రమ నిర్మాణాలను నిరోధించేందుకు, ఆక్రమణలను పర్యవేక్షించడానికి హైడ్రా జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జిఐఎస్), రియల్ టైమ్ డేటాను కూడా ఉపయోగిస్తుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో హైడ్రా చర్యలు హాట్ టాపిక్ గా మారాయి. మరోవైపు అధికార, ప్రతిపక్ష పార్టీ నేతల ఫామ్ హౌస్ లు కూడా చర్చకు వస్తున్నాయి. నిజానికి చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములను కాపాడటం అంత ఈజీ కాదు. ఇప్పటికే ఎన్నో భూములు ఆక్రమణలకు గురయ్యాయి. వాటిల్లో కొన్నింటిని గుర్తించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అయితే తాజాగా ఏర్పాటైన హైడ్రాకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయి. నిజానికి హైదరాబాద్ పరిధిలో ఎన్నో కట్టాడాలు రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే జరిగాయి. ఇప్పుడు వాటిని కూల్చివేయడం చాలామంది నేతలకు మింగుడుపడటం లేదు. అక్రమ నిర్మాణాలకు పరిష్మన్లు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు ఉంటాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఇదే జరిగితే, చాలామంది అధికారుల బాగోతం బయటికి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం దూకుడుగా ముందుకెళ్తున్న హైడ్రా.. ఇదే వేగాన్ని కొనసాగిస్తుందా..? లేక ఏమైనా రాజకీయ, సాంకేతిక అడ్డంకులతో నెమ్మదిస్తుందా..? అనేది టాక్ ఆఫ్ ది తెలంగాణగా మారింది..!

## హైడ్రా – అనుకూల వాదనలు

### 1. మెరుగైన విపత్తు నిర్వహణ

హైడ్రా ప్రత్యేక విపత్తు ప్రతిస్పందన ఏజెన్సీగా, హైదరాబాద్ సహజ, మానవ సంబంధిత చర్యలద్వారా సంభవించే విపత్తులపై వేగంగా, సమర్థవంతంగా స్పందించగల సామర్థ్యాన్ని పెంచుతుంది. నగరంలోని వరదలు, వాతావరణ మార్పులువంటి విపత్తుల కారణంగా జరిగిన నష్టాన్ని తగ్గించడానికి ఇది చాలా దోహదపడుతుంది. అయితే తెలంగాణలో హైడ్రా ద్వారా కలిగే ప్రయోజనాలను, దుష్ప్రభావాలను ఇంకా లోతుగా విశ్లేషించాలి. ముఖ్యంగా పాలన, ఆర్థిక దృక్కోణాలు, సాంకేతిక సమీకరణ, పర్యావరణ స్థిరత్వం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. అలాగే, సామాజిక న్యాయం, సమాజంలోని మౌలిక వసతులను శక్తివంతం చేయడం, నైతికత వంటి అంశాలు కూడా కీలకంగా ఉంటాయి. ముఖ్యమైన ప్రాధాన్యత గల అంశాలను పరిశీలిద్దాం.

### 2. సుస్థిర సమ్మిళిత పట్టణ అభివృద్ధి:

హైడ్రా సరైన విధానాలతో పర్యావరణ సంరక్షణ, పట్టణాభివృద్ధివంటి రంగాలలో ప్రగతిని సాధించవచ్చు. హైదరాబాద్ చాలావేగంగా అభివృద్ధి పంథాలో దూసుకెళ్తున్న పట్టణం. ఇది పర్యావరణ వనరులను వృద్ధిచేయడం, మౌలిక వసతులను మెరుగుపరచడం, విపత్తులనుంచి రక్షణకోసం అనువైన మార్గదర్శకాలను రూపొందించటంలో సహాయపడుతుంది.

### నైతిక సామాజిక న్యాయంపై దృష్టి:

ఆకస్మికంగా సంభవించే విపత్తులు సామాజికంగా వెనుకబడి ఉన్న అణగారిన వర్గాల ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. నది నాలాల పరివాహక ప్రాంతాల పరిధిలో ఆవాసాలు ఏర్పరచుకోవటం వలన వీరు ఎక్కువగా నష్టపోతారు. హైడ్రా ఇటువంటివారికి ప్రాధాన్యతనిస్తూ కావలిసిన కనీస మౌలిక సదుపాయాల కల్పన గురించి ఆలోచించి పునరావాసం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు ఉపయోగించి, హైడ్రా అతి ముఖ్యమైన మౌలిక వసతులు, ఆస్తులను రక్షించడంలో సహాయపడాలి. సామాజిక న్యాయం దృష్టికోణంలో, హైడ్రా దాని విధానాల్లో అణగారినవర్గాల సమస్యలను సరిగా పరిగణలోకి తీసుకుంటేనే ఇది సమర్థవంతమవుతుంది. సమాజంలో ఉండే అణగారినవర్గాలు, వారి జీవితాలను కాపాడే విధానం హైడ్రా సమర్థవంతంగా ఉండాలి.

బస్తీల జనాభా: సుమారు 25 లక్షల మంది బస్తీలలో నివసిస్తున్నారు, వీరికి శుభ్రమైన నీరు, పారిశుధ్యం, వైద్య సేవలు సరిగా అందుబాటులో లేవు. విపత్తుల తర్వాత అందే సహాయక నిధులు 50–70% వరకు మధ్యతరగతి ఉన్నత వర్గాలకు పంపిణీ అవుతుంది, బస్తీ ప్రజలకు సహాయం ఆలస్యం లేదా ప్రయోజనం తక్కువగా ఉండటం గమనించవచ్చు

## హైడ్రా – వ్యతిరేక వాదనలు

### 1. కేంద్రీకరణ, బ్యూరోక్రటిక్ సమస్యలు:

ఒకే కేంద్రీకృత ఏజెన్సీని ఏర్పరచడంవల్ల పరిపాలనా సమస్యలు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరగవచ్చు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన స్థానిక సంస్థలను హైడ్రా స్థాపన బలహీనపరచవచ్చు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానముపై ఎక్కువగా ఆధారపడటంవల్ల సమాజంలో నాటుకుపోయిన సామాజిక స్థాయి పరిష్కారాలను విస్మరించే అవకాశం ఉంది.

### 2. పాలన, సంస్థాగత వ్యవస్థ

ప్రస్తుత సంస్థలతో సమన్వయం: హైడ్రా అనేక విపత్తు నిర్వహణ సంస్థల సమన్వయంతో పనిచేయాలి, జాతీయ స్థాయిలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF), స్థానిక ప్రభుత్వ సంస్థలతో సహకారం కీలకం. హైడ్రా ప్రత్యేకమైన సంస్థగా ఏర్పడి, విపత్తులకు తక్షణమే స్పందించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఇది విభిన్న విభాగాలు, పోలీసు, అగ్నిమాపక, వైద్య సేవలు వంటి విభాగాల మధ్య సమన్వయం పెంచుతుంది. అయితే కొత్త సంస్థ ఏర్పాటుతో చట్టపరమైన బేధాలు రావడం, విపత్తుల సమయంలో గందరగోళం కలిగించే అవకాశాలు ఉంటాయి. కొన్నిసార్లు నూతన సంస్థ ఏర్పాటుకంటే ఉన్నస్థానిక సంస్థలను బలోపేతం చేయడం ఉత్తమం అనిపించవచ్చు.

### జవాబుదారీతనం, పారదర్శకత:

ఏ సంస్థకైనా ప్రజామోదం పొందటానికి పాలన, పారదర్శకత అత్యంత కీలకం. హైడ్రా అధికార దుర్వినియోగం జరగకుండా స్పష్టమైన జవాబుదారీతనం కలిగి ఉండాలి. దీనికి అనుబంధంగా ఒక కొత్త సంస్థను నియంత్రణ, ఆడిట్ వ్యవస్థలు కలిగి ఉండేలా ఏర్పాటు చేస్తే, విపత్తుల సమయంలో వనరుల సరైన వినియోగం జరగడం, ప్రజల విశ్వాసం పెరగడం జరుగుతుంది.

### ఆర్థిక ప్రభావాలు

ఖర్చు–సామర్థ్యం: హైడ్రా సమర్థవంతంగా పనిచెయ్యటానికి గణనీయమైన నిధులు అవసరం. ఇది

ఆర్థికంగా ప్రభుత్వంపై భారం వేస్తుంది. దీని స్థాపనను నగర రక్షణకు పెట్టుబడిగా భావించి ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యం (PPP) ద్వారా వ్యయాలను తగ్గించుకోవటం, వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవటం చేయాలి. అయితే, కొన్నిసార్లు కొత్త సంస్థపై ఖర్చు చేయడం ఉద్దేశించిన ప్రయోజనాలను మించిపోతుంది. ఇది అవశ్యక రంగాలకు నిధులు తగ్గించి కోత పెట్టే ప్రమాదం ఉంటుంది. అలా జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది.

**ప్రస్తుత విపత్తు నిర్వహణలో లోపాలు:**

**ఆర్థిక, సామాజిక ప్రభావాలు**

తెలంగాణ ఆర్థికవ్యవస్థకు హైదరాబాద్ ముఖ్యంగా మూలాధారం కావడంవల్ల విపత్తులు ఈ పరిశ్రమలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. 2020లో, ఐటీ కేంద్రాలు, ఇతర మౌలిక వసతులకు తీవ్ర నష్టం జరిగింది. సామాజికంగా, నిరుపేద ప్రజలు ఎక్కువగా ప్రభావితం అవుతున్నారు. హైదరాబాద్‌లో విపత్తులవల్ల భారీ ఆర్థిక నష్టాలు వస్తాయి, ముఖ్యంగా ఇది భారతదేశంలోని ప్రముఖ ఐటీ, వాణిజ్య కేంద్రం కావడం వలన పట్టణం విపత్తులకు గురైతే, దాని జిడిపికి సుమారు 3–5% నష్టం కలగవచ్చు, ఇది స్థానిక వ్యాపారాలు, అంతర్జాతీయ సరఫరా గొలుసులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

పర్యావరణ మార్పులకు అనుగుణంగా స్థిరమైన పట్టణ అభివృద్ధి అనేది పెద్ద అంశం. కాబట్టి హైడ్రా పర్యావరణ పరిరక్షణ విధానాల్లో సమర్థవంతంగా పని చేయడం అవసరం. హరిత మౌలిక వసతులు, పర్యావరణ అనుకూల వనరుల అభివృద్ధిద్వారా నగర స్థిరత్వాన్ని పెంచవచ్చు. ప్రస్తుత విపత్తు నిర్వహణ వ్యవస్థలో సమన్వయ లోపాలు, వనరుల వినియోగం ప్రజలతో సమర్థవంతమైన అనుసంధానంవంటి లోపాలు ఉన్నాయి. ఎన్‌డిఆర్ఎఫ్ (NDRF) సంస్థ ప్రస్తుతం హైదరాబాద్‌కు విపత్తుల సమయంలో సహాయం అందిస్తున్నప్పటికీ, స్థానిక సమన్వయం లేకపోవడంవల్ల కొన్నిసార్లు స్పందన ఆలస్యం అవుతోంది. ఇలాంటి సందర్భములో హైడ్రా గణనీయమైన పాత్ర వహించాలి.

**హైదరాబాద్‌లో విపత్తులు, అసరాలు**

హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం కావడంతో, ఇది అనేక సహజ విపత్తులకు గురవుతోంది. ఈ విపత్తులు నగరంలోని భౌతిక మౌలిక వసతులు, జనాభా, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

**వర్షపాతం వల్ల వచ్చిన వరదలు:**

2020 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో వచ్చిన భారీ వర్షాలు, వరదలు సుమారు 5000 కోట్లకు పైగా ఆర్థిక నష్టాలను కలిగించాయి. 50 మందికి పైగా మృతిచెందారు. దాదాపు 40,000 కుటుంబాలు పాక్షికంగా నిరాశ్రయులయ్యారు. హైదరాబాద్ 2020, 2022, 2023లో తీవ్ర వరదలను ఎదుర్కొన్నది, 2020లో 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వరదలవల్ల 5000 కోట్ల (సుమారు 680 మిలియన్ డాలర్లు) ఆర్థిక నష్టం జరిగింది. డ్రైనేజీ వ్యవస్థ అనేక ప్రాంతాల్లో సరిగ్గా లేదు. కేవలం 40% మాత్రమే తగిన డ్రైనేజీ అందుబాటులో ఉంది.

**వేడిగాలులు** (Heatwaves): తెలంగాణలో ప్రతి సంవత్సరం వేసవిలో ఉష్ణోగ్రతలు 45°C (113°F) దాకా చేరుకుంటాయి, ముఖ్యంగా నిరుపేదలు, శ్రమజీవులు ప్రాణహాని, నీటి కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

**పర్యావరణ, వాతావరణ మార్పుల ప్రభావం**

హైదరాబాద్‌లో పర్యావరణ పరిస్థితులు విపరీతంగా మారుతున్నాయి, ముఖ్యంగా వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా ఈ క్రింద పేర్కొన్న అంశాలు ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి.

**వర్షపాతం పెరుగుదల:** గత 20 ఏళ్లలో హైదరాబాద్‌లో సగటు వర్షపాతం 19% పెరిగింది, దీనివల్ల అకస్మాత్తుగా వరదలు సంభవించే అవకాశం పెరిగింది.

**ఉష్ణోగ్రత పెరుగుదల:** 1980 నుండి హైదరాబాద్‌లో సగటు ఉష్ణోగ్రత 1.2°C పెరిగింది.

**చిత్తడినేల కోత:** నగరంలో గత కొద్ది దశాబ్దాల్లో 3000 హెక్టార్ల భూమి తగ్గింది, దీనివల్ల నగరానికి సహజమైన వరద నియంత్రణ సమర్థత తగ్గిపోయింది.

**పట్టణీకరణ: మౌలిక వసతులపై ఒత్తిడి**

హైదరాబాద్‌లో వరద సమస్యలు రోజురోజుకి పెరుగుతున్నాయి. ముఖ్యంగా అధిక పట్టణీకరణ, పర్యావరణ మార్పులు, తగిన డ్రైనేజీ సదుపాయాల లేకపోవడం గమనించవచ్చు. 2020లో హైదరాబాద్‌లో ఒక్క రోజులో 30 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది, ఇది నగరంలో తీవ్రమైన వరదలకు కారణమైంది. ఈ వరదలు నగరంలోని పలు ప్రాంతాలను ప్రభావితం చేసి, వేలాది మందిని నిరాశ్రయులను చేశాయి. 2024 నాటికి కూడా ఈ సమస్యలు కొనసాగుతున్నాయి, దీనికి ముఖ్య కారణం నగరంలోని

జలాశయాలు తగ్గిపోయాయి, గతంలో 2,500 జలాశయాలు (నీటి వనరులు) ఉండగా ఇప్పుడు కేవలం 190 మాత్రమే ఉన్నాయి.

మరోవైపు హైదరాబాద్ జనాభా 2024 నాటికి 1 కోటీ మించడంతో, నగర మౌలిక వసతులపై ఒత్తిడి మరింత పెరిగింది. ఈ వేగమైన నగరీకరణవల్ల అనధికార నివాసాలు (స్లమ్స్) పెరుగుతున్నాయి. వరదలకు గురయ్యే ప్రాంతాల్లో ఎక్కువ మొత్తంలో అనియంత్రిత నిర్మాణాలు జరుగుతున్నాయి. అదనంగా, అంగరంగ వైభవంగా జరుగుతున్న నిర్మాణాలు, నగర వ్యాప్తివలన వరద ప్రమాదం పెరిగింది. ముఖ్యంగా నీటిపారుదల మార్గాలపై ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ వరదలు సాధారణంగా పేద ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. వీరు వరద ప్రభావాలకు గురవుతున్న ప్రాంతాల్లో నివసించడంవల్ల తీవ్ర ఆర్థిక నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని నిరోధించేలా సుస్థిర అభివృద్ధి చర్యలు, ప్రకృతిలోని జలవనరులను పునరుద్ధరించడం, పచ్చదనాన్ని పెంచే మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కీలకంగా మారింది. నగర జనాభాలో సుమారు 22% మంది బస్తీలలో నివసిస్తున్నారు, వీరు విపత్తుల సమయంలో అత్యంత ప్రమాదానికి లోనవుతారు. నగరంలో ప్రాముఖ్యమైన నీటి వనరులు, డ్రెయినేజీ వ్యవస్థలు ఆక్రమణకు గురవడంవల్ల నగరం ఎక్కువగా వరదలకు గురవుతోంది. ముందుగా వీటి నియంత్రణకు సర్కారు పూనుకోవాలి.

**సుస్థిర అభివృద్ధి – సిఫార్సులు**

ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు, డ్రైనేజీ వ్యవస్థలను పునఃసృష్టించడం, హరిత వనరులు అభివృద్ధి చేయడం, జలాశయాలను పునరుద్ధరించడంవంటి సుస్థిర అభివృద్ధి చర్యలు అవసరం. విపత్తుల నిర్వహణ వ్యూహాలను పకడ్బందీగా అమలుచేయడం, అదే విధంగా ముంపు ప్రాంతాలకు సరైన సహాయాన్ని అందించడం కూడా చాలా ముఖ్యం. సేకరించిన డేటా సమాచారాన్ని ఆధారంగా, హైదరాబాద్ నగరం విపత్తుల తీవ్రతను అధిగమించడానికి, సుస్థిర అభివృద్ధిని అందించడానికి సరైన మార్గాన్ని, కార్యక్రమాలు చేపట్టాలి.

**భవిష్యత్తులో హైడ్రా ప్రభావం: సవాళ్లు, ప్రతికూలతలు**

హైడ్రా సృష్టించిన తీవ్ర ప్రభావం ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య చర్చకు దారితీస్తోంది. చెరువులు, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైన అనేక ప్రాంతాల్లో హైడ్రా చర్యలు తీసుకుంటుండటంతో, రాజకీయ నాయకుల ఫామ్ హౌసులు కూడా దృష్టిలోకి వచ్చాయి. రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్న కట్టడాలను కూల్చివేయడంవల్ల హైడ్రాకు అనేక అడ్డంకులు ఎదురవుతాయనడం సుస్పష్టం. హైడ్రా స్థాపనద్వారా చెరువుల పరిరక్షణకు, అక్రమ నిర్మాణాలపై నిఘా వేసేందుకు ప్రభుత్వం ఒక మంచి వేదికను ఏర్పాటుచేసింది. అయితే, హైడ్రా మునుముందు తీసుకునే ప్రతి అడుగు రాజకీయంగా, సామాజికంగా గట్టి సవాళ్ళను వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి రావచ్చు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై కూడా చర్యలు ఉంటాయని ప్రకటించారు. కింది స్థాయిలో అనుమతులు ఇచ్చిన వాళ్ళను, పై స్థాయిలో పైరవీలు నడిపిన వారి మీద కుడా కొరడా ఝుళిపించాల్సిందే. తద్వారా అధికారుల అవినీతి బాగోతాన్ని బయటపెట్టే అవకాశం వలన ప్రజలకు హైడ్రా పైన నమ్మకం కలుగుతుంది. హైడ్రా సంస్థ తలపెట్టిన ప్రస్తుత చర్యలు కొనసాగుతాయా లేక రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆగిపోతాయా అనేది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**ముగింపు**

హైడ్రా విపత్తు నిర్వహణ, ఆస్తుల సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, సామాజిక సమానత్వం, పర్యావరణ స్థిరత్వం, సాంకేతికతవంటి అంశాలు దీని విజయాన్ని నిర్దేశిస్తాయి. సమానమైన, సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తే, హైడ్రా, తెలంగాణలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మరీ ముఖ్యంగా హైడ్రా– అవకాశాలు, సవాళ్లు రెండింటినీ దిశానిర్దేశం చేసేలా ఉండాలి. హైడ్రా హైదరాబాద్ లో విపత్తుల సంసిద్ధతను, సుస్థిర అభివృద్ధిని గణనీయంగా మెరుగుపరిచే సామర్థ్యం ఉన్నప్పటికీ, ఇది సామాజిక అసమానతలను పెంచకుండా లేదా బ్యూరోక్రటిక్ అడ్డంకిగా అవ్వకుండా జాగ్రత్తమైన ప్రణాళిక అవసరం. హైడ్రా విజయవంతం కావాలంటే, సామాజిక న్యాయం, దీర్ఘకాలిక సుస్థిరతకు ప్రాధాన్యమిచ్చే భాగస్వామ్య, సమ్మిళిత, సున్నితమైన విధానాన్ని అవలంబించేలా సామాజిక స్పృహతో, అలాగే సాంకేతిక పురోగతిని కమ్యూనిటీ అభివృద్ధి, సమాన వనరుల పంపిణీతో సమతుల్యం చేయడం ద్వారా, హైడ్రా ఏజెన్సీ భారతదేశంలో పట్టణ విపత్తు స్థితిస్థాపకతకు ఒక నమూనాగా మారవచ్చు. ఇదిలా ఉండగా మరోవైపు మూసినది సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లతో మాస్టర్ ప్రణాళిక తయారీలో నిమగ్నం కావడం కొసమెరుపు.

పర్యావరణ అంశాలు, సామాజిక న్యాయంకు సంబంధించిన ముఖ్యమైన డేటా

| విషయం | 2024 డేటా / సమాచారం | ఆవశ్యకత అంశం |
|---|---|---|
| జనాభా | హైదరాబాద్ జనాభా 2024 నాటికి 10 మిలియన్లను దాటింది. | సామాజిక న్యాయం |
| స్లమ్ జనాభా | నగరంలో 22% మంది ప్రజలు స్లమ్ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. నీరు పారిశుద్ధ్య వసతుల కొరత, విపత్తుల సమయంలో ఎక్కువ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. | సామాజిక న్యాయం |
| జలవనరుల తగ్గుదల | 2024 నాటికి నగరంలోని జలవనరులు 90% తగ్గిపోయాయి. 2,500 జలాశయాలు ఇప్పుడు కేవలం 190 మిగిలాయి. | పర్యావరణ సంరక్షణ |
| వరదలు | 2020లో వర్షాల వలన ₹5000 కోట్ల ఆర్థిక నష్టం, మరియు 50 మంది ప్రాణాలు కోల్పోయారు. | సామాజిక న్యాయం, పర్యావరణ |
| డ్రైనేజ్ సామర్థ్యం | నగరంలో కేవలం 40% డ్రైనేజ్ వ్యవస్థ సరైన రీతిలో పనిచేస్తోంది. | పారిశుద్ధ్య నిర్వహణ |
| వాతావరణ మార్పులు | వర్షపాతం గత 20 సంవత్సరాల్లో 19% పెరిగింది. ఉష్ణోగ్రత 1.2°C పెరిగింది. | పర్యావరణ సమతుల్యత |
| అనధికార నివాసాలు | సుమారు 22–25 లక్షల మంది అనధికార నివాసాలలో నివసిస్తున్నారు, నీటి ఆర్థిక, ఆరోగ్య సమస్యలు అధికం. | సామాజిక న్యాయం |
| ఆర్థిక నష్టం (2020 వరదలు) | 2020 వరదలు ₹5000 కోట్ల ఆర్థిక నష్టం, ముఖ్యంగా ఐటీ, రియల్ ఎస్టేట్ పరిశ్రమలకు నష్టం. | సామాజిక న్యాయం, ఆర్థిక వ్యవస్థ |
| ఉష్ణోగ్రత ప్రభావం | 2024లో వేసవిలో ఉష్ణోగ్రతలు 45°C కి చేరడం వల్ల పేద ప్రజలు వేడి సంబంధిత వ్యాధులకు గురయ్యారు. | సామాజిక న్యాయం, పర్యావరణ |

డేటా ఆధారం: వివిధ ప్రభుత్వ వెబ్ సైట్ ల నుండి క్రోడీకరించబడినది.

## రిఫరెన్స్


1. Ahluwalia, I. J. (2014), Urbanization in India: Challenges, opportunities and the way forward. Sage Publishers.

2. Vandana Desai (1995), Community Participation and Slum Housing Slum Development in India: A Study of Urban Informality, Sage Publication.

3. Rajib Shaw, Climate Change and Urban Vulnerability in India%µµ

4. DEEPAK, P. (2023) Half of Hyderabad Buildings Face Flood Risk: Study, Deccan Chronicle

5. Jairath, J. (2017) Hyderabad: Most Lakes are either dead or dying: Hyderabad News - Times of India


## ఆర్టికల్స్


1. Urban Water Crisis in Hyderabad: Challenges and Policy Options, Published in Water Policy Journal

2. Climate Vulnerability and Urban Poor: A Case Study of Hyderabad Published in Environmental Research Letters

3. Impact of Urbanization on Hyderabads Water Bodies: Environmental and Social Dimensions Published in Journal of Urban Affairs.


★ రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, వోక్సన్ యూనివర్సిటీ

# ప్రజాపోరాటాలే నా రచనలకు ప్రేరణ: అల్లం రాజయ్య

డా॥శివరాత్రి సుధాకర్

*(అతడు తెలుగు కథకు చెమట చిత్తడి పరిమళాన్ని అద్దిన ఎన్నెల పిట్ట. భూమి గుండెల్లోంచి వికసించే ఆరుద్ర పువ్వు. అతని అక్షరాలు జనాన్ని రగిలించే నిప్పు రవ్వలు. నింగీ, నేలనూ కలిపే సింగిడి పరవళ్లు. తుడుం మోతల యుద్ధ గీతాలు. వెన్నెల జలపాతాలు. తిరగబడకపోతే బతుకు లేదని చెప్పిన వీరులు చిందిన నెత్తుటి కథలు. గాథలు. వీరగాథలు. అతని మాట మానేరు. మనసు కోనేరు. ధిక్కారమే అతని జీవధాతువు. విప్లవోద్యమం తన అక్షరాలకు కొత్త చూపునిచ్చిందని చెప్పే స్వేచ్ఛా గీతిక అతడు. వసంతమేఘ గర్జనల్లో నిలువెల్లా తడిసి మొలకెత్తిన రగల్ జెండా రెపరెపల సృజనశీలి అతడు. యాభై ఏళ్లుగా మట్టి మనుషుల జీవితాలను, పోరాటాలను, చరిత్రను, కథలల్లుతున్న మన కాలపు పోరాట సాహిత్య సృజనకారుడు అల్లం రాజయ్యతో 'నడుస్తున్న తెలంగాణ' సంభాషణ)*

**1. మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి చెప్పండి.**

నా బాల్యం ఒక్కప్పటి కరీంనగర్ జిల్లా (ఇప్పుడు పెద్దపల్లి) మంథని తాలూకాకు ఆరు కిలోమీటర్ల దూరంలో గల గాజులపల్లెలో గడిచింది. సుమారు యాభై కుటుంబాలు గల ఊరు. అడివంచు పల్లె. పక్కన ఎప్పుడూ పారే బూరుగు వాగు. మాది పేదరైతు కుటుంబం. పెరుక కులం. బహుజన. నా బాల్యంలో మూడో నాలుగో పెంకుటిండ్లు ఊళ్లో. మిగతావన్నీ గడ్డి గుడిసెలే. బ్రాహ్మణ అగ్రహారం. చాలా వరకు భూములన్నీ మంథని బ్రాహ్మణ కుటుంబాలవే. ఒకటి అర మా కుంటుంబాల (బీసీ కుటుంబాలు)కు కొద్దిగా భూములుండేవి.

మా తరంతో పాటే ప్రభుత్వ పాఠశాల వచ్చింది. మంథని నుంచి బ్రాహ్మణ టీచర్ వచ్చేవాడు. సుద్దరోల్లు (శూద్రుల)అని మమ్ముల్ని ముట్టుకునే వాళ్లుకాదు. మాల, మాదిగలు స్కూలుకు వచ్చేవాళ్లుకాదు. మూడో తరగతి దాకా గాజులపల్లిలో. నాలుగు, ఐదు తరగతులు మా అమ్మమ్మ ఊరు వెన్నంపల్లిలో. ఈ ఊరు చాలా పెద్దది. అన్నివృత్తులవారు, దొరలు, పెద్దపెద్ద చెరువులు, కూరగాయలు, మిర్చిలాంటి పంటలు. నా మీద బాగా ప్రభావం చూపిన ఊరు.

ఆరో తరగతికి మా ఊరినుంచి మంథనికి ఆరు కిలోమీటర్లు నడిచి పోయేవాళ్లం. మా ఆకారం, భాష, బట్టలు చూసి బ్రాహ్మణ పిల్లలు ఆట పట్టించేవాళ్లు. ఎచ్ఎస్సీ దాకా మంథనిలో, ప్రత్యేక తెంగాణ ఉద్యమంలో (1969) పాల్గొన్న. అప్పుడు నేను హైస్కూలు విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిని. పీయూసీ, బీఎస్సీ హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో చదివిన.

**2. సాహిత్య ప్రపంచంలోకి ఎట్లా వచ్చారు?**

లిఖిత సాహిత్య ప్రపంచంలోకి రావడమన్నమాట. పల్లెల పనిపాట చేసుకొనేటోళ్లకు అడుగుదీసి అడుగేస్తే ఆ కులుకు, ఆ హొయలు వాళ్ల కదలికల్లో కన్పిస్తయి. నోరు తెరిస్తే సాహిత్యమే. పల్లె సామెతలు, రిథమిక్ లేకుండా ఎవరూ మాట్లాడరు. ఆటలు, ఎడ్ల కాసేకాడ, నాట్లకాడ, పంజలు గొట్టేకాడ, నెగల్లకాడ, మంచెకాడ, పంచాదులు, పెండ్లిల్లు, పండుగలు అన్నీ కథతోని, పాటలతోని నిండి ఉంటయి. కథ లేకుండా ముచ్చెటబెట్టరు. ఇయ్యన్నిగాకుంట పాండవులోల్లు, మాట్లోల్లు, బుడిగ జంగాలు, చిందోళ్లు, ఒగ్గోల్లు, పంబాలోల్లు ఏడాది పొడుగుతా ప్రదర్శనలు ఇస్తనే ఉంటరు. పల్లె బతుకులో, పనితో పాటు సాహిత్యం ఒక భాగం. కైతికాలోళ్లు కానోళ్లు పల్లెల ఉండరు.

చదువు ద్వారా 'మధ్యవర్తిగా' మారే క్రమంలో ఊళ్లు తిరగడం, పల్లె నుండి మంథనెకు రావడం బెంగటీలినట్టుండేది. ఆ దిక్కుమాలిన చదువు వచ్చేదికాదు. ఎనిమిదో తరగతిలో సున్నాలే వచ్చినై. చదువుకనిపోయి లైబ్రరీల కూసుండి పుస్తకాలు చదువుకునేవాన్ని. బోలెడు పుస్తకాలు చదివిన. ప్రేమ్‌చంద్‌ను సదివినంక నిమ్మలమనిపిచ్చింది. 'గోదాన్' రైతు కథే కదా! ఆ తరువాత మా మేనమామ నాకు చదువు రానందుకు తిట్టడం. వ్యవసాయంలో బతకలేమని తేలడం. ఈ గడబిడలో ఆత్మహత్య చేసుకుందామనుకొని మానేసి గప్పుడు సదువెట్లరాదో అదేవన్నా దున్నుడా? దోకుడా? అనుకొని సదవడం, తొమ్మిదిల క్లైవరునైన, అదో పెద్దకత.

పదకొండుల విద్యార్థి సంఘానికి ప్రధాన కార్యదర్శిని. ప్రత్యేక తెంగాణ ఉద్యమం, ఉపన్యాసాలు, కరపత్రాలు రాయడం అవసరమయింది. గాయిగాయి తిరుగుడు. లైబ్రరీల సదివిన గద. మా దోస్తుల్లో నాలుగు వాక్యాలు రాయగల్గింది నేనే. పెద్ద దోస్తులకు వాళ్ల లవర్లకు ప్రేమలేఖలు రాసిచ్చుడు నావంతే అయ్యింది. మొత్తానికి మా ఆవారా బృందానికి ఆస్థాన లేఖకుడి

పనైంది. మల్ల హన్మకొండ 'సాహితీ మిత్రులు', కాళోజీ, వరవరరావు ఆళ్ల దోస్తానీ డైరీలసొంటివి రాసేటోన్ని. కవిత్వం ఫుల్. ఏదివడితె అది. కని పల్లె మీదికి మనసు పీకేది. గాయిగాయున్న పల్లెను బాగు చెయ్యాలె. ఎట్ల? బోలెడు ఇసారాలు. గాంధీ తీర్గ ఏదన్న చెయ్యాలె. ఇప్పుడు అన్నారం బ్యారేజీ కట్టినకాడ మా దోస్తు చందుపట్ల క్రిష్ణారెడ్డి ఊరు. బగ్గ నచ్చింది. అప్పటికి ఠాగోర్, శరత్, చలం, యద్దనపూడి, బుచ్చిబాబు, కొ.కు, గోపీచంద్‌లను చదివిచదివి నెరివడిపోయిన గని.. కథలు, నవలలు రాయాలన్పియ్యలేదు. గట్ల బ్యారేజీ గట్టితే పల్లెలు బాగుపడ్తయని 'ముగింపులు ముందడుగులు' నవల రాసిన.

పి.యు.సి., డిగ్రీ హన్మకొండ ఆర్ట్స్ కాలేజీలో చదివిన. హిందీ సినిమాలు చూస్తుండె. ఆనంద్, గీత్‌లాంటివి. ఆ పోవడి ఆ నవల అచ్చు కాలేదు. ఏడనో పోయింది. అగో గట్ల అచ్చు కాకముందు ఒకటి గాదు రెండు గాదు. కొన్ని వేల పేజీల రాసిపారేసిన. ఏడివడితె అది. ఎట్లవడితె గట్ల. మంటర మంటర. కని ఏదీ అచ్చుకియ్యలే. ఇయ్యాలన్పియ్యలే. అవ్వన్నీ ఆదర్శ కల్పితాలు. నా చుట్టున్న బతుకులు వేరు. కొట్లాటలు వేరు. నా రంది వేరు. రాస్తున్న సరే. అగో గసొంటి టయిము నక్సల్బరీ మంట, శ్రీకాకుళం చిచ్చు, పాణిగ్రాహి, శ్రీశ్రీ, కాళోజీ, దాశరథి. అగో వాళ్లు పూనిండ్లు.

**3. మిమ్మల్ని అత్యంత ప్రభావితం చేసిన సాహిత్యమేది?**

ఒకటా రెండా? ఆట పాటతో శాత్రాలతో (కథతో) నిండి పోయిన పల్లె బతుకు. అద్భుతమైన మాట తీరు, పని తీరు, కంఠస్వరం గల్గిన మా ఊరిలోని మాదిగవారి నోటి సాహిత్యం తమ బతుకు తాము చెప్పే జానపద గాథల్లో లీనమైపోయిన గ్రామీణ కళాకారులు ఇప్పటికీ మాట్లె వీరయ్య, పంబాల దుర్గయ్య, బుడుగు జంగం పెద్దీరయ్య నాలో కలెగల్సిపోయి ఉన్నరు. వాళ్లు ప్రపంచాన్ని ఆగ్రహంతో, దు:ఖంతో, విశ్లేషణతో, ప్రేమతో, దయతో చూసిండ్లు. నా చుట్టున్న ప్రజలు నిరుపేదలైన ప్రజలు. సమస్తం దోచుకోబడిన ప్రజలు. సర్వ శక్తిమంతులైన ప్రజలు. సృష్టికర్తలైన ప్రజలు. అడవితో, పశు పక్ష్యాదులతో, కొండవాగులతో, భూమితో, గాలితో, మబ్బుతో, మండే సూర్యునితో, సక్కని సందమామతో సరసాలాడిన ప్రజల జీవధాతువు కదా సాహిత్యం. వాళ్ల ఊపిరి కదా. ఇంత పీడనలో సాహిత్యమనే జీవధాతువు లేకుంటే బతికేవాళ్లా? అగో గక్కడ గసొంటి తడి నన్ను తాకింది. నన్ను నిలబెట్టింది. పల్లె పొల్లగాని బతుకంటే గాయి గత్తరా రోగాల నుండి, ప్రమాదాల నుండి బతికి బట్టగట్టే సాహసం. ఆ కంఠ స్వరాలు నా లోలోపల ఇప్పటికీ మోగుతుంటై. అది నన్ను ప్రభావితం చేసిన పల్లె లొల్లి.

పదకొండవ తరగతి వరకే అందిన భారతీయ సాహిత్యమంతా చదివిన. ఎవరో ఒక స్వాతంత్ర్య సమరయోధుడు మా మంథెన లైబ్రరీకి దేశ, విదేశ సాహిత్యం చానా దానం చేసిండు. శరత్ 'గృహ దహనం' నవలలో కమల, 'శ్రీకాంత్' నవలలోని శ్రీకాంత్. చలం పుస్తకాలన్నీ చదివిన. 'మైదానం,' 'జీవితాదర్శం'. యవ్వన కాలంలో చలం పిచ్చిలో తిరిగిన. గోపీచంద్ 'మెరుపుల మరకలు', 'అసమర్థుడి జీవయాత్ర', 'చీకటి గదులు'; ఉన్నవ 'మాలపల్లి'. ఏదో చెయ్యాలె. కాళీపట్నం రామారావు 'యజ్ఞం' లోలోపల బీభత్స కల్లోలం. రావిశాస్త్రి పాత్రలు, యద్దనపూడి, రంగనాయకమ్మ, లత, వందలాది డిటెక్టివ్‌లు. మాయామయి, భట్టి విక్రమార్క, వేదాలు, పురాణాలు, ఏది దొరికితే అది. ఇసొంటి పుస్తకాల ప్రభావం.

మా కాలం, మా తరం దారులు వెతుకుతున్న కాలం. తెలంగాణా ఉద్యమంలో రాజకీయాల్లోకి బజాట్లెకచ్చి బరిగీసి నిలబడి, బలిదానాలు జరిగినా ఆస్తులు, బస్సులు కాల్చి, నాయకత్వ విద్రోహంతో భంగపడి-చదువు పోగొట్టుకొని, పారిస్‌లో కోపోద్రిక్త యువకుల్లాగా తిరుగుతున్న తరుణంలో, నిరాశపడి డీలాపడి తిరుగుతున్న సమయంలో, శ్రీశ్రీ మహాప్రస్థానం మంచె కావల్ల దగ్గర బిగ్గరగా పాడుతూ పాడుతూ ఏడ్చిన కాలం.

సుబ్బారావు పాణిగ్రాహి పాట 'కమ్యూనిస్టులం-కష్టజీవులం'. అప్పుడు నేను బీఎస్సీ రెండో సంవత్సరం. చీకటిలో తచ్చాడుతున్న సమయంలో మా పక్క రూమ్ నర్సింహారెడ్డి (బి.ఇడి.) నా వెర్రి మొర్రి కవిత్వం, మ్యూజింగ్స్ లాంటివి చదివి 'ఇది కాదోయి సాహిత్యం' అని వెంట తిరిగాడు. తెలతెలవారకముందే నా దగ్గరకొచ్చి 'సృజన'ను పరిచయం చేశాడు. టావ్‌చెంగ్, 'నా కుటుంబం' అట్లా అనేకానేక పుస్తకాలు, పత్రికలు. ప్రజల సాహిత్యంలోకి దారి దొరకడమే కాదు. మునిగిపోయాను. అయితే నేను అప్పటికి చాలా ప్రజల సాహిత్యం రాసిన. మా ఊరి సాహిత్యం రాయాలని, రాస్తానని అనుకోలేదు.

నేను చదివిన అనేకమంది రచయితలు, పుస్తకాలు అప్పటి నుండి ఇప్పటి దాకా వేలాది మంది నామీద ఎంతో కొంత ప్రభావం చూపారు. వాళ్ల నుండి నేను ఎంతో నేర్చుకున్న. ప్రతి రచనను నేను నా కాలంతో, స్థలంతో సరిపోల్చుకున్నాను.

అయితే లక్ష చెప్పు. గిది బాగలేదు. మారాలె. ఎట్లా? ఎవరు మారుస్తరు? అగో గాడ ఫ్రెంచి విప్లవం, సాహిత్యం, బాల్జాక్, డికెన్స్, గోర్కీ, చెహొవ్, తుర్గనేవ్, టాల్‌స్టాయ్, డాస్టోవిస్కీ, లూసన్, అంబేద్కర్, కారల్ మార్క్స్, లెనిన్, మావో

నుండి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇప్పటి మావోయిస్టు సాహిత్యం దాకా ఇలాంటి విప్లవాలను ఆపడానికి అవతలి పక్షం నిర్ధారణలు. విశ్లేషణలు. ఆడమ్‌స్మిత్ నుండి అనేకమంది అమెరికన్, యూరప్ రచయితల దాకా. గూగీ నుండి, నోమ్ చామ్‌స్కీ దాకా. ఖలీల్ జిబ్రాన్ నుండి ఇప్పటి సిరియా, ఈజిప్ట్, ఇరాన్, కిర్‌స్తోంజీ నుండి మజీదీ మజీదీ దాకా. ఫుకోకా నుండి పర్యావరణ శాస్త్రవేత్తల దాకా. తీరని దాహం. దేశమే కాదు, ప్రపంచంలో ఉత్పత్తి విధానం, శక్తులు, సంబంధాలు పూర్తిగా మారి సమస్త శక్తులతో ప్రజలు సమస్త వైరుధ్యాలను పరిష్కరించే శ్రామికవర్గ నియంతృత్వం దాకా కలలుగన్న, పనిచేసిన వారెందరో. వారందరి అనుభవాలు నన్ను నిరంతరం ప్రభావితం చేస్తూనే ఉంటాయి.

మార్క్సిజం, లెనినిజం, మావోయిజం వెలుగులో పెరూ, ఫిలిప్పీన్స్, నేపాల్, టర్కీ, లాటిన్ అమెరికా దేశాలు, మన దేశంలో, మన కాలంలో ఎన్నెన్నో ప్రయోగాలు. అనుభవాలు. గుణపాఠాలు. భారతదేశ పరిణామ క్రమంలోని ప్రత్యేక అంశం కులం పునాదిగా అంబేద్కర్ చేసిన ప్రతిపాదనలు, చర్చోపచర్చలు నామీద ప్రభావం చూపినవి. ముఖ్యంగా నక్సల్బరి నుండి ఇప్పటిదాకా అనేక ఆటుపోట్లతో నూతన ప్రజాస్వామిక సమాజం స్థాపన కోసం చేస్తున్న రైతాంగ సాయుధ పోరాటం, అందులో భాగంగా కొనసాగుతున్న అనేక వర్గపోరాటాలు, అందులో వీరోచితంగా పాల్గొంటున్న ప్రజలు, వాళ్ల వీరోచిత త్యాగాలు నాలోపల నిరంతరం సలుపుతుంటాయి.

**4. మీ తొలి రచన ఏది? సమాజంపై దాని ప్రభావం ఎట్లా ఉన్నది?**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నాయకత్వ ద్రోహంతో ముందుకు సాగడానికి తగిన నిర్మాణం లేక కదం తొక్కుతున్న విద్యార్థులను 1974లో ఏర్పడ్డ 'రాడికల్ విద్యార్థి సంఘం'లో సమీకరించిండ్లు, అప్పటి సీవోసీ (విప్లవకారుల ఐక్యతా కేంద్రం) పార్టీవాళ్లు. నక్సల్బరీ, శ్రీకాకుళాల మీద వాదోపవాదాలు. 'వ్యవసాయ విప్లవం' ఇరుసుగా విప్లవోద్యమం పెల్లుబికడానికి సిద్ధంగా ఉంది. కరీంనగర్‌లో విజయకుమార్, లింగారెడ్డిలాంటివాళ్లు, జమ్మికుంటలో శనిగరం వెంకటేశ్వర్లు, నల్లా సుధాకర్‌రెడ్డి, నల్లా ఆదిరెడ్డి, పెద్దపల్లిలో మల్లోజుల కోటేశ్వరరావు, మంథనిలో చందుపట్ల క్రిష్ణారెడ్డి, అల్లం నారాయణ, పోరెడ్డి వెంకటరెడ్డి, బయ్యపు దేవేందర్‌రెడ్డి, ఓంకారి లాంటివాళ్లు రాడికల్ విద్యార్థి సంఘం నిర్మాణంలో ఉన్నరు.

నాకప్పటికి బీఎస్సీ అయిపోయింది. జమ్మికుంట మిత్రులు, కరీంనగర్ మిత్రులు కలిసి జమ్మికుంట కాలేజీలో 'విద్యుల్లత' రాతపత్రిక నడిపేవాళ్లు. 1969 ప్రాంతాల్లో 'బదిలా' పేరుతో ఒక కథా సంకలనం తేవాలనుకున్నరు. పైన పేర్కొన్నవాళ్లంతా నా మిత్రులు. ఆ నోట ఈ నోట నేను రాస్తనని తెలిసి నన్ను అడిగిండ్లు. అప్పటికే గీట్ల జనార్దన్‌రెడ్డి 'క్రాంతి' పత్రిక ప్రారంభించిండు. దానికోసం నేను తిరిగేవాన్ని. ప్రెస్‌లో విజయ కుమార్ కలిసి నన్నొక కథ అడిగిండు.

ఈ నేపథ్యంలో అగులు బుగులు మొదలయ్యింది. నేను చదివిన వయిలు, ఆ మలుపులు నా వల్ల గాదు. నేను రాసిన కవిత్వం. కాదు కాదు. కానే కాదు. మరేంది? ఈ తండ్లాటలో నాకు అత్యంత ప్రీతిపాత్రమైన, నాకు అన్నీ నేర్పిన మా ఊరి మాదిగలు కన్పించిన్రు. ఆ యిండ్లల్లకు రాకపోకలతో నాకు ప్రతి మనిషి, పిల్లాపీచు బగ్గ ఎరుక. అగో గప్పుడు మా ఊళ్లనే బేతాళునిలాగ ఉండే శరీరం, కంచుగంట కొట్టినట్టుండే కంఠస్వరం. దేన్నయిన, ఎవలినైన నడి బజాట్ల నిలబెట్టి నిలదీసి అడిగే మొండితనం. ముఖ్యమంత్రిగ ఉన్న పీవీ నర్సింహారావునే వేల మందిలో నిలబడి మీటింగు 'నువు సెప్పే మాటలుత్తయి. గయి మా దాక రావు' అని కడిగి పారేసిన బొత్త కొమురయ్య వచ్చి ముందు నిలవడ్డడు. అయిపాయె. బొత్త కొమురయ్యంటే మా ఊరు మొత్తం... ఊరంటే లోలోపలి కుట్రలు కుతంత్రాలు, దోపిడీ, హింస, పంచాయదులు, మెదు విరవడాలు, భూములు కాజేయడాలు, తక్కువ కూల్లు యివ్వడాలు... ఏది మార్చకుండా, మా ఊరి మాటలు బెట్టి రాసిపారేసిన. గదే 'ఎదురు తిరిగితే'. గీ పేరు నేను పెట్టింది కాదు. 'సృజన' వాళ్లు పెట్టిండ్లు.

కథనో గంగరాయో. మొత్తానికి నేను పుట్టి బుద్దెరిగిన కాన్నుంచి నా కడుపుల కక్కకుండా గడ్డకట్టుకపోయిందంతా రాసిపారేసిన. అలుకగయ్యింది. గ కథ ఎవలకు ఏమి నేర్పిందో గని నాకైతే తొవ్వజూపింది. ఊకె 'కొలువా కుమ్మరియ్య'. గులుగుడద్దు. తెగించినోనికి తెడ్డే కత్తి. సాప్ సీదా. లైన్ క్లియర్. ఇగ నాకు అప్పటి నుంచి కప్ప తొక్కుడు లేదు. ఉంటది. గలీజు, కంగాలి ఉంటది. పొలికట్టె బట్టి ఊడ్సుకోవాలి. బరిగీసి నిలబడాలె. కథ రాయంగనే గది అచ్చుకియ్యాలన్పియ్యలేదు. దెహె. గిదేం కథంటరేమోనని. నా మనుషులంత సెమట ఆసన గొట్టేటోల్లు. సెదుగు పిల్లలు. నేను సదివిన కథల్లోనేమొ మెత్తటి మనుషులు. గమ్మతు సుతిమెత్తటి మాటలాయె. నాయి గొడ్డలి పురాండం. ఇగ విజయ కుమార్ వాళ్లు మల్ల అడుగలే. నేను వాళ్లకియ్యలే.

కాని కథ పుర్రెల పురుగు మెసిలినట్టు మెసలవట్టె. బొత్త కొంరయ్య సెవుల జోరీగ తీర్గ పోరు. ఎట్లయిన మంచిదని వరంగల్లు గిర్మాజీపేటలో మా అత్తగారింటికి బొయ్యే తొవ్వల ఉన్న 'శ్రామికవర్గ ప్రచురణలు'(1975లో)కు యిచ్చి సేతులు దులుపుకున్న. మర్సేపోయిన. ఆయింక బోలెడు కథ జర్గింది.

ఎమర్జెన్సీ ఎత్తేయడం, నేను నౌకరీ కుదురుకోవడం, పల్లెల్ల రైతుకూలీ సంఘాలు ఆరంభం కావడం, 1977 సెప్టెంబరు నెలల ఎమర్జెన్సీ ఎత్తేసిన తరువాత ఆరంభమైన 'సృజన' పత్రిక వచ్చింది.

మా నాయినమ్మ దినాలకు గాజులపల్లికి పోవుకుంట గోదావరిఖనిల దిగి రివాజు ప్రకారంగా ఆడ పత్రికల షాపు బండారు కిష్టయ్య షాపుకు బోతి. ఏమున్నది ఆడలైను. ఎవలో ఏదో పుస్తకం సేతుల బట్టుకొని సదువుతుండు. ఇంటున్నోల్లంత వక్కడ వక్కడ నవ్వుడే కాదు. తిడుతండ్లు. లోపల జొరబడి నేను వింటే ఏమున్నది? అయి నా మాటలే. అది బొత్త కొంరయ్య కథే. 'ఎదురు తిరిగితే' కథే. కండ్లల్లకు నీల్లచ్చినయ్ గుబగుబ. సల్ల సెమటల్ బెట్టినయ్. వయి సంకల బెట్టుకొని ఆడికి కొద్ది దూరంల పాన్‌షాపులు పెట్టుకున్న మా ఊరోల్ల కలిత్తి.

ఆడ "అయ్యో రాజన్న... ఎటు వోతన్నవ్? ఊరికేనా? గ కథెందుకు రాస్తివి? మా పజీత్ దీసిండని మీ నాయినతోటట్టుగ ఊళ్లె పెద్దమనుషులంత తలో వయి సంకలబెట్టుకొని తిరుగుతండ్లు. ఊరంత పిసపిసలాడుతండ్లు. గిప్పుడు పోకు" అన్నరు. ఇగేం చెప్పాలె? మునుపటి తీర్గ నా అండ్ల నేను పిసపిస రాసుకుంటె ఎవడేమను? పుసుక్కున నిజం రాస్తె గిట్లయిపాయె. మరి కడుపుల దాగకపాయె. బస్టాండు దాకా నడిసిపోయి ఎర్రటెండల ఎటు దోసక సానసేపు వచ్చిపోయె బస్సులు సూసుకుంట కూసున్న. గాలికి పొయ్యే కంప ముడ్డికి తగిలింది. ఆఖరుకు బొత్త కొంరయ్య కండ్లల్ల కన్పిచ్చిండు. మా నాయినమ్మ చెంద్రవ్వ గన్పిచ్చి మనుసు కలికలయ్యింది. అది నాకు అనేక శాత్రాలు సెప్పింది.

"దెహె. మానం సేసెటోనికుండాలె. సెప్పెటోనికేంది?" బొత్త కొంరయ్య మనుసుల మెదిలి అన్నడు.

సీమిడి సీదిన. కండ్లు తుడుసుకున్న. బస్సెక్కిన. నాకన్న ముందే చేరిన మా చుట్టమామె నాకు కబురు చెప్పింది.

అప్పటికే ఊళ్లోల్లందరు మా ఆకిట్ల గడంచల కూసుండి నాకోసం ఎదురు సూత్తండ్లు. మా అవ్వ సేతులు పిసుక్కుంటంది. తలొంచుకొని వాళ్లనెవ్వల్ని సూడకుంట ఇంట్లెకుబోయిన.

"ఏందిర రాజ, మా పజీత్ దీసి పెంటమీదేత్తివి" అన్నది మా అవ్వ.

ఇగట్ల లేచిన అరుగుమీదికచ్చి నిలబడి... "ఔనుల్లా లాకాలాం రాసిన. మీరు గయ్యన్ని కంగాలీ పనులు సెయ్యంగలేంది? నాకేం బయ్యం? ఊళ్లె అందరికీ గీ ముచ్చట్లన్నీ ఎరికే. అందరు సెప్పుకున్నయే నేను రాసిన. ఏం పీక్కుంటరో పీక్కోపోండ్లి" అన్న. బొత్త కొంరయ్య తీర్గ.

పెద్ద మనుషులు ఆ కంఠస్వరాన్ని ఊహించలేదు. ఏందేందో గొనిగిండ్లు. మల్ల ఇంట్లకు పోయిన.

"గ పేర్లన్న మార్చనుంటివి. సరే. పెడితే పెట్టినవ్. పుండుమీద కారం జల్లినట్టు గిది మా గాజులపల్లి గ్రామం అంట రాస్తివి. గయ్యన్ని మార్పిచ్చు" అన్నరు. రాజీకచ్చిండ్లు. బొక్కలిరుత్తరనుకున్న మా ఊరి పెద్దమనుషులు తోకమలుసుకొని పోయి కుక్కలతీర్గ లేసిపొయిండ్లు.

గప్పుడు ఎదురు తిరిగితే ఎంతటోడైన తోక ముడుత్తడని సీమకాలంత ఎద్దు గోర్జం మింగినట్టయ్యింది. ఆ తరువాత "ఇది కల్పితం" అని రాయాల్సి వచ్చింది.

'ఎదురు తిరిగితే' కథ నా మీదనే ఎదురు తిరిగింది. కానీ, నాకు కథ, భాష మౌఖిక పద్ధతిలో రాయడం సుడిగాలిలా సుట్టుకపోగలదని అర్థమయ్యింది. నేను ఎదురు సూస్తున్న పదునెక్కిన ఆయుధం దొరికింది. నాకు దారి చూపింది. కొందరు వీరులు చరిత్ర నిర్మాతలు కాదు. బొత్త కొంరయ్యు చరిత్ర నిర్మాతని అర్థమయ్యింది.

**5. మీ కథలు, నవలలకు ప్రేరణ?**

నేను పుట్టి పెరిగిన పల్లె బతుకు. ఉద్యోగరీత్యా ముప్పై ఎనిమిది సంవత్సరాలు కార్మికులతో బతికిన. ఆసక్తి రీత్యా ఆదివాసీ ప్రాంతాలతో అనుబంధం. ఆదివాసీ, వ్యవసాయిక, కార్మిక జీవితాలు. ఆ జీవితాల్లోని ఆరాట పోరాటాలు నా జీవితంలో భాగమయినై.

గ్రామాల్లో క్రూరమైన, మధ్యయుగాల నాటి దొరతనం, దోపిడీ, పీడనతో 90 శాతం ప్రజలను పీల్చి పిప్పిచేశారు. ఊపిరాడని పల్లెలు. నా కాలంలో నక్సల్బరీ, శ్రీకాకుళం, అంతకుముందటి తెంగాణా సాయుధ పోరాట వారసత్వంతో పోరాటాల్లోకి దిగాయి. ఉత్పత్తి విధానం, ఉత్పత్తి సంబంధాల మధ్యగల వైరుధ్యాన్ని పరిష్కరించడానికి రైతాంగ సాయుధ పోరాటం ఆరంభమయ్యింది. సకల వివక్షతలను రూపు మాపడానికి విప్లవోద్యమాలు నా కాలంలో, ప్రాంతంలో ప్రారంభం కావడం తప్పనిసరైంది. ముఖ్యంగా రెండువేల ఐదువందల సంవత్సరాల కరుడుగట్టిన భూస్వామ్యాన్ని అది ఆక్రమించిన గ్రామాల్లో నుండి దొరలను తరిమేయడం. 'విప్లవ రచయితల సంఘం', 'జన నాట్య మండలి', 'రాడికల్ విద్యార్థి సంఘం', 'రైతుకూలీ సంఘం', 'సింగరేణి కార్మిక సంఘం', 'ఆదివాసీ రైతుకూలీ సంఘాల' లాంటివి అప్పటి 'పీపుల్స్‌వార్' నాయకత్వంలో ఏర్పడి పనిచేసినై.

కరీంనగర్, ఆదిలాబాద్ గ్రామాల్లో రైతుకూలీ సంఘాలు ఏర్పడి 'దున్నేవారికి భూమి' నినాదంతో వేలాది ఎకరాల భూమి రైతులకు పంచింది. కూలి రేట్లు, పాలేర్ల జీతం, ఆశ్రిత కులాల వెట్టి, వాళ్లకు పెట్టుబడుల పెంపు, ప్రతీ పంచాయితులు క్రమంగా కార్మిక ప్రాంతాలకు, అటవీ ప్రాంతాలకు విస్తరించి కార్మికుల

హక్కుల గురించి, ఆదివాసీల భూ సమస్య, అటవీ అధికారుల దౌర్జన్యం ఎదిరించి నిలిచింది. ఎప్పటికప్పుడు ఇసొంటి పోరాటాల్లో అనేక విద్రోహాలు, మలుపులు, వైరుధ్యాల పరిష్కారంలో మార్క్సిజం, లెనినిజం, మావోయిజం వెలుగులో అధ్యయనం, పరిష్కారం మన కాలానికి, దేశానికి సంబంధించిన ఆర్థిక, రాజకీయ, సామాజిక గతి క్రమం అధ్యయనం, పోరాటం, ఆచరణ ద్వారా ప్రజల నుండి నేర్చుకోవడం.

ఒక్క మాటలో చెప్పాలంటే పాత అభివృద్ధి నిరోధకమైన సమాజాన్ని, అందులోని వైరుధ్యాలను పరిష్కరించి కొత్త ప్రపంచాన్ని నిర్మించడం. ఈ క్రమంలో నాకు తెలిసిన ఆచరణాత్మకమైన ప్రతి మలుపునూ నా వంతు కర్తవ్యంగా ఉద్యమ ఆచరణ, అనుభవాలను చిత్రించడానికి ప్రయత్నం చేసిన. రచయితగా సుదీర్ఘకాలం విప్లవోద్యమ అనుభవంలో ఉండటం నా నవలలు, కథలకు ప్రేరణ. కథలు, నవలలు, వ్యాసాలు, వార్తా కథనాలు, నాటకాలు, ఇంటర్వ్యూలు, పుస్తకాల ప్రచురణలు, రచయితల సంఘాలతో వర్క్‌షాపుల్లో భాగం పంచుకోవడం... ఇలాంటి సమిష్టి అధ్యయనం, ఆచరణ రాయడానికి పురికొల్పాయి. అనివార్యమైన అవసరం నుండి, ఒత్తిడి నుండి రాసిన. రాసింది నేనే అయినా ఈ మొత్తం రచనకు విప్లవోద్యమం మూలం.

**6. విప్లవ సాహిత్యోద్యమానికి అల్లం సోదరుల కాంట్రిబ్యూషన్ ఏమిటి?**

అందరికీ తెలిసిందే. మా కుటుంబాల్లో నేనే మొదటిసారిగా హైస్కూలు చదువు దాకా వెళ్లింది. ఆ సదువబ్బక, నేను వెతికే సదువు దొరుకక మంథనిలో తిరుగంగ తిరుగంగ లైబ్రరీ దొరికింది. అందులో వందలకొద్ది వయిలు. పల్లెల బుట్టి, చిన్నపాటి పట్నంల గాయిబడ్డ నాకు భారతదేశానికి, ప్రపంచానికి లైబ్రరీ దారులు తెరిసింది. లైబ్రరీలో సభ్యున్నయి పుస్తకాలు ఇంటికి తీసుకపోయేటోన్ని. లైబ్రేరియన్ ప్రభాకర్ ఉదారంగా ఉండేవారు. ఇంటికి ఎన్నంటే అన్ని పుస్తకాలు ఇచ్చేవారు. అట్లా మా యింట్లకు పుస్తకాలు రావడం ఆరంభమయ్యింది. కాళ్లు రిల్లలు పట్టేదాక సోయి లేకుంట రాత్రి పగలు పుస్తకాలు సదవడం అయ్యి నా తీర్గ సెడిపోతరని మా తమ్ముడు వీరన్న, నారాయణలకు యిచ్చేవాన్ని కాదు. కాని వాళ్లిద్దరు ఆ పుస్తకాలు ఎట్లనో అట్ల దొరికిచ్చుకొని సదివెటోల్లు.

ఇగ మా యింట్ల పుస్తకం సొచ్చినంక ఎట్లుంటది? నేను డిగ్రీ కోసం హన్మకొండ పోయిన. మా తమ్ముల్లు మంథెన కచ్చిండ్లు. ప్రత్యేక తెంగాణా ఉద్యమంల నాతోపాటు మా తమ్ముళ్లు తిరిగేవాళ్లు. మా తిరుగుబాటు దోస్తులు మా తమ్ముళ్లకు దోస్తులే. 1973 వరకు కరీంనగర్‌లో విప్లవోద్యమం. తెలంగాణా ఉద్యమంలో పాల్గొన్న. చురుకైన విద్యార్థులతో సంబంధాలు పెట్టుకున్న. అట్లా మల్లోజుల కోటేశ్వరరావు, చందుపట్ల క్రిష్ణారెడ్డి (నా క్లాస్‌మేట్, రూమ్మేట్), పేరం ఓంకారి లాంటివాళ్లు విద్యార్థుల్లో పనిచేయడం ఆరంభమయ్యింది. మా తమ్ముళ్లతో పాటు రూంమేట్సయిన బయ్యపు దేవేందర్‌రెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి రూంల్లో అనేక చర్చలు, సమావేశాలు. 1974లో ఏర్పడ్డ 'రాడికల్ విద్యార్థి సంఘం' ఏర్పాటు కోసం వీళ్లందరు హైదరాబాదు తరలిపోయిండ్లు. 1975 నాటికి అల్లం నారాయణ పూర్తి కాలపు కార్యకర్తగ పనిచేస్తున్నడు.

మంథెనలో యుద్ధ వాతావరణం నెలకొంది. మంథెనలో పూర్తిగా బ్రాహ్మణుల ఆధిపత్యం ఉండేది. దాన్ని మొదటి సారిగా ఎదురించి నిలబడడం ఎప్పటినుండో ఉన్నది. 1970 నాటికే బ్రాహ్మణ విద్యార్థుల మీద పోటీచేసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు, కార్యదర్శులుగా బహుజనులు ఎడ్ల చంద్రయ్య (ప్రసిడెంటు), నేను ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనం. ఎన్నికల్లో ప్రత్యర్థులను నిలబెట్టి పోరాడుతున్నం. పీవీ నర్సింహారావు అసెంబ్లీ నియోజకవర్గంలో మేము బలమైన ప్రత్యర్థులుగా ఎదుగుతున్నం. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూడా బ్రాహ్మణుల్లో పనిచేస్తూ మాతో తలపడేది. నేను వరంగల్ వెళ్లిపోయిన తరువాత లోకల్ రాజకీయాల్లో బ్రాహ్మణ వ్యతిరేకత ఒక నిర్మాణ రూపం తీసుకున్నది. ఫలితంగా వీధి పోరాటాలు, మీటింగులు, ఈ మధ్యలోనే అత్యయిక పరిస్థితి ప్రకటించబడింది. నారాయణ వాళ్లు అరెస్టయ్యారు. నారాయణ కార్యకర్తగా తెలిసింది. రూమ్‌మేట్ కనుక వీరన్నను కొంతకాం లాకప్‌లో పెట్టిండ్లు.

నారాయణ విద్యార్థి రంగంలో పనిచేసిండు. ఎమర్జెన్సీ ఎత్తివేయగానే 'విప్లవానికి బాట', 'వ్యవసాయ విప్లవం' జయప్రదం చేయడానికి అప్పటి మా ప్రాంతపు 'జన నాట్య మండలి' బాధ్యుడిగా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో అనేక ప్రదర్శనలిచ్చిండ్లు. నారాయణ ఉపన్యాసకుడుగా, గాయకుడిగా, నటుడిగా పనిచేసిండు. 8 సెప్టెంబర్ 1978న 'జగిత్యాల జైత్రయాత్ర' సందర్భంగా జగిత్యాల పట్వారిగా 'బీదల పాట్లు'లో నటించిండు. నారాయణ నాకు, మా వీరన్నకు విప్లవోద్యమాన్ని పరిచయం చేసిండు. అప్పుడు పుస్తకాలు చదివినవాళ్లం మేం ముగ్గురం సాహిత్యం రాయాల్సి వచ్చింది.

ఉద్యమాల డిమాండ్ మేరకు పోరాటంలోంచి పాటలు కావాల్సి వచ్చినవి. వీరయ్య భావుకుడు. ఆయన పాటలు రాసిండు. నారాయణ ఆ పాటలన్నీ మీటింగుల్లో పాడేవాడు. నారాయణ ఉద్యమ అవసరాల రీత్యా పాటలు రాసిండు. కవిత్వం రాసిండు. ఆ తరువాత నారాయణ పూర్తి కాలపు కార్యకర్తగా 1985 దాకా అజ్ఞాత జీవితం. తరువాత బయటకు వచ్చి చదువు కొనసాగించిండు. మళ్లీ ఉస్మానియాలో విద్యార్థి ఉద్యమాలు, పత్రిక విలేఖరిగా, నమస్తే తెలంగాణ సంపాదకుడిగా, తెలంగాణ

ఉద్యమంలో జర్నలిస్టుగా, ఫోరం అధ్యక్షుడిగా, 'అల్లం కారం', '(ప్రాణహిత' కాలమ్స్ రాసిండు. అనేక ఉపన్యాసాలు, ఇంటర్వ్యూలు ఇచ్చిండు. అనేక మీటింగులు ఏర్పాటుచేసిండు.

వీరన్న 'ఎర్రజెండెర్రజెండెన్నియలో' లాంటి చాలా పాటలు రాసిండు. 'పిలగాని ఏడుపు', 'రెండు మరణాలు', 'వాసన', 'ధీరుడు' లాంటి గుర్తుండే పది కథలు రాసిండు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చాలా పాటలు రాసిండు. ఆ కాలంలో కరపత్రాల నుండి మొదలుకొని పత్రికకు రిపోర్టులు, ఉద్యమ రిపోర్టులు, కథలు, నవలలు, ఉద్యమ మలుపులతో సహా అనేకం నేను రాయాల్సి వచ్చింది. మాట్లాడాల్సి వచ్చింది. విశ్లేషించాల్సి వచ్చింది. ఏది ఏమైనా ఒక చిన్న పల్లెటూరు నుండి, పేద రైతు కుటుంబం నుండి, బహుజన కులం నుండి, చదువు లేని కుటుంబం నుండి అనేకానేక గొడవల మధ్య, పోరాటాల మధ్య మృత్యువుకు మిల్లీమీటర్ దూరంలో తెలంగాణ సమాజం అనుభవించినంత ఒత్తిడి, దు:ఖం వేం అనుభవించినం. అయినా సాహిత్యరంగంలోకి రావడం జరిగే పని కాదు. పుస్తకాలు, విప్లవోద్యమం, తెలంగాణలో మా లాగే చాలా మందికి కొత్త, వేగవంతమైన మూడు తరాల, యాభై సంవత్సరాల పోరాట అనుభవాలను నేర్పింది. మాకెప్పుడు అమరులైన మా సహచరులు మార్గదర్శకులుగా నిరంతరం మెదులుతూ ఉంటరు. తెలంగాణ, మా కాలం, విప్లవోద్యమం మమ్ముల్ని మనుషుల్లో కలిపింది. నిలబెట్టింది. సాహిత్యం రాయించింది.

**7. మీ రచనల్లో స్థానికతను ఉద్యమ స్థాయిలోకి ఎట్లా తీసుకొచ్చారు?**

విప్లవోద్యమాలు ఎప్పుడైతే నేనున్న స్థల కాలాల్లోని వైరుధ్యాలను వర్గపోరాటం ద్వారా మార్చాలనుకున్నయో గ్రామీణ ప్రాంతాల ఉత్పత్తి వనరులైన భూమి, అడవి, చెట్టు, పుట్ట, పశు పక్ష్యాదులు- ఉత్పత్తి శక్తులైన రైతు, రైతు కూలీలు, మధ్య తరగతి రైతులు, ధనిక రైతులు, భూస్వాములు, నైసర్గిక స్వరూపం, భౌగోళికాంశాలు, కులాలు, వీటన్నిటి మధ్య వైరుధ్యాలు, నీటి వనరులు, ఉత్పత్తి పరికరాలు, ఉత్పత్తి సంబంధాలు ప్రతి గ్రామాన్ని అధ్యయనం చేశారు. ప్రచురించిన 'మాణిక్యాపూర్' సామాజిక సంబంధాల తరహాలో ఈ అధ్యయనంలో అనివార్యంగా భాగస్వామిని కావాల్సి వచ్చింది.

గ్రామాల్లో, పట్టణాల్లో ఉండే సామాజిక అంశాలు, ఆర్థిక అంశాలు, శత్రువులెవరు? మిత్రులెవరు? ఎక్కడ మొదలు పెట్టాలె? రైతుకూలీ సంఘాలు ఏర్పడి పనిచేయడంతో పరిష్కారానికి సమిష్టి స్వరూపం వచ్చింది. 'విప్లవానికి బాట', 'వ్యవసాయ విప్లవం' దారిలో 'దున్నేవారికే భూమి' ప్రతిపాదికన ఉద్యమాలు నడిచాయి. కూలీ రేట్లు పెంపు, పాలేర్ల జీతాల పెంపు, ఆశ్రిత కులాల వెట్టి రద్దు, పాలేరుకు సరైన పెట్టుబడుల డిమాండ్-ఈ సమస్యలన్నీ పరిష్కరించే క్రమంలో ఊరికీ ఇంకో ఊరికీ వ్యత్యాసాలుండేవి. ఇలాంటి పోరాటాలను సమన్వయం చేసి ఆర్థిక పోరాటాలను, రాజకీయ పోరాటాలుగా, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలుగా (సాయుధ రైతాంగం గెరిల్లా ప్రాంతాలు, విముక్తి ప్రాంతాలు ఏర్పరిచి దీర్ఘకాలిక యుద్ధంతో కార్మిక కర్షక రాజ్యాధికారం సాధించడం వ్యూహంలోని భాగంగా పోరాట ఎత్తుగడలు వేసుకున్నాయి) అభివృద్ధి చేయాల్సిన తరుణంలో, విప్లవోద్యమంలో ఉన్న ప్రజలకు, వారి నాయకులకు ప్రణాళికబద్ధమైన, రాజకీయాలందించడానికి పాట ఎప్పుడో 1970 తరువాతనే స్థానికతను సంతరించుకున్నది. ప్రజల భాషను ఎంచుకున్నది. అంతకన్నా విస్తృతంగా, లోతుగా కార్యక్రమాలు కనిష్ట స్థాయి నుంచి గరిష్ట స్థాయికి ఎదగడానికి విస్తృత ప్రజానీకానికి చేరడానికి సాహిత్య రూపాలు అవసరమైనయి. మొదట కరపత్రాలు ప్రజల భాషలో రాయడం ఆరంభించి కథలు రాయడం అవసరమైంది. అట్లాగే పోరాటాలు ఒక దశ నుండి మరొక దశకు గుణాత్మకంగా మార్పు చెందే క్రమంలో గడిచిన అనుభవాల నేపథ్యంలో వర్తమానం భవిష్యత్ దారిలో నవలలు రాయాల్సి వచ్చింది. అట్లా వస్తువు, శిల్పం, భాష స్థానికతను సంతరించుకున్నవి.

విప్లవోద్యమం అన్ని శక్తులను, వనరులను చైతన్యవంతంగా సమన్వయం చేసుకుని ముందుకు సాగే క్రమంలో విప్లవోద్యమ స్థాయిలో సాహిత్యంలో ఉద్యమ స్థాయి పెరుగుతూ, బలపడుతూ వచ్చింది. అందుకే మిగతా సాహిత్యం కన్నా విప్లవోద్యమం నుండి వచ్చిన సాహిత్యం భిన్నమైంది. ప్రణాళికబద్ధమైన ఆచరణాత్మకమైనది. లక్ష్యాన్వితమైనంది. చారిత్రాత్మకమైంది. సజీవమైంది. వైయక్తిక అనుభవ స్థాయి నుండి సమిష్టి స్థాయికి, ఉత్పత్తి శక్తుల దగ్గరికి సాహిత్యం చేరుకోగలిగింది.

రష్యా, చైనా విప్లవోద్యమాలు ముఖ్యంగా చైనా సాంస్కృతికోద్యమం అనుభవ సారంతో ఇక్కడి విప్లవోద్యమం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా పదునైన ఆయుధంగా అభివృద్ధి చేసుకున్నది. అందుకే విప్లవోద్యమ కార్యకర్తలు చాలామంది పాటలు, కవిత్వం, కథలు, నవలలు రాశారు. సాహిత్యం విప్లవోద్యమం వెనుకనో, ముందో నడువకుండా ఉద్యమంతో పాటే నడవడం మన కాలపు ప్రత్యేకత.

**8. మిమ్మల్ని అత్యంత ప్రభావితం చేసిన రచయితలెవరు?**

ముందే చెప్పినట్టుగా మా మేనత్త తిప్పని మీనమ్మ, అమ్మమ్మ కారుకూరి భూమమ్మ, నానమ్మ అల్లం చంద్రమ్మ మౌఖిక కథలు. వందలాది మంది మా వూరి మౌఖిక, జానపద

కళాకారులు నా చుట్టూ విస్తరించి ఉన్న నా జీవితంతో పెనవేసుకున్నవాళ్లెందరో. వాళ్ల అనుభవాలు మౌఖికంగా పంచుకున్నారు. వాళ్లు మౌఖిక కళాకారులు.

తెలుగులో చిలకమర్తి, విశ్వనాథ నుండి ఇప్పటి దాకా అందినకాడికి చదువుతుంట. ఇన్ని వైరుధ్యాలతో ఉన్న సమాజంలో ఒక్కొక్కరికీ ఆరాట పోరాటాలు, కులాలు వేర్వేరు. పేరు లేని అనేకమంది రచయితలు నన్ను ప్రభావితం చేశారు. కొడవటిగంటి కుటుంబరావు, గోపీచంద్, ఉన్నవ, చలం, బుచ్చిబాబు, మా గోఖలే, పి. సత్యవతి, ఓల్గా, రంగనాయకమ్మ, లత, కాళీపట్నం రామారావు, భూషణం, రావిశాస్త్రి, అప్పల్నాయుడు, బి.టి. రామానుజం, దాశరథి రంగాచార్య, కాళోజీ, యద్దనపూడి, వట్టికోట ఆళ్వారుస్వామి, వరవరరావు, షహీదా, సాధన, తాయమ్మ కరుణ, సుజాత, నిత్య, వనజ, రఘోత్తమరెడ్డి, పి.చంద్, ఖదీర్‌బాబు, నామిని, బండి నారాయణస్వామి, పాణి, దేవపుత్ర, కళ్యాణరావు, మధురాంతకం నరేంద్ర, మహేంద్ర, రాసాని, ఉమామహేశ్వరరావు నా ముందు తరం, సమకాలికులు, యువకులు అందరి నుండీ ప్రభావితమయ్యాను. పేర్లు రాస్తే ఎన్నో.

ముఖ్యంగా విప్లవ రచనను రాసే వారెవరినైనా మార్పు క్రమానికి సంబంధించి ఆ ప్రక్రియలో, ఆ స్థల కాలాల్లో పోరాడిన ప్రజలే అంతిమంగా ప్రభావితం చేస్తారు. అంతిమంగా విప్లవమే అత్యంత ప్రభావితం చేసే అంశం.

**9. 'మధ్యవర్తులు' కథ రూపొందడానికి నేపథ్యం ఏమిటి?**

నేనెంతో ప్రేమించిన మా పల్లెలో బతికే పరిస్థితులు లేనందున బయటపడడానికి చదువు అనే దారపోసతో ఊరొదలడం లోలోపల గూడు కట్టిన విషాదం. గుడిమెట్టు, బూరుగాకు, టీనేజీ ప్రేమలు, మంచె కావళ్లు, ఎడ్లగాసుడు, ఏ మాయా మర్మం లేని దోస్తులు ఇప్పటికీ కలలోకొస్తయి. అందరితో పాటు అక్కడే ఉండకుండా ఊరొదిలి రావడం గిల్టీగా ఉండేది. అయితే అనేక అసమానతలతో, వైరుధ్యాలతో, హింస, దోపిడీతో కూడుకుని ఉన్న భూస్వామిక పల్లెనొదలడం అనివార్యమైతే చదువు ద్వారా దోపిడీ, యంత్రాంగంలో భాగమై ఉద్యోగం చేయడం, ఈ రెండు రకాల జీవిత సంఘర్షణ ప్రతి నిత్యం వేధించేవి. విప్లవోద్యమాలు, మార్క్సిజం, పరాయీకరణ, గోర్కీ వ్యక్తిత్వ విధ్వంసం చదివినా కొద్దీ పరాయీకరణ విషయం అర్థమయ్యింది. నూతన ప్రజాస్వామిక సమాజం స్థాపన కోసం భారతదేశంలో దీర్ఘకాలిక రైతాంగ సాయుధ పోరాటం ఆరంభించి కొనసాగిస్తున్నాయి. ఆ లక్ష్య సాధనలో విస్తరిస్తున్నాయి.

సింగరేణి కార్మికుల్లో సికాస బలమైన నిర్మాణంగా ఎదిగింది. ఈ దశలో ప్రజలు గ్రామాలల్లో భూస్వామిక అధికారాన్ని కూలదోశారు. దొరలు గ్రామాలు ఖాళీ చేశారు. ఆ స్థానాన్ని బూర్జువా నిర్మాణ రూపాలైన స్థానిక సంస్థలకు ఎక్కువ భాగం బహుజనులు ఎన్నికయ్యారు. విప్లవోద్యమాల్లో పాల్గొన్న రైతుకూలీలైన దళితులు, మహిళలు చాలా భాగం ఈ నిర్మాణాలకు ఆవలే ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చినవాళ్లు మునుపటి దొరలు కాదు. కానీ వీళ్లు రాజ్యం యంత్రాంగానికి 'మధ్యవర్తులు'.

సింగరేణి కార్మికులు అనేక సమ్మెలు, పోరాటాలు చేసి వారి దైనందిన సమస్యలు పరిష్కరించుకొని కార్మికవర్గ శక్తిగా రాజకీయంగా ఎదిగి విప్లవోద్యమానికి  నాయకత్వం వహించే విషయంలో తడబడుతున్నారు. అదే క్రమంలో ఎదగాల్సిన ప్రజాసైన్యం, స్థావర ప్రాంతాల డిమాండ్ పెద్ద ఎత్తున ఏర్పడింది. అనివార్యంగా ఆదివాసులు అండగా నిలబడ్డారు. ఆర్థిక పోరాటాల్లో వేల సంఖ్యలో కదిలిన ప్రజలు ఆ సమస్యలు పరిష్కారం కాగానే రాజకీయ పోరాటాలు రైతాంగ సాయుధ పోరాటం ఉన్నత రూపంలోకి తగినంతగా ఎదుగలేదు. ముఖ్యంగా దీర్ఘకాలం పోరాటాలల్లో రాటుదేలిన తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమలో రకరకాల కారణాలతో మందకొడితనం.

ఈ స్థితికి కారణమేమిటి? మార్క్సిజం ఏం చెప్పుతోంది? మన పోరాటాల అనుభవమేమిటి? పెద్ద ఎత్తున ఏర్పడుతున్న, రూపొందుతున్న 'మధ్య తరగతి' గురించి ఆలోచనలు సాగాయి. గోపీచంద్ 'అసమర్థుడి జీవయాత్ర', కొ.కు, రావి శాస్త్రి రచనలు అధ్యయనం చేశాము.

భారతదేశవ్యాపితంగా ఇలాంటి మధ్యవర్తుల గురించి అన్ని భాషల్లో సాహిత్యం వచ్చింది. దాదాపుగా వచ్చిన సాహిత్యమంతా కూడా వైయక్తికంగా 'మధ్యవర్తులు' రూపొంది రాజకీయాధికారపు యంత్రాంగంలో భాగమవడం, కొంత సంఘర్షణ, చివరకు లొంగిపోవడం వరకు మాత్రమే చర్చించాయి. మధ్యతరగతి గోడమీది పిల్లి. విప్లవోద్యమాలు గెలిచే విధంగా ఉంటే అందులో చేరుతాయి. ఓడిపోతే, కనుమరుగై పోతే ప్రభుత్వ పక్షం చేరుతుంది. ఇలాంటి సందర్భంలో ప్రజలను అణచడానికి, దోపిడీ చెయ్యడానికి రాజ్యం వీళ్లను చీలదీసి మధ్యవర్తులుగా యుద్ధరంగంలో నిలబెట్టి ప్రజలతో కొట్లాడే విధంగా తయారు చేస్తుంది.

1967 నుండి 1990 దాకా కొనసాగిన విప్లవోద్యమంలో దాదాపు 23 సంవత్సరాల కాలంలో మధ్యతరగతి విద్యార్థులు, బుద్ధిజీవులు పెద్దఎత్తున పాల్గొన్నారు. విప్లవోద్యమం తీవ్రమైనకొద్దీ నిర్బంధం పెరిగినాకొద్దీ అనేకమంది విప్లవం నుండి తప్పుకున్నారు. ప్రమాదం కాని విశ్లేషణలకు, విమర్శలకు మాత్రమే పరిమితమైన అనేక సంఘాల్లో సమీకృతమయ్యారు. ఈ స్థితిని పసిగట్టిన

సామ్రాజ్యవాదం, రాజ్యం ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తూ దానికి తగిన తాత్వికతను రూపొందించే ఎత్తుగడను చేపట్టింది. అనేక ఎన్జీవో సంఘాలు ఇతర సంఘాలు ఏర్పడి బలం పుంజుకున్నాయి. అందరి సనుగుడు విప్లవోద్యమం మీదే. ఇది అంతర్జాతీయంగా రష్యా కుప్పకూలడం, చైనాలో రివిజనిజం తలెత్తడం-మనదేశంలో దీర్ఘకాలంగా నెలకొన్న రివిజనిజానికి తోడు కొత్త రివిజనిజం అభివృద్ధి చెందుతున్న విప్లవోద్యమంలో కూడా తలెత్తుతుంది.

విప్లవోద్యమం ఈ స్థితికి సంబంధించిన భావ, భౌతిక పునాదుల గురించి అలాంటి శక్తులను సమీకరించడానికి సంబంధించి విప్లవీకరించడానికి, రాజకీయ చైతన్యం కలిగించడానికి పూనుకున్న క్రమంలో 1990 నవంబరులో ఈ కథ వచ్చింది. ఆ పునాదుల మీదనే వీళ్లందరిని సమీకరించి 'సేవ రంగం'గా ముద్దుపేరు పెట్టి దళారీ సామ్రాజ్యవాద దోపిడీకి వాహికగా చేశారు. ఆ తాత్విక నేపథ్యంలోనే ప్రపంచీకరణ 1991లో పీవీ నర్సింహారావు సామ్రాజ్యవాద పెట్టుబడికి, మార్కెట్టుకు తలుపులు బార్లా తెరవడం జరిగింది. అప్పుడు 30శాతం ఉన్న 'సేవ రంగం' వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తి రంగాలను దాటేసి 65శాతం దాదాపు 35 కోట్ల మందికి విస్తరించింది. దేశీయంగానే కాదు, ప్రపంచ మార్కెట్టుకు, దోపిడీకి 'మధ్యవర్తులు' వాహికయ్యారు. యంత్రాంగం అయ్యారు. జాతీయ ఉత్పత్తిలో 73 శాతం ప్రతి యేటా దేశ విదేశాల దోపిడీదార్ల దోపిడీకి వీళ్లే యంత్రాంగం. కానీ తీవ్రమైన ఒత్తిడికి, మోసానికి, లోపలి విధ్వంసానికి గురయ్యారు. మన వేలితో మన కళ్లను పొడవడం ఇది.

విప్లవోద్యమ నేపథ్యంలో స్థల కాలాల్లో పరాయీకరణ క్రమం సంఘర్షణా విడదీయడం, లోబరుచుకోవడం నుండి బయటపడి అంతిమంగా మధ్యతరగతి ప్రజలు విప్లవోద్యమం ద్వారానే తమ విముక్తి సాధించగలరనే ఆశ, అందుకు తగిన ఆచరణ 'మధ్యవర్తులు' కథ రూపొందడానికి కారణం.

**10. కథ నిర్మాణం, శిల్ప వైవిధ్యం ఎట్లా ఉండాలంటారు?**

ఉత్పత్తి విధానం ఉత్పత్తి సంబంధాలతో మనిషికి జ్ఞానేంద్రియాల ద్వారా అనుభవం కలుగుతుంది. వర్గ, కుల, మత, లింగ, ప్రాంత అసమానతలున్న సమాజంలో మన అనుభవం కూడా అసమానతలతో కూడి ఉంటుంది. విప్లవోద్యమ కాలంలో అసమానతల మధ్య వైరుధ్యాల కదలిక, పరిష్కారం తీవ్రమౌతుంది. ఇది పాత అనుభవాలతో కొత్త అనుభవం పడే ఘర్షణ. ఈ సంఘర్షణలోంచి అభివృద్ధి నిరోధకమైనది, ఆచరణ యోగ్యం కానిది నశించిపోతుంది. ప్రగతిదాయకమైనది ఆచరణకు పురిగొల్పుతుంది. ఇలాంటి సంఘర్షణ భావోద్వేగాలను రేపుతుంది. ఇలాంటి వైయక్తిక అనుభవ సంఘర్షణ సమిష్టి అనుభవంగా విప్లవోద్యమంలో రూపొందడం ఆరంభమౌతుంది. వర్గ పోరాటాల గతితార్కిక చరిత్ర ఈ సమిష్టి ఆచరణను మెరుగు పెడుతుంది. ఈ ప్రక్రియను ఇతరులతో పంచుకోవాలనుకున్నప్పుడు ఎవరికి? ఎప్పుడు? ఎలా? ఏమిటి? ఎక్కడ? ఎంత? అనేవి కథ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. అట్లాగే అందుకు తగిన శిల్పం, భాష, వాతావరణం, సన్నివేశాలు, సంఘటనలు, సంభాషణల ఎంపిక మన అనుభవ నేపథ్యంలో రూపొందినవి కథా నిర్మాణంలో పనికి వస్తాయి. ఈ సన్నివేశంలో సాహిత్యం చదవడం ద్వారా ప్రజల్లో మౌఖిక కథల నిర్మాణం అధ్యయనం ద్వారా మనకు కథా నిర్మాణం గురించి అర్థమౌతుంది.

కథలోని అంగాలైన శిల్పం, భాష, సన్నివేశాలు, వాతావరణం, పాత్రలు, సంభాషణలు క్షేత్రస్థాయి పరిశీలన వర్గపోరాటాలతో పాటు అభివృద్ధి చెందే విషయాలు. కథా రచనలోకి దిగి అభ్యాసం చేసినాకొద్ది కథలోని అంగాల లక్షణాల చిత్రీకరణ కనిష్ట స్థాయి నుండి గరిష్టంగా మనం ఎంచుకున్న వస్తువుననుసరించి కథా అంగాలైన శిల్పం, భాష మారుతూ ఉంటాయి. మన రాజకీయ అవగాహన అనగా తాత్విక, రాజకీయార్థిక-గతితార్కిక చరిత్ర అధ్యయనం దృగ్గోచరం అయిన విషయాల లోపలి దృగ్గోచరం కాని విషయాలను, వాటి గతిక్రమాన్ని అర్థం చేసుకుంటాం. అప్పుడు కథ బాహ్య నిర్మాణంతో పాటు అంతర్గత నిర్మాణాన్ని కూడా పట్టుకోగలిగి ఆచరణతో చిత్రించగల్గుతాము.

**11. 'కొలిమంటుకున్నది' నవల పీడిత ప్రజల్ని ఎట్లా ప్రభావితం చేసింది?**

అంతవరకు సమస్యలు, విశ్లేషణలు మధ్యతరగతి వరకే పరిమితమైన సాహిత్యం విప్లవోద్యమంలో భాగంగా గ్రామీణ ప్రాంత రైతాంగ, రైతు కూలీ ఆరాట పోరాటాలను చిత్రించడం ఆరంభించింది. ముఖ్యంగా ప్రజలకు చెప్పడం కన్నా చేతలు కావాలి. చేతలు గాలికన్నా వేగంగా ప్రచారమవుతాయి. రైతుకూలీ సంఘాల ఏర్పాటు అవి గిడసబారిన దొర అణచివేతను ఎదిరించే శక్తిగా ఎదగడం, సంఘాల నిర్మాణం లాంటి విషయాలు ప్రచారమయ్యాయి. అలాంటి నేపథ్యంలో 'కొలిమంటుకున్నది' నవల రూపొందింది. మొట్టమొదటిసారిగా తెలంగాణ గ్రామీణ ప్రజలు, వారి నాయకులు తమ పలుకుబడితో జీవితంతో భాషలో చెప్పే పద్ధతిలో వచ్చిన నవలను తమ జీవితాలకు అన్వయించుకున్నారు. ఆ రోజుల్లో నేను తిరిగిన గ్రామాల్లో రైతులు ఆ నవలలోని సంఘటనల గురించి, దొరతనం గురించి నాతో చర్చించేవారు. భావోద్వేగాలకు లోనయ్యేవారు. కార్యకర్తలు చాలా ఊళ్లల్లో చదివి విన్పించేవాళ్లు. మొట్టమొదటిసారిగా విప్లవోద్యమం పరిమితమే

అయినా ఇలాంటి సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లింది. పురికడుతున్న విప్లవోద్యమానికి 'కొలిమి' అంటుకొని మండటానికి ఆ నవల నాంది అయింది. సృజన 'సాహితీ మిత్రులు', వరవరరావు కలిసి ఆ నవలకు పెట్టిన పేరు అర్థవంతమయ్యింది.

సాహిత్యంలో తెలంగాణ వ్యక్తీకరణ, భాషా జీవితం ఒక అస్తిత్వంతో ముందుకు తోసుకురావడం సాంస్కృతికపరమైన ఉద్యమానికి పునాది వేసింది. 1968లో మొదలై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడినదాకా అనేక ఉద్యమాలకు కూడా 'కొలిమంటుకున్నది' నవలే మూలమయ్యింది. అప్పటి నుండి, అక్కడి నుండి తెలుగు సాహిత్యంలో విస్మరణకు గురైన తెలంగాణ భాష, నుడికారం గౌరవనీయమైనదిగా చలామణి ఔతున్నది. ఆ నవలలో లేవనెత్తిన అర్ధవలస-అర్ధభూస్వామిక అభివృద్ధి నిరోధక అంశాలు పరిష్కరించడానికి, వైరుధ్యాలు పరిష్కరించడానికి నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాలు-అందుకోసం సాయుధ రైతాంగ పోరాటం మూడు తరాలుగా కొనసాగుతూనే ఉన్నది. అలాంటి పోరాట చరిత్రలో ఒకానొక ఆరంభ దశకు సంబంధించిన ప్రజల వ్యక్తీకరణకు 'కొలిమంటుకున్నది' నవల ఒక వాహికగా నిలిచింది.

**12. 'కొలిమంటుకున్నది' నవలపై గూగీ ప్రభావం ఉన్నదా? ఆ నవలను ప్రజలు ఎట్లా సొంతం చేసుకున్నరు?**

ఆ నవల రాసే సమయానికి నాకు గూగీ తెలియదు. కెన్యా కూడా మనలాగే అర్ధ వలస, అర్ధ భూస్వామిక దేశం. అక్కడ అలాంటి రాజ్యాధికారాన్ని మార్చడానికి వారి వారి స్థల, కాలాల నేపథ్యంలో సాయుధ పోరాటాలు నడిచి విఫలమయ్యాయి. అదొక విషాధ అనుభవం. గూగీ కుటుంబం దాదాపు మా కుటుంబం లాగే అందులో భాగం కాక తప్పలేదు.

1967లో ఆరంభమైన నక్సల్బరీ, శ్రీకాకుళ రైతాంగ పోరాటాలు అనేక దశల గుండా ప్రయాణించి 1978, సెప్టెంబర్ 8, 1978 'జగిత్యాల జైత్రయాత్ర' నాటికి సంఘటిత పడ్డాయి. 'వ్యవసాయ విప్లవం' ఇరుసుగా జరిగిన పోరాటంలో కరీంనగర్, ఆదిలాబాదు రైతాంగం, రైతు కూలీలు పెద్ద ఎత్తున కదిలారు. విప్లవోద్యమం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఎంచుకున్నది కనుక, గ్రామ సీమల్లో పనిచేస్తున్నది కనుక ప్రజల భాషలో ఆ నవల రాయాల్సి వచ్చింది. అప్పటికే నిర్మాణాలు ఏర్పడి బలపడుతుండటం వల్ల రెండో దశకు చేరుకున్నాయి.

గూగీ 'గికియూ' భాషలో నాటకం రాసి ప్రదర్శించిన సమయానికి కెన్యాలో నియంత పరిపాలను ఉన్నది. సాపేక్షికంగా ఆ నాటకం ప్రత్యక్ష ప్రదర్శన కనుక ఎక్కువ నిర్బంధం చవిచూసింది. తెలంగాణాలో తొలి రోజుల్లో 'జన నాట్య మండలి' అనేక వందల ప్రదర్శనలిచ్చిన స్క్రిప్టు లేని 'బీదల పాట్లు' నాటకం దాదాపు అలాంటిదే. ఇదివరకే చెప్పినట్లు ప్రజలు 'కొలిమంటుకున్నది' నవలను తమ పోరాట అనుభవంగా, జీవితంగా ఆదరించారు.

'కొలిమంటుకున్నది' నవల గూగీ రచనల కన్నా ముందే ప్రజల భాషలో వచ్చినట్లు వరవరరావు గారు ముందుమాటల్లో రాశారు. అది విప్లవోద్యమం వల్ల సాధ్యమయ్యింది.

**13. 'ఎదురు తిరిగితే' (మొట్టమొదటి దళిత కథ) కు నేపథ్యం ఏమిటి?**

పల్లెలో పుట్టినవాళ్లకు గ్రామాల్లో గల భూస్వామిక కుల సంబంధాలు ఎవరు చెప్పకుండానే అర్థమౌతాయి. గ్రామీణ వ్యవసాయ ఉత్పత్తిలో మాల, మాదిగలు కీలకమైనవారు. వారికి ప్రకృతి గురించి, పంటల గురించి, నీటి పారుదల గురించి, పశువుల పెంపకం గురించి అద్భుతమైన అభినివేశం, జ్ఞానం ఉంటాయి. సమాజం పట్ల, మనుషుల పట్ల ప్రేమగా, దయగా ఉంటారు. మాట తీరు, కంఠ స్వరం స్వచ్ఛంగా ఉంటుంది. నా తొలి గురువు మాదిగ గడ్డం రాజాలు. మా పాలేరు. అతను అతని దృష్టికోణం నుండి మా ఊరిని అర్థం చేయించాడు. అతని ద్వారా పల్లెకు ఎడంగా ఉన్న మాదిగ గూడేనికి రాకపోకలు షురువయ్యాయి. అట్లా అప్పటి మాదిగ గూడెంలోని అందరూ నాకు దగ్గరగా తెలిశారు. ఆత్మీయులయ్యారు.

పుస్తకాలు చదివి, రకరకాలుగా ఇంత దోపిడీ, పీడన జరుగుతుంటే వీళ్లంతా తిరగబడకుండా ఎందుకుంటున్నారు? అనేకునేవాన్ని. కానీ నాకర్థమయ్యిందేమంటే మాదిగలు యుద్ధవీరులు. చిన్న చిన్న రాజ్యాలు, జమీందారులు యుద్ధాలు చేస్తే డబ్బు దస్కంతో పాటు స్త్రీలను, పశువులను, యుద్ధవీరులను తెచ్చి వెలివాడలనే కాన్‌సంట్రేషన్ క్యాంపుల్లో ఉంచేవారు. మాదిగ, మాలలు అలాంటి యుద్ధవీరులు. కులం, బ్రాహ్మణీయ భూస్వామ్యం క్రూరంగా, హింసాత్మకంగా అమలు చేసిన వికృత చర్య. చాలామంది మేధావులు మాయలు చేయడానికి వృత్తులు, కులాలుగా మారాయని సన్నాయి నొక్కు నొక్కుతారు. కావాలని ఎవరూ అంటరాని కులాలను, వృత్తులను ఎంచుకోరు. 1972లో పీవీ నర్సింహారావు మంథనిలో పెట్టిన పెద్ద ఎన్నికల బహిరంగ సభలో మా వూరి బొత్త కొంరయ్య వేలాది మందిలో నిలబడి "అయ్యా... కరంటు వూళ్లె పెట్టిండ్లు గని మా మాదిగ వాడకు ఒక్క కరంటు బుగ్గ వెట్టలేదు" అని నిలదీశాడు.

ఊరికి మాదిగిండ్లకు మధ్యనున్న వ్యత్యాసం నా లోపల గూడు కట్టుకున్నది. బొత్త కొంరయ్య బద్ధలయ్యాడు. 'బద్‌లా' సంకలనం కోసం కరీంనగర్ విజయకుమార్ కథ అడుగగానే బొత్త కొంరయ్య కథ రాశాను. కనీసం పాత్రల పేర్లు కూడా

మార్చకుండా 'ఎదురు తిరిగితే' కథ రాశాను. 1977లో ఎమర్జెన్సీ ఎత్తివేసిన తర్వాత అచ్చయ్యింది. ఇవాళ మనం మాట్లాడుతున్న అంశాలన్నీ, ఆర్థిక, సాంఘిక, రాజకీయ విషయాలన్నీ ఆ కథలో చర్చించాను.

**14. మార్క్సిజం వెలుగులో అస్తిత్వ ఉద్యమాలను ఎట్లా అర్థం చేసుకోవాలి?**

విప్లవోద్యమం అభివృద్ధి నిరోధకమైన సమాజాన్ని పోరాటం ద్వారా ఎప్పుడైతే మార్చాలనుకుంటుందో అలాంటి కార్యకలాపాలు మొదలై ముందుకు సాగినకొద్దీ సమాజంలోని అన్ని రంగాలు, వైరుధ్యాలు కదలబారుతాయి. కరీంనగర్, ఆదిలాబాదు రైతాంగ పోరాటాలు, నక్సల్బరీ, శ్రీకాకుళం, అంతకుముందటి తెలంగాణ సాయుధ పోరాట అనుభవాలతో ఆరంభమై నిలదొక్కుకున్నది. గ్రామాల్లో నుండి దొరలను తరిమేసింది. దున్నేవారికి భూమి ప్రాతిపదికన గ్రామీణ ఉత్పత్తి వనరులను ప్రజలకు పంచాల్సి ఉన్నది. దోపిడీ, హింసాత్మక దొరతనం కూలిపోవడంతో విప్లవ శక్తుల నూతన ప్రజాస్వామిక ఉత్పత్తి సంబంధాలు నెలకొల్పవలసి ఉన్నది. కానీ అర్ధ భూస్వామ్య, అర్ధ వలస ప్రభుత్వం భూస్వాముల తరఫున గ్రామాల మీద ఉక్కుపాదం మోపింది. గ్రామాల్లో వర్గ, కుల, మత, లింగ వ్యత్యాసాలను పరిష్కరించాల్సిన, రాజకీయంగా ముందుకు తీసుకుపోవాల్సిన కర్తవ్యం విప్లవోద్యమం మీద పడింది.

గ్రామీణ ప్రాంతంలోని దళిత, బహుజన, మహిళా శక్తులను చైతన్యపరిచి విప్లవోద్యమంలో సమీకరించడం జరిగింది. ఇప్పుడు ఇంకో దశకు పరివర్తన చెందాలి. సరిగ్గా అలాంటి సమయంలోనే తెలుగుదేశం నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం తెంగాణను ఆక్రమించి కొత్తగా వలస అధికారాన్ని, ఈ అవకాశాన్ని తీసుకొని తీవ్రతరం చేసి తెలంగాణ గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. నాయకులను ఎన్‌కౌంటర్లు, మిస్సింగుల్లో పెద్ద ఎత్తున ఏరివేతకు పూనుకున్నది. ఈ నిర్బంధ వాతావరణంలో కొత్తగా ఏర్పడిన నాయకులను, లొంగిపోయిన వారిని చేరదీసి నాయకత్వంలోకి తెచ్చింది.

జాతీయ, అంతర్జాతీయంగా జరిగిన పెట్టుబడి, సామ్రాజ్యవాద సంక్షోభంతో ప్రపంచ మార్కెట్టుకు, పెట్టుబడిదారులకు గ్లోబలైజేషన్ పేర తలుపులు బార్లా తెరిచింది. ఈ నేపథ్యంలో 1990 తర్వాత అస్తిత్వ ఉద్యమాలు ముందుకు వచ్చి బలపడ్డాయి. మార్క్సిజం అన్ని రకాల అస్తిత్వ ఉద్యమాలను ప్రజలు ప్రజాస్వామిక ఆకాంక్షలుగా అర్థం చేసుకుంటుంది. అస్తిత్వ ఉద్యమాల ఉద్విగ్నతను, ఆవేదనను ఆత్మీయంగా అర్థం చేసుకుంటుంది. అదే సమయంలో అస్తిత్వ ఉద్యమాలను శాస్త్రీయంగా అధ్యయనం చేసి అందులోని అంతర్గత వైరుధ్యాలను అర్థం చేసుకుంటుంది. అయితే అస్తిత్వ ఉద్యమాలు స్థల కాలాల్లో తక్షణ డిమాండ్‌నే సాధారణంగా ప్రముఖంగా ముందుకు తెస్తాయి. తగిన నిర్మాణాలు లేక ఒక్కోసారి విస్ఫోటనంగా చట్టబద్ధ పోరాటాలుగానే ముందుకు వస్తాయి. అవి అనివార్యంగా తగిన ఎత్తుగడతో పరిష్కరించడం డిమాండ్ చేస్తాయి. అలాంటి వైరుధ్యాలకు మూలమైన రాజ్యాధికారాన్ని మార్చడానికి తగిన నిర్మాణంలో ఇలాంటి జాతి, కుల, మత, మహిళా, స్థానిక, ప్రాంతీయ ఉద్యమాలను ఊహాత్మకంగా కార్మిక వర్గ నాయకత్వంలో ప్రజల ప్రమేయంతో అభివృద్ధి చేయాల్సిన కర్తవ్యం కార్మిక వర్గానికున్నది. కొన్ని సందర్భాల్లో తగిన సమయంలో కార్మికవర్గ నాయకత్వం వహించజాలకుంటే ఇలాంటి ఉద్యమాలను బూర్జువా నాయకత్వం వహించి తాత్కాలికంగా విజయం పొందుతారు. ప్రత్యేక తెంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని గమనించవచ్చు. అంతేకాకుండా విప్లవ శక్తులను రకరకాలుగా మభ్యపెట్టి, చీలదీసి ప్రజలకు దూరం చేస్తారు. సాంకేతికంగా సాయుధ బలగాలను ఆధునికీకరించి, ప్రజలు సాధించిన విజయాలను నాశనంచేసి, తిరిగి అగ్రకుల భూస్వామ్య ఆధిపత్యాన్ని, దోపిడీని కొత్త పద్ధతిలో స్థిరీకరించుకుంటారు. ఈ అవకాశాన్ని దళారీ బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు వాడుకొని తమ పెట్టుబడిని, పట్టును బిగిస్తారు.

దళిత, బహుజన, మహిళా, అస్తిత్వ ఉద్యమాల గురించి మార్క్సిజం చాలా చర్చ చేసింది. రాజ్యాంగం, చట్టం కల్పించిన ప్రజాస్వామిక హక్కుల గురించి ప్రజలు–ముఖ్యంగా అస్తిత్వం ఉద్యమాలు పోరాడక తప్పదు. అది అనివార్యం కూడా. కానీ, అర్ధ వలస–అర్ధ భూస్వామ్య విఫల రాజ్యాధికారంలో ముఖ్యంగా రాజ్యాంగ పరిధిలోనే అస్తిత్వ ఉద్యమాలు లేవనెత్తిన అంశాలు పరిష్కారం కాగలవనే ధోరణి ఆ వ్యూహంలో భాగంగా జరిగే ఎత్తుగడ, పోరాటాలు, దళిత, బహుజన మహిళలను మభ్యపెట్టగలవు. విప్లవోద్యమాలను దాటవేయగవు అనే దూరదృష్టి అలాంటి ఉద్యమాలకు లేకపోతే విఫలమై నిరాశ నిస్పృహలకు లోనౌతాయి. ఇలాంటి వైరుధ్యాలకు మూలమైన సమాజాన్ని, దాన్ని నిలబెట్టే రాజ్యాధికారాన్ని మార్చకుండా సాధ్యం కాదు. రాజ్యాధికారం ఒక వర్గం నుండి మరో వర్గానికి యుద్ధం వల్ల తప్ప సాధ్యం కాదంటాడు మావో.

మార్క్సిజం, విప్లవోద్యమం ఎదుర్కొంటున్న వైరుధ్యం ఏమంటే పెద్ద ఎత్తున పెల్లుబుకుతున్న రాజ్యాధికారం దిశగా తగిన ఎత్తుగడతో నాయకత్వం వహించి సమీకరించడం. ప్రస్తుత దశలో ఈ వైరుధ్యాన్ని దళారీ ప్రభుత్వం, సామ్రాజ్యవాదం సకల

విధాలుగా వాడుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. ఇలాంటి ఉద్యమాలను సమీకరించి రాజకీయ ఉద్యమాలుగా అభివృద్ధి చేయడానికి కృషిచేస్తున్నది.

సీపీఎంతో పాటు అన్ని రకాల విప్లవ పార్టీలు భారతీయ సమాజంలో 'కులం' పునాదిగా గుర్తించడం ఒక ముందంజ. ఇది అతి పురాతన బ్రాహ్మణీయ భూస్వామ్యానికి, దళారులకు కలవరపాటు. తగిన ఎత్తుగడలు రూపొంది ఆచరణలోకి దిగితే భారత విప్లవోద్యమంలో ప్రతిష్ఠంభన తొలిగి వేగవంతమౌతుంది. అంతిమంగా అస్తిత్వఉద్యమాలన్నీ ఉత్పత్తి విధానానికి సంబంధాలకు ఉన్న వైరుధ్యాన్ని పరిష్కరించి ప్రజాస్వామికీకరించడానికి సంబంధించిన అతి పురాతన పోరాటాలు. అన్ని అస్తిత్వ శక్తులు ఉమ్మడిగా చేయాల్సి రావడం. భారతీయ సమాజంలో అనివార్యంగా ఉత్పత్తి వనరులు, ఉత్పత్తి శక్తుల్లో కదలిక మొదలై ఉత్పత్తి పెంచడానికి దోహదపడింది. కానీ క్రూరమైన బ్రాహ్మణీయ భూస్వామ్యం, వలస పెట్టుబడి మిలాఖతయ్యి అందుకు తగిన ఉత్పత్తి సంబంధాల్లో మార్పును క్రూరంగా అణచివేశారు. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ అందుకు దోహదపడ్డది.

**15. తెలుగు నేలపై విప్లవ సాహిత్యోద్యమ ప్రభావం ఎట్లా ఉన్నది?**

పురాణాలకు, కట్టుకథలకు ఫ్యూడల్ కంపు గొట్టే మానవ సంబంధాలకు, అంతిమంగా హేతువిరుద్ధమైన భావవాద సాహిత్యం స్థానంలో శాస్త్రీయ వివేచనను విప్లవ సాహిత్యోద్యమం ప్రవేశపెట్టింది. సమాజంలో కూలిపోవాల్సిన దాన్ని, నశించవల్సిందాన్ని పసిగట్టి రూపొందుతున్నదాన్ని వెలికితీసింది. సమాజంలోని వైరుధ్యాలను, వాటి గతి క్రమాన్ని అది మార్చడానికి జరిగిన పోరాటాలను ఎప్పటికప్పుడు చిత్రించింది. శ్రామిక జనం దగ్గరికి, ఉత్పత్తి కులాల దగ్గరికి వెళ్లి వాళ్ల నుండి నేర్చుకొని ప్రగతిశీలమైన దాన్ని వారికి అందించింది. ఇవాళ ప్రజా వ్యతిరేకమైన సాహిత్యం రాయడానికి సాహసించనంత విప్లవోద్యమ సాహిత్యం తెలుగు సాహిత్యంలో గుణాత్మకమైన మార్పు తెచ్చింది.

వస్తువులో ఉత్పత్తి శక్తుల శిల్పంలో తరతరాలుగా ప్రజలు అభివృద్ధి చేసుకున్న తమవైన కళారూపాలను స్వీకరించింది. భాషలో పండిత భాష నుండి ప్రజల భాషను అన్ని రంగాల్లో తీసుకవచ్చింది. పాట, ఆట, కవిత్వం, కథ, నవల, ఉపన్యాసం, నాటకం, బ్యాలే, విమర్శ, అనేక సంగీత వాయిద్యాల మేళవింపు, ఆహార్యం అన్ని రంగాల్లో ముఖ్యంగా భావజాల రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చింది. కుల, మత, పితృస్వామిక, వర్గ వ్యత్యాసాలతో సాగిన సాహిత్యంలో ప్రజాస్వామిక, శాస్త్రీయ దృక్పథాన్ని తీసుకవచ్చింది.

పత్రికలు, ప్రసార మాధ్యమాలు, సినిమాలు అనివార్యంగా విప్లవ సాహిత్యోద్యమం తెచ్చిన మార్పును అంగీకరించక తప్పనిసరి పరిస్థితి. కళా, సాహిత్య రంగాల్లో విప్లవ సాహిత్య ప్రభావం లేని రచయితలు అరుదు. అనేక పాయలుగా ప్రాంతీయ, దళిత, బహుజన, మహిళ, మత మైనార్టీ ప్రజలు లోలోపలి వైఫల్యాలను, దు:ఖాలను, పోరాటాలను వెలికి తీసింది.

భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, తాత్విక రంగాల్లోని డొల్లతనాన్ని, అభివృద్ధి నిరోధకత్వాన్ని, దోపిడీ, హింసను ముఖ్యంగా బ్రాహ్మణీయ కట్టుకథ, పురాణాల సుదీర్ఘ కాలపు కల్పిత గాథ నుండి విముక్తిచేసి తలకిందుల సాహిత్యాన్ని సీదా నిబెట్టింది.

**16. విప్లవ కథలో వస్తు రూప వైవిధ్యం గురించి చెప్పండి.**

విప్లవ కథలో ఎక్కువ భాగం కట్టు కథలు కావు. పుట్టు కథలు. సమిష్టి జీవితపు చలన స్థితులను చిత్రించినవి. విప్లవోద్యమం యాభై ఏండ్లుగా మూడు తరాలుగా అనేక దశల గుండా ప్రయాణం చేసింది. ప్రపంచ సోషలిస్టు విప్లవాలు కూలిపోయిన నేపథ్యంలో భారతదేశంలో కుల, వర్గ సంక్లిష్ట సామాజిక ఆవరణలో విప్లవోద్యమం అనేక ప్రయోగాలు చేసింది.

ఈ విప్లవానుభవం నేపథ్యంలో విప్లవ కథలో వైవిధ్యం, ప్రయోగం, వ్యక్తీకరణల్లో, అన్వేషణలో కొత్త మార్గం అనుసరించాయి. విప్లవ కథలు రాసిన చాలా మంది రచయితలు భూషణం నుండి నేటి దాకా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ విప్లవాచరణలో తమ కాలపు ప్రజందరి లాగే భాగస్వాములయ్యారు. 'అడివంటుకున్నది', 'పులుసు' నుండి 'ఇద్దరు శస్త్రకారులు' దాకా వందల కథలు వచ్చాయి. సుమారు వెయ్యికి పైనే వచ్చి ఉంటాయి. ఒకప్పుడు దైనందిన పోరాటాలు, అందులో కలసివస్తున్న శక్తుల పోరాట నిర్మాణం గురించి ప్రచారం చేయడానికి 'సంఘం'లాంటి కథలు వచ్చాయి. వాటిని సంఘటితం చేయడానికి, ఉన్నత రూపంలోకి తీసుకుపోవడానికి 'సృష్టికర్తలు', 'సత్యం' లాంటి కథలు వచ్చాయి. భారతీయ సమాజపు ఉత్పత్తి సంక్లిష్ట స్వభావం, దాని వల్ల వర్గాలు, కులాల నేపథ్యంలో మనుషులు, సమాజం తీరుతెన్నులు అనగా భారతీయ సమాజపు విధ్వంసకర హేతు విరుద్ధం, భావ వాద, బ్రాహ్మణీయ తాత్వికతను అధ్యయనం చేయడంలో భాగంగా 'మహాదేవుని కల', 'మధ్యవర్తులు', 'మనిషి లోపలి విధ్వంసం', 'కమల', 'ప్రత్యర్థులు', 'అతడు' లాంటి కథలు వచ్చాయి.

పోరాటాలు కార్మిక రంగంలోకి విస్తరించడంలో సింగరేణి నేపథ్యంలో 'బొగ్గు పొరల్లో', 'సమ్మె' లాంటి కథలు వచ్చాయి. ఆదివాసీ ప్రాంతాలకు పోరాటాలు విస్తరించడంలో 'తుడుం', 'రక్త పింజర', 'మరట్ తుడుం పాయానా' లాంటి ఎన్నో కథలు

వచ్చాయి. ఒకే కథలో పొరలు పొరలుగా అనేక వైరుధ్యాల చలనం చిత్రించడం చాలా కథల్లో చూస్తాం. 'చావు విందు', 'పని పిల్ల' లాంటి అనేక కథలు. విప్లవ కథలు తడిమిన, చిత్రించిన వస్తువు ఇంతకుముందు సాహిత్యంలో లేదు. విప్లవోద్యమాలతో పాటే సాహిత్యం అన్ని మలుపులు చిత్రించడం వైవిధ్యం. ఒక్కమాటలో చెప్పాలంటే నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమం కోసం వర్గపోరాటపు ప్రోగ్రాం, కార్యాచరణ అందులో లీనమైన వేలాది మంది శ్రామిక, రైతాంగ ప్రజల పోరాటమే వస్తురూప వైవిధ్యంలో ప్రతిఫలించింది. ఉన్నతీకరించింది.

**17. మీరు తెలంగాణాలో విప్లవోద్యమం ఉన్నంత కాలమే కథలు రాసి, తర్వాత ఆగిపోయారనే విమర్శపై మీ కామెంట్?**

నిజమే. నేను ముందే చెప్పినట్లుగా సమాజాన్ని విశ్లేషించడానికో, విమర్శించడానికో రాయలేదు. వృత్తి రీత్యా రచయితను కాదు. విప్లవోద్యమాల నేపథ్యంలో అనివార్యంగా రాయాల్సి వచ్చింది. విప్లవోద్యమం తీసుకొచ్చిన మార్పుల క్రమాన్ని నా శక్తి మేరకు రాయడానికి ప్రయత్నం చేశాను. 'ప్రేరకాలు' 2000 నాటికి ఆఖరు కథ. 2015 దాకా కథలు, నవలలు రాయలేదు.

విప్లవోద్యమాలల్లో జరిగిన ఒడిదుడుకులన్నీ నా వ్యక్తిగత జీవితంలో సంభవించాయి. అయితే ఈ కాలంలో ఎక్కువగా తిరిగాను. ఎక్కువగా చదివాను. ఊపిరి సలపనివ్వని విషాదాలు చూశాను. ఈ కాలంలో నా సహచరులు చాలామంది చనిపోయారు. మా అబ్బాయి కిరణ్ చనిపోయాడు. ఉద్యోగంలో, వ్యక్తిగత జీవితంలో నిలబడడానికి ఊపిరి తీసుకోవడానికి కష్టమైన రోజులు. అన్నింటికన్నా ముఖ్యంగా చాలా వరకు నేను రాసిన సాహిత్యమంతా ప్రజల నేపథ్యంలో రాసిందే. కానీ, ఈ కాలంలో జరిగిన నిర్మాణం, అందులో పాల్గొన్న విప్లవకారుల గురించి ఇదివరకు శకలాలు శకలాలుగా మాత్రమే రాశాను. సమగ్రంగా రాయాలనుకున్నాను. దీర్ఘ కాలిక అనుభవంలో జరిగే మహోద్ధృతంగా సాగిన విప్లవోద్యమ ఉద్విగ్న స్థితులను సమన్వయం చేసుకొని చిత్రించడానికి దాదాపు 15 సంవత్సరాల కాలం పట్టింది. ఒక నవల రాయడానికి ప్రయత్నంలో కథలు రాయలేదు. నవలకు సంబంధించిన సమాచారం కోసం తిరగడం, అధ్యయనం చేయడం జరిగింది. కానీ, ఇంకా మొదలు పెట్టలేదు. కథలు రాస్తే నవల ప్రయత్నం పలుచన కాగలదని రాయలేదు. పైగా విస్తరించిన విప్లవోద్యమంలో చాలా మంది రచయితలు రాస్తున్నారు.

ఇదే కాలంలో స్వయంగా కథలు రాయడం కన్నా విప్లవోద్యమం, సాహిత్యోద్యమం ముందుకు సాగడానికి కొంత వెసులుబాటు కూడా దొరికింది కనుక అనేక వర్క్ షాపులు పెట్టాం. విరసం బయట ఉన్న రచయితలందర్నీ ప్రత్యక్షంగా కలిశాం. అనేక పుస్తకాలు ప్రచురించాం. నేను స్వయంగా అనేక పుస్తకాలు ఏర్చి కూర్చాను. ఒకప్పుడు పది మంది లోపు రచయితలు మాత్రమే ఉంటే వందల సంఖ్యలో రచయితలు రాయడం ఆరంభించారు. అవన్నీ నా లాంటి రచయితలు రాసిన విప్లవోద్యమ కథలే.

అవసరమైన సందర్భంలో అనేక సమీక్షలు, ముందు మాటలు, ఇంటర్వ్యూలు, వ్యాసాలు, అనువాదాలు ఇట్లా ఎప్పట్లాగే సాహిత్యంతో, రచయితలతో ఉన్నాను. పైగా తెలంగాణాలో విప్లవోద్యమం తెచ్చిన గుణాత్మక మలుపులు, మార్పులు రాశాను. 2000నాటి స్థితిలో ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సాగింది. అలాంటి కథలు నా కన్నా ఎక్కువగా చాలామంది రాశారు. గ్రామరాజ్య కమిటీల ఏర్పాటు దగ్గర నుండి మొదలు కావాలి. నూతన ప్రజాస్వామిక ఉత్పత్తి సంబంధాల ప్రాథమిక ఆచరణకు సంబంధించిన నిర్మాణం మొదలు కావాలి. అది పూర్తిగా నిర్బంధం ఆవరించి ఉన్న నేపథ్యంలో. ఈ తయారీలో ఇంత కాలం గడిచింది. 2015 నుండి మళ్లీ రాయడం ఆరంభించాను. 'టైగర్ జోన్' నవల, 'వెలుతురు నది', 'రియల్ స్టేట్', 'చూపు' లాంటి కథలు రాశాను.

**18. విప్లవ కథ సౌందర్యాన్ని, సామాజికతను ఎట్లా అర్థం చేసుకోవాలి?**

విప్లవోద్యమం నడుస్తున్న, నడిచిన స్థల కాలాల నేపథ్యంలో గతి తార్కికంగా , చారిత్రికంగా అర్థం చేసుకోవాలి. విప్లవోద్యమాలు తలపడిన, పరిష్కరించిన వైరుధ్యాల నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. లుంగలు చుట్టుకపోయిన సమాజాన్ని, మృతప్రాయమైన సమాజాన్ని, అదనపు విలువను దోపిడీ చేసి పోగేసి బలిసి, కుళ్లిపోయిన సమాజాన్ని నిర్మూలించి దాని స్థానంలో మానవుని సకల ఇంద్రియాలు సహజంగా పనిచేసే మనిషి వేరొక మనిషి దోపిడీ చేయని మహోద్భుతమైన సమాజాన్ని నిర్మించడమే కదా విప్లవ లక్ష్యం. ఈ నిర్మాణ కళ వ్యవసాయంలో లాగే, పారిశ్రామిక ఉత్పత్తిలాగే కళాత్మకమైంది. సకల ఉత్పత్తి ప్రక్రియల సృజనాత్మక మేళవింపు. వ్యక్తీకరణ. సకల ఉత్పత్తి సారాంశం తెలిసి, నియంత్రించి.. మనిషి కోసం, మనుగడ కోసం ఉత్పత్తిగా పునర్నిర్మించే సృజనాత్మక కళ. అందుకే ఈ లక్ష్యాన్ని నిర్దేశించిన, రూపు కట్టిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' గొప్ప సౌందర్యాత్మకత సామాజిక కావ్యంగా అది మానవాళి కలలు సాకారం చేసే కళగా ఎంచుతారు. ప్రపంచ సృష్టికర్తల దగా పడిన కలలకు రెక్కలు తొడిగింది. ఊపిరిలూదింది.

**19. ప్రస్తుతం తెలుగు కథ ఎట్లా ఉన్నది?**

తెలుగులో ప్రజా వ్యతిరేకమైన కథలు రాయడానికి సాహసించని వాతావరణం ఉన్నది. అన్ని కులాలకు, రంగాలకు విస్తరించింది. ఒకప్పుడు ఊహాత్మక, కల్పిత, తీరిక వర్గాలకు,

కులాలకే పరిమితమైన తెలుగు కథ కీలకమైన ఉత్పత్తి శక్తులతో, ఉత్పత్తి కులాలతో మమేకమైంది. ఇది గొప్ప పరిణామం. ఇందులో అనేక అస్తిత్వ పాయలున్నాయి. అయితే సమాజాన్ని విమర్శించడానికో, విశ్లేషించడానికో తెలుగు కథలు ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. కానీ దీన్ని మార్చాలి. మార్పు క్రమానికి గతితార్కిక చరిత్ర ఉన్నది. మార్పు క్రమం సాహిత్యంలో రావాలి. అంతిమంగా చూస్తే రకరకాల కారణాలతో తెలుగు ప్రజలు అనేక సంఘర్షణల్లో, పోరాటాల్లో ఆరితేరి ఉన్నారు. తెలుగు కథ ప్రజలతో పాటు నడవడానికి ఇంకా వేగం లోతు పెంచాలి.

అస్తిత్వ ఉద్యమాల్లో ప్రజల కోపతాపాలు, ఉద్వేగాలు, ఆవేదనలు విస్ఫోటనంగా బయటకొస్తున్నవి. ఇది సాహిత్యంలో ముఖ్యంగా కథల్లో అంతగా రావడం లేదు. అయితే మూలవేమిటి? వైరుధ్యం ఏమిటి? పరిష్కారానికి ఎత్తుగడలేమిటి? అందుకు తగిన నిర్మాణం, ఎత్తుగడల్లో దళిత, ఆదివాసీ, మహిళా, మత మైనార్టీ నాయకత్వం ముందుకువచ్చి విప్లవోద్యమ శక్తులుగా ఎదిగి వ్యూహంలో భాగంగా ప్రజలకు రాజ్యాధికారం దిశగా పురోగమిస్తున్నారు. మనకాలపు మన చరిత్రను విస్మరించలేం. విస్ఫోటనాలకు ప్రతిగా స్పందన ఉన్నట్టు ఎక్కువభాగం అస్తిత్వ ఉద్యమాల సాహిత్యానికి నిర్మాణం ఏర్పడలేదు. కులాలు, మతాలు, జాతులు, ప్రాంతాలు, అస్తిత్వ ఉద్యమాలల్లో దోపిడీ, పీడక వర్గాలు దాక్కుంటాయి. ఇలాంటి ఉద్యమాలు శ్రామికవర్గ దృక్పథంతో అధ్యయనం చేయకపోతే ప్రజాస్వామిక ఉద్యమాలను ముందుకు తీసుకుపోజాలవు. తెలంగాణా రాష్ట్ర సాధన ఉద్యమంలో అధికారం ఒకప్పుడు గ్రామాల దళిత, బహుజనులు, పేదరైతాంగం, రైతుకూలీలు తరిమేసిన దొరలే దక్కించుకోవడం ఒక విషాద అనుభవం. ఇది తెలుగు కథ అధిగమించాల్సిన స్థితి.

మనకన్నా ముందుగా కులాన్ని పునాదిగా గుర్తించి పోరాటం చేసిన కన్నడ, తమిళ, మరాఠీ కథలు మనకన్నా కొంత ముందున్నాయి. అయితే ఒక ఉద్యమంగా వంద మంది యువ రచయితలు, రచయిత్రులు ఎక్కువ సంఖ్యలో కథలు రాయడం శ్రామిక కులాల నుండి ఎక్కువ మంది రచయితలు రావడం గొప్ప పరిణామం. వాళ్లు యుద్ధరంగంలో నిలబడ్డారు గనుక యుద్ధంతో పాటు అన్నీ నేర్చుకుంటారు. నాయకత్వం వహిస్తారు. అప్పుడు విప్లవోద్యమ విస్తృతి, వేగం పెరుగుతాయి. ఎత్తుగడల్లో గుణాత్మక మార్పులు చోటుచేసుకుంటాయి.

**20. 'రచయితలారా...! మీరెటు వైపు?' ఎన్నో ఏళ్లుగా పునరావృతమౌతున్న ఈ ప్రశ్నపై మీ స్పందన?**

సామాజిక, విప్లవోద్యమాల నేపథ్యంలో అనివార్యంగా సృష్టికర్తలైన ప్రజల పోరాటాలు, చరిత్ర రాయాల్సిన అవసరం రీత్యా అలాంటి పల్లె నుండి వచ్చిన నా లాంటి వాడికి ఎప్పుడూ అన్ని రకాలుగా ప్రజల వేపే. అన్ని రకాలుగా విధ్వంసమైన మానవులు మానవులుగా బతకనివ్వని, సొంతాస్తి కేంద్రం కాగల దోపిడీ, హింసాత్మక సమాజాన్ని మార్చే క్రమంలో ప్రజలు నిరంతరం పోరాడుతూనే ఉన్నారు. దోపిడీ ప్రభుత్వాలు, పత్రికలు విదిల్చే శాలువాల కన్నా, అవార్డుల కన్నా స్థల కాలాల్లో జరిగే పరిణామ క్రమాల్లో భాగం కావడం, తప్పనిసరిగా ప్రజల పక్షం వహించడం, కలిసి నడవడం, రచయితల బాధ్యత. కర్తవ్యం. రచయితలకు తిండి, బట్ట, అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చేది ప్రజలే. కనుక అలాంటి సామాజిక రుణం అవసరం రీత్యా కూడా ఇది అనివార్యమైన విషయం. ఒక్క రచయితలకే కాదు, ఇలాంటి అసమ, విషమ సమాజాన్ని మార్చడం, అందుకోసం పోరాడడం పీడిత ప్రజలందరి కర్తవ్యం. విప్లవోద్యమమే పీడిత ప్రజల విముక్తి మార్గం.

## అల్లం రాజయ్య రచనలు

1. పర్‌స్పెక్టివ్స్, హైదరాబాద్ ప్రచురణల సంస్థ అదివరకే వచ్చిన అల్లం రాజయ్య సాహిత్యాన్ని వరవరరావు సంపాదకత్వంలో ఆరు సంపుటాలు ప్రచురించింది.

అల్లం రాజయ్య సాహిత్యం-1 : కొలిమంటుకున్నది, ఊరు, అగ్నికణం (నవలలు)-జనవరి, 2008

అల్లం రాజయ్య సాహిత్యం-2 : సృష్టికర్తలు (కథలు); ఏప్రిల్, 2011

అల్లం రాజయ్య, సాహు -3 : కొమురం భీము (నవల); జనవరి, 2013; రెండవ 2016

(ఈ నవలను ఇంగ్లిష్, హిందీ, తమిళంలో వేర్వేరు ప్రచురణ సంస్థలు ప్రచురించాయి)

అల్లం రాజయ్య సాహిత్యం-4 : వసంత గీతం (నవల); డిసెంబర్, 2013

అల్లం రాజయ్య సాహిత్యం-5 : తల్లిచేప (కథలు); ఏప్రిల్, 2017

అల్లం రాజయ్య సాహిత్యం-6 : అతడు (కథలు); జూన్, 2019

2. విపుల మాసపత్రిక : అల్లం రాజయ్య : టైగర్ జోన్; డిసెంబర్, 2016

3. మలుపు బుక్స్, హైదరాబాద్ : సైరన్ (నవల); డిసెంబర్, 2021

4. విప్లవ రచయితల సంఘం ప్రచురణ : విప్లవమే కళాత్మక రచన (నవల, కథల ఇంటర్వ్యూలు); జనవరి 2024

5. విప్లవ రచయితల సంఘం ప్రచురణ : వెన్నెల కోనలు (సాహిత్య విమర్శ; ముందుమాటలు); జనవరి 2024

6. నాలుగు నాటకాలు, ఎన్నో వ్యాసాలు, పాటలు, కవిత్వం రాశాడు.

★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, నిజాం కళాశాల** T

# తడి ఆరని 'ఒంటరిగొంతు'

డా. సద్మిక లలిత

తెలుగు సాహిత్య ప్రక్రియలైన పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత్వంవంటి పలు ప్రక్రియల్లో సామాజిక సందేశాన్ని జోడించి, సృజనాత్మకంగా సాహత్యరంగాన్ని పరిపుష్టం చేసినవారిలో ప్రముఖులు డా॥ బోయి భీమన్న.

19 సెప్టెంబర్, 1911న తూర్పు గోదావరిజిల్లా మామిడికుదురులో నాగమ్మ, పుల్లయ్య దంపతులకు బోయి భీమన్న జన్మించారు. పాలేరు కుటుంబంలో పుట్టి, దళితునిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న వారి నేపథ్యం చూస్తే కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని దానికి కులం, అంటరానితనం అనేవి ఆటంకాలుకావని బోయి భీమన్న జీవితంలో ఎదిగిన తీరు చూస్తే అర్థమవుతుంది.

ఉపాధ్యాయుడిగా, పాత్రికేయుడిగా ఆంధ్రప్రదేశ్ అనువాద విభాగం డైరెక్టర్‌గా, రిజిస్ట్రార్‌గా ఉన్నతమైన, కీలకమైన పదవులెన్నింటినో ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన కార్యశీలి. బోయి భీమన్న రచనాపాటవానికి, వారి ప్రతిభాపాండిత్యాలకుగాను, ఆంధ్ర విశ్వకళాపరిషత్, కళాప్రపూర్ణ (1971), కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ (1975), నాగార్జున విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం (1991) వంటి పలు పురస్కారాలను ప్రధానం చేశాయి.

తన జీవితానుభవాల సారాన్ని, తను చూసిన సంఘటనల్ని ఆధారం చేసుకుని కొంత కాల్పనికతను జోడిస్తూ వీరి రచనాశైలి కొనసాగుతుంది. సామాజిక స్పృహను కలిగిస్తూ సమాజాన్ని ప్రగతిపథంలో నడిపించాలనే దృక్పథం వీరి రచనల్లో ప్రతిఫలిస్తుంది. భావుకతను జోడించి, విషయానికి ప్రాధాన్యతను కల్పించి ప్రతీకాత్మకంగా కవితా రచన చేస్తారు. అలాంటి కవితా సంపుటుల్లో 'ఒంటరి గొంతు' అనే కవితాసంపుటిని విపులంగా పరిశీలిస్తే, బోయి భీమన్న రచనా కౌశలం మనకు అవగతమవుతుంది.

"ఒంటరి గొంతు" కవితాసంపుటిలో సమాజంలోని అవినీతిని, అసమానతలను ఎత్తిచూపుతూ వ్యంగ్యాత్మక ధోరణిలో బోయి భీమన్న రాసాడు. ఈ కవితాసంపుటిలోని కవితలన్నీ సమకాలీన సామాజిక పరిస్థితులకు ప్రతిబింబాలుగా ఆవిష్కృతమయ్యాయి. ప్రధానంగా దళితుల జీవితాలు బాగుపడాలనే ఆరాటం, దళితులపట్ల సమాజం చూపే వివక్ష, దళితులు అభివృద్ధిపథంలో వెనుకబడిపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ "ఒంటరి గొంతు" కవితా సంపుటిని బోయి భీమన్న రాసారు.

**"కామందు-కాకులు"** కవితలో-

"నీ పిల్లలను, కోకిలా!  
పరభృతాలుగా ఎందుకు చేశావు?  
నీవు చేశావా? ప్రకృతి చేసిందా?  
నీకు గూడు లేదు,  
కట్టుకోవడం చేతకాదు,  
గుడ్లు పెడతావు కానీ  
పొదగడం అసలే చేతకాదు" (పుట 536)

"కోకిల'ను ప్రతీకాత్మకంగా తీసుకుని దళితుల జీవితాలతో పోల్చుతూ దళితులు సమాజంలో అణగారిన వర్గాలలో చేర్చబడటానికి, వారి వెనుకబాటుతనానికి గల కారణాలను విశ్లేషిస్తూ ప్రశ్నిస్తున్నాడు.

బానిసత్వాన్ని దళితులే స్వీకరించారని, సమాజంలో దళితులంటే అణిగిమణిగి ఉండాలనే భావనను, దళితులే తమకంటూ పరిధిని గీసుకుని ఉన్నారని, ఆ చట్రంలోంచి బయటికి రావాలని సూచించారు. సమాజంలో మార్పుకై, దళితుల జీవితాల బాగుకై ముందు దళితుల్లోనే ఆత్మవిశ్వాసం ఉండాలని, అప్పుడే వారి బతుకుల్లో పురోగమనం కన్పిస్తుందని రచయిత బోయి భీమన్న ఎంతో లోతుగా పదునైన పదప్రయోగాలతో సూటిగా ప్రశ్నిస్తూ సామాజిక చైతన్యాన్ని కలిగించేలా కవిత్వీకరించారు.

**"లోకులు-కాకులు"** కవితా పంక్తుల్లో-

"లోకులు కాకులు  
కాకులు నిన్ను సాధించినా  
నీ స్వరాన్ని నిషేధించలేవు కదా!" (పుట 548)

దళితుల్లో దాగి ఉన్న ప్రతిభను, పుట్టుకతో దళితులు అంటరానివారిగా పరిగణించబడి ఉండవచ్చు. చిన్నచూపునకు గురై ఉండవచ్చు. వారి అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడి ఉండవచ్చు. కానీ, వారిలో దాగి ఉన్న ప్రతిభ, జ్ఞానతృష్ణని ఆపటం మాత్రం సాధ్యం కాదు.

దళితుల అభివృద్ధికి సమాజం అన్ని అవకాశాలు కల్పించకపోవచ్చు. కాని ప్రయత్నిస్తే విజయతీరాలను చేరగలమని, కష్టించే తత్వం, పట్టుదల ఉంటే గెలుపు సొంతమవుతుందని తెలియచేశారు.

సృష్టిలో అందరూ సమానులేనని "జ్ఞానం అనేది ఒకరి సొత్తు" కాదనే వాస్తవాన్ని తెలియజేస్తూ బోయి భీమన్న దళితుల్లో స్ఫూర్తిని కలిగించేలా కవితలు రాశారు.

**"నీతి-సాంఘికం"** కవితా పంక్తుల్లో-

"కోకిలా!
చారిత్రకంగా బుద్ధుడు మొదటి ప్రవక్త
అతడ్ని అహింసా జ్యోతి అన్నారు
ఏదీ అహింస?
అతడ్ని ఆరాధిస్తున్న దేశాలన్నీ
ప్రధానంగా మాంసాహార దేశాలన్నీ
దండనీతి రాజరికాలే" (పుట 564)

ప్రజాస్వామిక పాలన వ్యవస్థలోని లోపాలను ఎండగడుతూ... పాలన వ్యవహారాల్ని నిరసించాడు. సమాజంలోని వైఖరిని తూర్పారబట్టాడు. ఎంతోమంది ఆదర్శవంతమైన జీవితాన్ని ఆచరిస్తున్నామని, ఎదుటివాళ్ళు కూడా అవలంబించి తీరాలని, ఆదర్శమార్గంలో జీవించాలని ప్రసంగాలు చేస్తుంటారు. నిజంగా నైతికంగా అలానే జీవన విధానాన్ని అనుసరిస్తున్నారా? తమ అంతరాత్మను ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉందని సమాజంపై ఘాటుగా అస్త్రాన్ని సంధించాడు.

బోయి భీమన్న సమాజాన్ని ఎంతో దగ్గరగా నిశితంగా పరిశీలించినవారు కావడంతో సామాజిక పోకడల్ని, ధోరణుల్ని, సమాజంపట్ల అసంతృప్తిని, ఆవేదనని ఎంతో వాడిగా, పదునుగా అక్షరీకరించారు.

**"అంతా తనకే"** కవితా పంక్తుల్లో-

"కుక్కలు చింపిన విస్తరి
నక్కల పాలైన నంది, నాయకులు తమ
ముక్కను తినగా, మిగిలిన
బొక్క సుమీ జాతి ఈ డెమోక్రసీలోనన్"

పాలనావ్యవస్థల్లోని లోపాలను, ప్రజల అభివృద్ధే ధ్యేయమని హామీలిచ్చి, ప్రజల ఓట్లతో గెలిచిన రాజకీయ నాయకుల స్వార్థబుద్ధిని వ్యంగ్యాత్మకంగా నిరూపించాడు.

ప్రజాపథకాలన్నీ రాజకీయ నాయకులే దుర్వినియోగం చేస్తున్నారని, పథకాలు లబ్ధిదారులకు అందట్లేదని ఆవేశం, ఆవేదన బోయి భీమన్న రచనలో ప్రతిఫలిస్తుంది. సమాజాన్ని హెచ్చరిస్తూ, ముందుచూపుతో వ్యవహరించాల్సిన సూచన వీరి కవితాపంక్తుల్లో ధ్వనిస్తుంది.

**"స్వేచ్ఛ"** కవితా పంక్తుల్లో-

"తన ఇచ్ఛ కొనసాగడమే
సుఖ జీవితం
భయభక్తులతో బ్రతకడం
బానిసత్వమే కదా!"

మానవుని మనుగడలో, అందులో దళిత మానవుని మనుగడలో బానిసత్వం ఎందుకు ప్రవేశిస్తుంది. పుట్టుకతో కొన్ని సహజసిద్ధమైన లక్షణాలు అలవడినట్టే బానిసత్వం కూడా పుట్టుకతోనే లభిస్తుందా? తక్కువ కులంలో పుట్టడం అనే ఒకే ఒక్క కారణం మనిషి జీవితాన్ని శాసిస్తుందా? మానవుని మనుగడను, జీవన విధానాన్ని నిర్ణయిస్తుందా? అంటూ పలు ప్రశ్నల్ని సంధిస్తూ బోయి భీమన్న పాఠకుల్లో ఆలోచనల్ని రేకెత్తించారు.

ఇతరులకు సేవ చేసేవారి జీవితం నిరుపేద జీవితంగా, శ్రమను దోపిడి చేసేవారి జీవితం ధనిక జీవితంగా సమాజంలో చెలామణి అవుతుంది. ఈ అవకతవకల్ని సరిచేసే ప్రయత్నాలు జరగటం లేదని ఆక్రోశం, ఆవేదన వీరి కవితల్లో అభివ్యక్తీకరించబడింది.

బోయి భీమన్న కవిత్వమంతా ఎంతో సరళంగా, సులభమైన పదజాలంతో కొనసాగుతూ పాఠకులందరికీ అర్థమయ్యేలా ఉంటుంది. కోకిలను ప్రతీకాత్మకంగా తీసుకుని అణగారిన వర్గాల ప్రతినిధిగా కవితల్లో సూచించారు. కోకిల, ప్రవక్త అనుపదాలను పునః ప్రయోగం చేస్తూ కవిత్వం నడిచింది. బోయి భీమన్న రచనలను గమనిస్తే, పశుపక్ష్యాదులను ప్రతీకలుగా తీసుకుని రాయటం వీరి రచనల్లో ప్రత్యేకం అని చెప్పవచ్చు. సమాజపు ధోరణుల్ని, మనుష్యుల పోకడల్ని, పశు పక్ష్యాదులపై ఆరోపించి, వ్యంగ్యంగా చెప్పటం భీమన్న రచనల్లో ప్రధానంగా కన్పిస్తుంది.

"ఒంటరి గొంతు" కవితా సంపుటిలో సామాజిక ప్రగతికి అవరోధాలుగా నిలుస్తున్న ఎన్నో అంశాల్ని, వాటి మూలాల్ని ప్రశ్నిస్తూ నడిచిన కవితలన్నీ పాఠకుల్లో సామాజిక స్పృహను కలిగించి సామూహికంగా పోరాడేతత్వాన్ని కలిగిస్తాయని, బోయి భీమన్న ఆశించిన సామాజిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పటంలో ఏమాత్రం సందేహం లేదు.

★ **రచయిత:అధ్యాపకులు,** తెలంగాణ సారస్వత పరిషత్, హైదరాబాద్

# నేను గొర్రెల్ని కాస్తుంటాను

ఇమ్మిడి మహేందర్

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో అన్ని సామాజిక వర్గాలకు సరైన ప్రాతినిధ్యం దక్కలేదు. భారతదేశ ప్రత్యేక సామాజిక పరిస్థితుల నేపథ్యం నుంచి గమనించినప్పుడు ఇలాంటి పరిశీలనలు కన్పిస్తుంటాయి. నిచ్చెనమెట్ల కుల సమాజంలో శూద్రులది కింది స్థానం. సృష్టికర్త అయిన బ్రహ్మకు పాదాల నుండి శూద్రులు పుట్టారని చెప్తున్నారు. ఏది ఏమైనా మెజారిటీ ప్రజల జీవితం ప్రాచీన సాహిత్యంలో వ్యక్తం కాలేదు. తరతరాలుగా వస్తున్న సాహిత్యంలో ఈ ప్రజల కేంద్రంగా సాహిత్య వస్తువు నిర్మాణం కాలేదు.

సాహిత్యం అధ్యయనం చేయడానికి సాహిత్య చరిత్రకారులు, క్రమ పద్ధతిలో సాహిత్య యుగ విభజనను ప్రతిపాదించారు. ఈ పద్ధతిలో ప్రాన్నయ యుగంలో వివిధ శాసనాలకు సంబంధించిన సమాచారం, గొబ్బి పదాలు, వెన్నెల పదాలు వంటి ప్రస్తావనే తప్పా, వాటి గురించిన విశ్లేషణ లేదు. లిఖిత సాహిత్యానికి ఆద్యుడిగా చెప్పబడుతున్న నన్నయ రాసిన ఆంధ్ర మహాభారతం ఆనాటి రాజ్య ఆకాంక్షలను నెరవేర్చ గలిగింది. వైదికమత పునరుద్ధరణ, కులీన వంశాల ఉద్ధరణ లక్ష్యాలుగా సాగిన సాహిత్యానికి ఆనాటి సాహిత్యకారులు ప్రతిస్పందించారు. ఆ తర్వాత పాల్కురికి సోమనాథుని ద్వారా తెలుగు సాహిత్యంలో మార్గ పద్ధతికి భిన్నంగా, దేశీ మార్గం ప్రారంభమైంది. దేశీ పద్ధతిలో సాహిత్యం వచ్చినా, సాహిత్య వస్తువులో మార్పు రాలేదు. కానీ, వర్ణ వ్యవస్థలో భాగమైన నిచ్చెనమెట్ల విధానానికి తాత్కాలిక స్వస్తి కలిగింది. ఏ కులమైనా, మగ లేదా స్త్రీ అయినా నేరుగా శివ పూజకు అర్హులుగా శైవమతం అవకాశం కల్పించింది. దీన్ని శైవ సాహిత్యం చిత్రించింది. రికార్డు చేసింది. మెజారిటీ ప్రజల జీవితంతో మతాన్ని అనుసంధానించిన సాహిత్య సృష్టి జరిగింది. ఆ తర్వాత తిక్కన మొదలు శ్రీనాథుడు, ప్రబంధ కాలం వరకు రాజాస్థానాలకు నేరుగా సాహిత్యం సహకరించడం మొదలైంది. సాహిత్యం విలాస వస్తువుగా మారింది. ఈ నేపథ్యం నుంచి ప్రబంధ సాహిత్యం విస్తృతం అయింది. ప్రాచీన సాహిత్యాన్ని ఏ కొలమానాల్లో కొలిచినా ఈ దేశ మెజారిటీ ప్రజల జీవితం పది శాతం కూడా ఉండదు.

ఆధునిక కాలంలో విస్తృతమైన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చైతన్యాలు సమాజాన్ని, సమాజంలోని వివక్షతలను ప్రశ్నించాయి. సంస్కరణోద్యమంలో భాగంగా స్త్రీ సమస్యను చేపట్టింది. సానుభూతి కోణం నుండి దళిత సమస్యను చేపట్టింది. నిజానికి సంఘ సంస్కరణోద్యమం బ్రాహ్మణీయ కుటుంబ వ్యవస్థ తాలూకూ మూఢ నమ్మకాలను, సంప్రదాయాలను ప్రశ్నించాయి. ఆ తర్వాత వచ్చిన వర్గ సంఘర్షణ సాహిత్యం ప్రజలను పేద, ధనిక భేదంతో ప్రస్తావించింది. దీని ద్వారా పేదరికానికి కారణమైన సమస్యలను విడమర్చి చెప్పడం సాధ్యమయింది. అభ్యుదయ, విప్లవోద్యమాలు ఆర్థిక కోణం నుండి సమాజాన్ని వ్యాఖ్యానించాయి. వెనుకబాటు తనానికి ఆర్థిక కారణాలు ఏ విధంగా కారణమయిందో, అది సామాజిక ఎదుగుదలకు, సామాజిక వివక్షతలకు ఎలా హేతువుగా మారిందో విశ్లేషించాయి. సకల సమస్యలకు పరిష్కార మార్గంగా విప్లవోద్యమం సమాజాన్ని వ్యాఖ్యానించింది. సమాజాన్ని కేంద్రంగా చేసుకొని భిన్న సామాజిక వర్గాల, ప్రజల జీవితాన్ని వస్తువుగా స్వీకరించింది. గ్రామీణ నేపథ్యం నుంచి సాహిత్య వస్తువును స్వీకరించింది. ప్రజల భాషలో విప్లవాన్ని ప్రజలకు చేరువ చేసింది. వర్గ సంఘర్షణ సాహిత్యం, దాని విస్తృతి తర్వాత దానిలోని పరిమితులను గుర్తిస్తూ అస్తిత్వోద్యమాలు తెరమీదకు వచ్చాయి. సాహిత్యంలో తమ ప్రాతినిధ్యాన్ని వెతుకున్నాయి. ప్రశ్నించాయి. ఈ మార్గంలో స్త్రీవాదం, దళిత వాదం, బీసీ వాదం, మైనారిటీ వాదాలు, తెలంగాణ అస్తిత్వోద్యమాలు వచ్చాయి. సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసాయి.

దళితులపై చేసిన దాడులకు వ్యతిరేకంగా తెలుగులో దళిత ఉద్యమం బలోపేతం అయింది. ఈ ఉద్యమమే సాహిత్యంలో ప్రతిఫలించింది. ఈ సందర్భంగా దళితులు అంటే ఎవరు అనే చర్చ బలంగా ముందుకు వచ్చింది. ఈ అంశంపై చాలా మంది దళిత రచయితలు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసారు. చిక్కనవుతున్న పాట కవితా సంకలనంలో లక్ష్మీనరసయ్య **"కుల వ్యవస్థ దానికి ఆలంబన అయిన హిందూయిజం, వీటి వల్ల రోజువారీ జీవితంలోని పీడనకు అనిశ్చిత తత్వాన్ని అభద్రతనూ, అవమానాల్ని ఎదుర్కొంటున్న పీడిత కులస్తుల నుంచి మైనార్టీల నుంచి వచ్చిన కవులు రాసిన కవిత్వమే దళిత కవిత్వం"** అన్నారు. ఈ నిర్వచనంపై దళితులు తీవ్ర చర్చకు తెరలేపారు. సతీష్ చందర్, కొలకలూరి ఇనాక్‌లు దళితులు అంటే ఎవరో నిర్వచించే ప్రయత్నం చేసారు. ఈ చర్చల్లో బిసీలు దళితులు అవుతారా? అనే ప్రశ్న చర్చనీయాంశంగా మారింది. దళితులు, బీసిలు వేరువేరు. వారి

అనుభవాలు వేరు అనే చర్చ ప్రధానంగా జరిగింది. ఈ విషయమై సతీష్ చందర్ లోతైన చర్చ చేసారు. **"చిక్కనవుతున్న పాటలోని కొందరి బీసి కవులకు చింత చచ్చినా పులుపు చచ్చినట్టు లేదు. నిజానికి ఊరవతలి వాడలోని అంటరాని వాళ్లనే కాదు - ఊరి కడుపులో దాచుకున్న సమస్త వృత్తుల వాళ్ల (బీసి)నీ కులవ్యవస్థ కించపరిచింది. కులాల కొసన బ్రాహ్మణ (నాయి బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ) శబ్దాలను తగిలించుకున్నా, యజ్ఞోపవీతాల్ని ధరించినా కులవ్యవస్థ గౌరవించలేదు. సరికదా దేహాల మీద కేశాలనీ, కల్మషాన్ని శుభ్రపరచమని కొందరినీ తరతరాల పాటు ఆదేశించింది. ఈ అవమానాల దొంతర నుంచి ఆవిర్భవించిన బీసి కవులూ, విమర్శకులూ తమలోని పులుపును చంపుకోవాలి. గాయాలను ధైర్యంగా బయట పెట్టగలగాలి. ఎస్సీల కన్నా తాము ఒక మెట్టుపైన అనే నడమంతరపు అగ్రవర్ణత్వపు ముసుగును చించి అవతల పారెయ్యాలి. ఇంకా చెప్పాలంటే (DECASTIFY) కావాలి..... ఇక వాడలోని అంటరానివాళ్ల (ఎస్సీలు) అనుభవాల విషయానికొస్తే - అవి అగ్రహారానికి ఎంత దూరమో బీసిల పేటలకీ అంతే దూరం. వెన్నుతట్టే వెనుకటి కాలపు హరిజనోద్ధరణ కవిత్వం, మళ్లీ పులుపు చావని బీసి కవులు రాయనవసరం లేదు."** (సతీష్ చందర్. ఎస్వీ సత్యనారాయణ (సంపా). దళిత వాద వివాదాలు. 2004: 75) ఈ చర్చ సారాంశంలో బీసిల అనుభవాలకు, దళితుల అనుభవాలకు చాలా తేడా ఉందని ప్రతిపాదించాడు. ఈ ప్రతిపాదనతో పాటు బీసిలు తమ గురించి తాము రాసుకుంటే బాగుంటుందనే సలహా కూడా కన్పిస్తుంది. ఈ సందర్భంగా అనేక చర్చలు జరిగిన తర్వాత బీసి సోయితో ఎరుకను ఏర్పరుచుకున్నారు. ఈ నేపథ్యంలోనే 2001లో జూలూరు గౌరీశంకర్ సంపాదకత్వంలో, నల్లగొండ జిల్లా నుంచి "వెంటాడే కలాలు %-% వెనుకబడిన కులాలు" అనే కవితా సంకలనం వచ్చింది. ఈ సంకలనానికి ముందుమాటను ప్రసేన్, జూలూరు గౌరీశంకర్ రాశారు. ఈ ముందుమాటలో దళిత కవిత్వోద్యమంపై చర్చనీయాత్మక విమర్శలను చేసారు. ఆనాడు దళిత పద నిర్ధారణకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ, బీసిలకు అందించాల్సిన స్నేహహస్తం విషయంలో వెనుకబాటుతనాన్ని ఈ సంపాదకులు ప్రశ్నించారు. ఈ సంకలన ప్రాధాన్యతను వివరిస్తూ **"దళిత కవిత్వంలో మొదటిసారిగా గొంతు కలిపిన బిసి కవులు మరో చారిత్రక సందర్భంలో బీసి సూర్యోదయాన్ని ఊహిస్తున్నారు. ఆ దిశగా బిసి కవిత తొలి అడుగు మాత్రమే ఇది"** అని వెంటాడే కలాలు కవితా సంకలనం బీసివాద సాహిత్యానికి ప్రాతిపదికగా నిలుస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

ఈ సందర్భం తర్వాత కొంత బీసివాద దృక్పథంతో సాహిత్య సృష్టి జరిగినప్పటికి ముందుకు పోలేకపోయింది. తెలంగాణ ప్రాంతంలో బీసివాద సాహిత్యం ప్రారంభమవుతున్న దశలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమం ప్రారంభమైంది. ప్రాంతీయతా దృక్పథంలో బీసి సాహిత్యకారులు పెద్దమొత్తంలో ప్రాంతీయ అస్తిత్వవాద సోయితో రచనలు చేసారు. దాంతో బీసివాద సోయి వెనుకపట్టు పట్టింది. తర్వాత బీసి సాహిత్యోద్యమకారుల పట్టింపులేని తనం కూడా ఇందుకు కారణం. తెలంగాణ బీసి సాహిత్యకారులు ఏనాడు బీసి జీవితాలను చిత్రించకుండా లేరు. ఈ చిత్రణకు ఒక భావజాలపరమైన నిర్మాణాన్ని ఉపయోగించుకోకున్నా, ప్రాంతీయ దృక్పథంతో సాహిత్య సృజన చేసారు. ఎండిపోయిన బోరు బావులను, శిథిలమైన వృత్తులను, ప్రపంచీకరణ ప్రభావంతో ఆగమైన బీసిల జీవితాన్ని చిత్రించారు. ఇంతటి విస్తృతమైన నేపథ్యం నుంచి బెల్లి యాదయ్య రాసిన **"నేను గొర్రెల్ని కాస్తుంటాను"** (2011) కవిత్వాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

"నేను గొర్రెల్ని కాస్తుంటాను" అనే కవితా సంపుటిలో మొత్తం 25 కవితలు ఉన్నాయి. ఈ కవితలకు విస్తృతమైన సామాజిక నేపథ్యం ఉంది. కవి సామాజికుడు అయితే కవితా వస్తువులో భిన్నత్వం ఉంటుందనే దానికి ఈ కవితా సంపుటి నిదర్శనం. ఈ కవితలను ప్రధానంగా 1995 నుండి 2007 మధ్య కాలంలో రాశారు. ఈ కాలం చాలా ప్రత్యేకమైనది. దళితోద్యమం నిర్దిష్టతల వైపు ప్రయాణిస్తున్న సందర్భంలో ఈ కవితలు వెలువడ్డాయి. ఈ కవితా సంపుటి శీర్షికగా ఉన్న నేను గొర్రెల్ని కాస్తుంటాను కవిత 2001లో జూలూరు గౌరీ శంకర్ సంపాదకత్వంలో వచ్చిన **"వెంటాడే కలాలు - వెనుకబడిన కులాలు"** అనే కవితా సంకలనంలో వచ్చింది. ఈ సంకలనం రావడానికి కారణమైన సామాజికార్థిక, రాజకీయ పరిస్థితులను ముందే చర్చించుకున్నాము.

బెల్లి యాదయ్య ఈ దేశంలో చదువు నిరాకరించబడ్డ శూద్ర కులంలో పుట్టాడు. గొర్రెల్ని కాసుకుంటూ జీవితం సాగించే గొల్ల జీవితం తనది. **"మనిషి చైతన్యం అతని సామాజిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని"** ఒక సూత్రీకరణ. సరిగ్గా బెల్లి యాదయ్యపై తన సామాజిక పరిస్థితుల ప్రభావం ఉంది. ప్రకృతినే పాఠశాలగా మార్చుకొని, నాగరిక సమాజపు అవలక్షణాలకు దూరంగా చెట్టు, చేమలతో మమేకమయ్యే బోలాతనం తన కవిత్వంలో కన్పిస్తుంది.. తన జీవితాన్నే తన కవితా నేపథ్యంగా మలుచుకున్న కవి బెల్లి యాదయ్య. సాహిత్యంలో ఎక్కువగా పట్టింపు లేని కవితా వస్తువులను స్వీకరించాడు. వృత్తి జీవితం, ప్రపంచీకరణ, ఐక్యమత్యం, రాజ్యాధికారం, తెలంగాణ, ప్రేమ వంటి అనేక వస్తువులను స్వీకరించి కవిత్వం అల్లాడు. యాదయ్య కవిత్వం ప్రజల నుంచి, ప్రజల కోసం రాసిన సాహిత్యంగా నిలుస్తుంది.

ఏ కవికైనా వస్తువును ఎంపిక చేసుకోవడంలోనే అతని చైతన్యం దాగి ఉంటుంది. కవి కొన్ని వాదాలకు కట్టుబడి ఉండటం కన్నా ముందే, తనలో గుప్తంగానైనా మార్పు అనే చైతన్యాన్ని ప్రోది చేసుకుంటాడు. కనీసం మార్పుని ఆహ్వానించలేని మానసిక స్థితి ఉండే అవకాశం లేదు. మానసిక స్థితి చైతన్యవంతంగా ఉన్నప్పుడే కవిలో చైతన్యం ఉద్భవిస్తుంది. ఆ చైతన్యం వెలుగులోనే తను వస్తువును ఎంచుకుంటాడు. ఆ వస్తువు వ్యక్తం చేసుకోవడానికి సరైన శిల్పాన్ని నిర్మాణం చేసుకుంటాడు.

దేశంలో బహుజన కులాలకు ప్రత్యేకమైన చరిత్ర ఉంటుంది. సాంస్కృతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, చైతన్యం పరంగా ప్రతి కులానిది ఒక ప్రత్యేక చరిత్రే. బీసీలుగా ఉండి చదువుకు దూరంగా, చేసుకునే వృత్తికి అంకితమై బతికిన సమూహాలు ఎన్నో ఉన్నాయి. ఈ దేశ ప్రగతి నావకు వీళ్లు చమురుగా నిలిచారు. యాదయ్య వృత్తి రీత్యా గొర్ల కాపరి జీవితానికి చెందినవాడు. తన గొర్ల కాపరి జీవితాన్నే కవితా శీర్షికగా పెట్టుకొని, వెయ్యేళ్ల సాహిత్యాన్ని ప్రక్షాళన చేసాడు. తెలుగు కవిత్వ చరిత్రలో ఈ కవిత ఒక ఐకాన్.

సాహిత్యంలో బహుజన వర్గాల సాహిత్యానికి, సాహిత్య రూపానికి విలువ ఉండదు. పాట కవిత్వాన్ని రాసిన వారిని **"ముదు విటులు విధవ లంజలు పద కవితలు మారు బాస బాపన వారల్"** అంటూ పాట కవులను ఈసడించుకున్నారు. శూద్రుడు రాసిన కావ్యాన్ని కాకి ముట్టిన ఎంగిలిగా చిత్రిస్తూ, **"ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న సంగ్రీభవుని కావ్యంబు గ్రాహ్యంబు కాదు, పాయసంబైన సంస్కార పక్వమైన గాకజుష్టంబు హవ్యంబుగాని యట్లు"** అని ప్రకటించారు. తెలుగు సాహిత్యంలో ఇటువంటి అవమానాలకు కొదువలేదు. కానీ, తన వృత్తి జీవితాన్నే తన కవితా శీర్షికగా ప్రకటించి, సాహిత్య ధిక్కార పతాకాన్ని ఎగురవేసినవాడు బెల్లి యాదయ్య.

**నేను గొర్రెల్ని కాస్తుంటాను**
**మంద నా గురుకులం**
**తాత తండ్రులు నా ఉపాధ్యాయులు**
**కొండ కోన నా తరగతి గది**
**తడి దుక్కి నా ముద్దు పలక**
**దుడ్డుకొన నా సుద్దముక్క**
**అనుదినం ఒక అధ్యాయం**
**బోడూ బీడూ నా ఆటస్థలం**

(గొర్రెల్ని కాస్తుంటాను. పుట: 2)

అంటూ శ్రమైక జీవితాన్ని వాచ్యం చేస్తాడు. ఉత్పత్తి శక్తులు – ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి సంబంధాల నేపథ్యం నుంచి యాదయ్య కవిత్వాన్ని సృష్టించాడు. ఈ నేలపై సమస్త వృత్తుల సమస్త చిహ్నాల్ చెమటలు చిందించి, ఈ నాగరికతను వృద్ధి చేశారు. అందుకే శ్రమైక జీవితంలోనే ఆనందం దాగి ఉందని, పరుల కోసం పాటుపడని జీవితాన్ని వ్యర్థం అంటుంది.

**"నా పాద స్పర్శ ప్రసరించిన నేలలో**
**అడవి పొలం జమిలిగా పులకిస్తాయి**
**నా పాటల రసం ప్రవహించిన చోట**
**పాలు రక్తమాంసాలై మిటమిన్నుగా పలకరిస్తాయి"**

(గొర్రెల్ని కాస్తుంటాను పుట: 01)

శ్రమ శక్తిని వివరిస్తాడు. అలాగే తన తాత తండ్రుల నాటి జ్ఞానమే ధన్వంతరి వైద్య శాస్త్రం, వాత్సాయనుని గ్రంథాలని ప్రకటిస్తాడు. ఈ ప్రకటన వెనుకాల లోతైన భావజాల చర్చ ఉన్నది. జి. కల్యాణ రావు చెప్పినట్లు **"నా అయ్య అల్లిందే వానయ్య రాసిందు, అల్లిక అంటరానిది అయ్యింది, రాత రాజై కూసుంది"** అన్న వాదనకు బలం చేకూర్చుతుంది. ఈ సాహిత్యం ప్రధానంగా అల్లిక వారసత్వానిదే. నేటి మేటి కవులందరు కొద్దోగొప్పో జానపదుల జీవితాల నుంచి ఏరుకొని, కూర్చుకున్నదే.

యాదయ్యది మంద సంస్కృతి. నిత్యం కలిసిపోవాలన్నదే దాని తత్వం. ప్రకృతినే పాఠశాలగా మార్చుకొని, తోటి జీవ జాలాలనే అధ్యయనం చేసిన ఘనత వీరికి దక్కుతుంది. **"గొర్రెల వ్యాకరణంలో సంధి పరిచ్ఛేదాన్ని"** అంటూ, కలుపుకు పోయే గుణాన్ని గొప్ప అనుభవాత్మక జ్ఞానంతో రాసిన కవిత ఇది. ప్రకృతిని వశపర్చుకొని జీవించారు. ప్రపంచీకరణ వల్ల దేశాలన్నీ కుగ్రామలయినట్లు, మానవ సహజ గుణాలను తేటతెల్లం చేసింది మొదట గొల్ల సుద్దులే. ఈ సుద్దులే ప్రజలను చైతన్యం చేసింది. ఇప్పటి వరకు చెప్పి కవిత ముగించేస్తే వృత్తి జీవితాన్ని చిత్రించిన కవితగా మిగిలిపోతుంది. కానీ, ఇది రాజకీయ చైతన్య కవిత. శత్రువును పసిగట్టడం అనేది బీసీవాద కవితగా రూపొందింది. అంతేకాదు దళారుల దోపిడిని చెప్పడమే కాదు.

**రంగు రంగుల**
**సీతాకోక చిలుకలూ మీ రెక్కల సౌందర్యం**
**ఈ గొంగళి పురుగు ప్రసాదితమని మరచిపోకండి**

(గొర్రెల్ని కాస్తుంటాను. పుట: 9)

ఈ సమాజానికి అందమైన రూపాన్ని, ఆర్థిక స్వరూపాన్ని, అందించింది ఈ గొంగళి పురుగులే అంటూ సబ్బండ వర్గాల శ్రమ ప్రాధాన్యతను నొక్కి చెప్పాడు. ఇక్కడ ఈ కవిత రాజకీయ చైతన్య కవితగా రూపొందింది.

**"నేను గౌర్రెల్ని కాస్తుంటాను"** కవితలో బెల్లి యాదయ్య వృత్తి విషయం కేవలం ఎమోషనల్‌గా మాత్రమే చిత్రించలేదు. ఈ చిత్రణలోనే ఎన్నో ఏళ్లుగా దాగిన వివక్షతను, వారి మనస్తత్వాన్ని వెనుకబాటుతనంగా చిత్రించిన వైనాన్ని తిరస్కరించాడు. ఈనాడు అనుభవిస్తున్న జ్ఞానానికి ఓనమాలు దిద్దింది వీరి దగ్గరనే అని ప్రతిపాదించాడు. ఆర్థిక విధ్వంసాన్ని సూచించాడు. ఏళ్లుగా రాజకీయ, ఆర్థిక దళారులు చేస్తున్న విధ్వంసాన్ని గుర్తించాడు. నిజానికి వృత్తి కేంద్రంగా కవిత్వానికి రాయడం అనేది 1998ల కాలం నాటి సాహిత్య పరిస్థితులే. సబ్బండ వర్గాల జీవితం సాహిత్యంలోకి వస్తున్న క్రమంలో గౌర్రెల కాపరుల జీవితంపై సాహిత్యాన్ని ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం యాదయ్య చేసాడు. సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబాటుకు గురిచేయబడ్డ సమూహాల ఆర్తిని, ఆలోచనలను అందించే ప్రయత్నం ఈ కవితలో జరిగింది.

రోడ్ల మీద అసలు పట్టించుకోని జీవితాలు బీటు కమ్మరులది. బహుశా బీటు కమ్మరుల జీవితాన్ని కవితామయం చేసిన మొదటి కవి ఈయనే కావచ్చు. వీళ్లకి గుర్తింపు ఉండదు. కనీసం ప్రభుత్వాలు గుర్తించదు. రోడ్ల పక్కన డేరాలు వేసుకొని జీవించే సన్న జీవితాలు. ఆలుమగలు తిత్తి పెట్టుకొని, పొట్ట పోసుకునే జీవితాలు వారివి.

**ఆ గువ్వల జంట పొగ చూరిన కలల తోటల్లోకి**
**గబ్బిలాలే తప్ప సీతాకోక చిలుకలు ఎన్నటికీ రావు**

(లోహ యజ్ఞం 11)

ఈ కవితలో గబ్బిలాన్ని చీకటికి, సీతాకోక చిలుకను వెలుతురుకు ప్రతీకగా చేసుకొని వారి జీవిత తాత్త్వికతను చెప్పాడు.

**శిలాయుగపు సముద్రపు ఉప్పెన**
**ముంచేస్తున్న మానవాళిని**
**ఉక్కు యుగం దరిని చేర్చిన గజ ఈతగాళ్లు వీళ్లు**

(లోహ యజ్ఞం 12)

అంటూ శ్రామిక శక్తి నిర్వహించిన పాత్రను వివరిస్తాడు. కమ్మరి కొలిమి మండితేనే ఈ నాగరికత రాతియుగం నుండి లోహ యుగంలోకి మారింది. కానీ, వారి జీవితాలకు నేడు అర్థం లేకుండా పోయింది. సరైన వసతులు లేవు. చదువులు ఉద్యోగాలు లేవు. వలస పక్షులై తిరుగాడుతున్నారు. వీరి జీవితాన్ని కవిత్వంలోకి తీసుకురావడం యాదయ్య చేసిన అసలైన సామాజిక సాహిత్య సేవ. సాహిత్యంలో కనీసం ప్రాతినిధ్యం లేని జీవితాలపై కవిత్వాన్ని రాయడం ఒక సాహసమే. ఈ కవికి వస్తువు ఉంది. దానితోనే దాని శిల్పం ఉంది. ఈ కవితలో అద్భుతమైన కవితా శిల్పాన్ని సాధించాడు.

రైతు జీవితంపై హరిత స్వప్నం కవిత రాశాడు. ఈ కవితలో రైతుకి సమాజంలో, మార్కెట్‌లో జరిగే అన్యాయాలపై ప్రతిస్పందిస్తూ...

**విచిత్రమల్లా**
**నా చేతుల్లో ముస్తాబైన బస్తా**
**బస్తీకెళ్లి నా గొంతునే కత్తిరించడం**
**విషాదమల్లాజి**
**మా కోడి కూత అందరి బతుకుల్లో ప్రభాతాల్ని తెచ్చి**
**నన్ను మాత్రం చిమ్మ చీకట్లో కట్టిపడెయ్యడం**

(హరిత స్వప్నం 19)

దళారుల చేతిలో పడి పంటకు కనీస మద్దతు ధరలేక, కనీసం పెట్టుబడులు కూడా రాక, పురుగుల మందునే పెరుగన్నం చేసుకున్న రైతు జీవితాలు ఎన్నో. రైతే రాజు అంటూ రాజకీయ నినాదాలు వస్తున్నా, కనీసం వారికి జీవించే హక్కును కూడా లాగేసుకునే రాజ్య యంత్రం నిరంతరం నడుస్తుంటుంది. ఈ స్థితిని రైతు బిడ్డగా యాదయ్య పట్టుకోగలిగాడు. రైతుగా నాగలితో రోజు ఉదయాన్నే సంతకం చేసి, ధాన్యపు కరచాలనమై ఈ దేశంతో సంభాషిస్తాడు. అటువంటి రైతు జీవితంలోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తూ ఈ కవితను రాశాడు. అలాగే రోడ్లు వేయడంలో నిరంతరం తలామునకలై జీవించే బంజారా కార్మికులపై గ్రీష్మ యాగం అనే కవితను రాశాడు.

కవి దృక్పథం తన కవిత్వంలోనే వ్యక్తం అవుతుంది. ఈ కవి మట్టి కవి. **"సాహిత్యం కళాత్మకమైన సామాజిక చరిత్ర"** అని కె. శివారెడ్డి అంటారు. సాహిత్యం సమాజాన్ని కళాత్మకంగా వ్యాఖ్యానిస్తుంది. ఈ చరిత్ర అంతా మట్టిమనుషులది. వాళ్లు నిర్మించినదే ఆ నాగరికత. ఆ నాగరికత గురించి చెప్తాడు. కళాత్మకంగా చెప్తాడు కవి.

**పదే పదే మట్టి గురించే మాట్లాడుతాను**
**భావి తరానికి మట్టిమీద గౌరవం**
**కలిగేలా గట్టిగా నూరి పోస్తాను**
**మట్టి పదాలను ఏరి ఆటవెలదులు తేటగీతులు కూర్చి**
**శ్రమ సౌందర్యాన్ని కీర్తిస్తాను**
**మట్టి వారసత్వాన్ని నేను**
**మట్టిని ధ్యానిస్తూనే మరణిస్తాను**

(పదే పదే 33-36)

అంటాడు. ఈ దేశ బహుజన వర్గాలది మట్టితో పెనవేసుకొన్న బంధం. ఈ నేలలో భూమి మనది కాలేదు. పంట మనది కాలేదు. బువ్వ మనది కాదు. గంజి మెతుకులే

దిక్కు. ఈ మట్టికోసం యుద్ధాలు జరిగాయి. ప్రాణ త్యాగాలు. ఈ నేలపై అధికారం కోసం చిందిన నెత్తుటి ఏరులు అన్నీ యిన్నీ కావు. కానీ, మట్టి పుట్టుకనిస్తుంది. జీవితాన్ని ఇస్తుంది. ఆహారానిస్తుంది. పుట్టుక మొదలు మరణం వరకు ఈ నేలతల్లే కన్నతల్లై నిలుస్తుంది. సమస్త జీవరాశికి తల్లిగా ఉంటుంది. కనుక మట్టితో తాదాత్మ్యం కోల్పోయిన తరానికి మట్టి విలువ తెలిసే సాహిత్యం ఇప్పుడు అనివార్యం. ఈనాడు భూమి అంటే రియల్ ఎస్టేట్ భూములే. కోట్ల నోట్ల కట్టలు పండేదే. కానీ, దానితో ఉండే సంబంధం గురించి మాట్లాడటం యాదయ్య సాధించిన విజయం. శ్రమ సౌందర్యాన్ని కీర్తిస్తూ, మట్టిని ధ్యానిస్తూ మరణించడం అందరికి సాధ్యమయ్యే పనికాదు.

కవికి దృక్పథ స్పష్టత ఉండాలి అంటారు. దృక్పథం కలిగి ఉండటమంటేనే సామాజిక బాధ్యత కలిగి ఉండటం అని సూక్ష్మార్థం. నిజానికి ఈ సమస్త సంపద అంతా దైవ సృష్టి అని తీర్మానించేస్తుంటారు. ఈ తీర్మానాలలో మనిషికి అసలు పాత్రే ఉండదు. అస్తిత్వం లేని పదార్థమై మనిషి భావజాల చట్రంలో దోషిగా నిలబడాల్సి ఉంటుంది. కానీ, సమాజాన్ని సశాస్త్రీయంగా అధ్యయనం చేసినవారికి ఒక ప్రాపంచిక దృక్పథం ఉంటుంది. దాన్ని కలిగి ఉండి కవిత్వాన్ని బెల్లి యాదయ్య రాశారు.

**మానవ కందర గోళం భూమి**
**మన పూర్వీకులు విశ్రమించిన వనాలు గనులు**
**మన తాత ముత్తాతల అస్థికలు ఖనిజాలు**
**అమరుల నెత్తుటి ఏరు భూగర్భంలో ప్రవహించే నీరు**

(పదే పదే 34)

ఈ సకల సంపదలకు మన తాత ముత్తాతలే కారణం. రాళ్లు రెప్పలతో అతలాకుతలంగా ఉన్న భూములను చదును చేసి, దిక్కు లేకుండా ప్రవహిస్తున్న నదులకు దారి చూపించి, వ్యవసాయాన్ని సృష్టించిన జీవులదే ఈ సకల సంపదలు. కానీ, నేడు కార్పొరేటు శక్తుల కబంధ హస్తాలలోకి సంపదలు వెళ్లి, నిజమైన వారసులకు మొండి చేయి చూపుతున్నారు. ఇటువంటి అనేక పరిస్థితుల నుంచి రాజ్యాధికార కాంక్ష పుట్టుకొస్తుంది. నీళ్లు, నిధులు మనకు పరాయీకరించబడ్డప్పుడూ రాజ్యాధికారమే మాస్టర్ కీ గా భావించి రాజ్యాధికార సాధనకు కృషి చేయాలి. దానికి సమాజంలోని ప్రతి వర్గం దానికి నడుంకట్టాలి. నడమంత్రపు తల కిరీటాలను తొలగించుకొని బలోపేతం కావాలి. ఈ విషయాన్ని యాదయ్య ఐక్యమత్యానికి ప్రతీకగా "గొలుసు ఒక తాత్పర్యం" అనే కవితను రాశాడు. మట్టి మనుషుల చైతన్యంపై మట్టి సెగలు కవిత్వాన్ని రాశారు. దొరల దోపిడి, నైతిక దాడులు అర్థం చేసుకోలేని జీవితాలు వెనుకబాటుకు గురయ్యాయి.

**ఉన్న ఊరు కన్నతల్లి**
**జంగమోడి తీరు ఉద్యోగమెందుకురా అన్నప్పుడు**
**మమకార కిరీటం సొంతమైందనుకున్నాం కాని**
**మా పోరల్ని దద్దమ్మల్ని చేసి మీ పనిముట్లుగా**
**మారుస్తారనుకోలేకపోయాం**

(మట్టి సెగలు 61)

అంటూ దొరలు మాపై కొరడాలు ఝుళిపించడానకి వస్తే కత్తులు నూరుకునేలా, ఈ దాస్యం చేసే వారిని ఉద్యమించేలా వారిని తయారు కావాలనే ఆకాంక్షించాడు. అధికారం మాకు చేతగాదని, దాన్ని దూరం చేసే కుట్రను పసిగట్టలేని అమాయక జీవులుగా బీసీలు, దళితులు ఉండటాన్ని గమనించి, వారి చైతన్యం కోసం కవిత్వం అల్లాడు.

తెలంగాణలో విప్లవోద్యమాలు దొరల గడీలను కూల్చి, వారిని పారిపోయేలా చేసారు. కానీ, పట్టణంలో తిష్టవేసారు. వ్యాపారాలు చేస్తూ, కోట్లు గడించుకొని అక్కడి నుండి గ్రామాలను శాసిస్తున్నారు. ఈ సామాజిక స్థితిని గమనించి ఈ కింది కవిత రాశారు.

**గడి అంతరించలేదు**
**పట్నం వెళ్లింది**
**అది అక్కణ్నుంచి**
**మా వాళ్లను మా వాడలను**
**సైబర్ హంటింగ్ చేస్తుంది.**

(మా వూరి గడి 91)

కుల వ్యవస్థ పుట్టుకతోనే కొందరి అవకాశాలు ఎక్కువగా, మరికొందరికి తక్కువగా అవకాశాలు కల్పించింది. దానికి ఆలంబనగా అనేక వసతులు కల్పించింది. కొన్ని కులాలకు ఏకంగా దైవత్వాన్ని ఆపాదించింది. మరికొన్ని కులాలకు రాజరికాన్ని, మరికొన్ని కులాలకు బానిసత్వాన్ని, ఇంకా కొన్ని కులాలకు అంటరాని తనాన్ని బహుమానంగా ప్రకటించి, చైతన్యాన్ని ప్రదర్శిస్తే తుదముట్టించింది. కనుక ఇక్కడ వారసత్వం గొప్ప సంపద. దీన్ని ఈ కింది విధంగా అక్షరీకరించారు.

**వారసత్వమే ఇక్కడ గొప్ప సంపద**
**ఎప్పుడు ఎక్కడ ఎలా వింత**
**పవిత్రంగా జన్మించారన్నది కాకుండా**
**కదు నీచంగానైనా ఎవళ్లకి పుట్టారన్నదే**
**అత్యంత ప్రధానం** (ఇక్కడ 67)

ఇంతటి అసమానతలతో కూడిన సమాజానికి రాజ్యాధికారమే అంతిమ పరిష్కారం. బెల్లి యాదయ్య కవిత్వంలో ఈ లక్షణం కన్పిస్తుంది. రాజ్యాంగ నైతికత నేపథ్యం నుంచి సూచనలు చేయడం ఇందులోని ప్రధాన లక్షణం. నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ పట్ల ధిక్కారం కన్పిస్తుంది. పాదాల నుండి పుట్టిన శూద్రుల స్థితిని ప్రశ్నిస్తుంది. నీచంగా చూపబడ్డ పాదాలను పొగుడుతూ, దాని చుట్టూ ఉన్న మంచిని వివరిస్తాడు. గూఢంగా కుల వ్యవస్థ కుళ్లిపోయిందని, అది దారి పాతది అయినప్పుడు మరో ప్రపంచానికి దారి చూపేవి కూడా ఈ శూద్ర కులాలే అనే భావనను కల్పించేలా కవితా పాదాన్ని నిర్మిస్తాడు.

**పాదాలు చాలా గొప్పవి**

**పాదాలు మార్గదర్శకాలు**

**ఏకాకి తనాన్ని నిరసిస్తూ పదిమందితో కలుపుతాయి**

**నువ్వూ, నేను పలకరించుకోవడానికి**

**అడుగులతో శ్రవ్యవారధి నిర్మిస్తాయి**

**తోవ పాతదయినపుడు**

**మరో ప్రపంచానికి ద్వారాలు తెరుస్తాయి.**

(పాదాలు 79)

అంటూ పాదాల నుండి అంటే శూద్రులుగా పుట్టినందుకు మాకు బాధ ఏమి లేదు. చరిత్ర హీనున్ని కాదు. ఈ చరిత్రను నిర్మించిన శ్రమ సంకేతాలం అని ప్రకటిస్తాడు.

**పాదాల నుంచి పుట్టినందుకు**

**చరిత్ర హీనున్ని కాదు**

**నేను చరిత్రకారుణ్ణి**

(పాదాలు 80)

బెల్లి యాదయ్య కవిత్వానికొక ఒక లక్ష్యం ఉంది. గురుతర బాధ్యత ఉన్నది. గతం నుండి తనకు అందిన చైతన్యాన్ని, మరింత పదును చేసి రేపటి తరానికి అందివ్వడమే ఒక చారిత్రక బాధ్యత. దీన్నే ఈ కింది కవితలో వ్యక్తపరిచాడు.

**రాజీ పడటానికో పారిపోవడానికో**

**మనం ఇక్కడికి రాలేదు**

**పోరాడటానికే వొచ్చాం**

**ఈ చీకటి శతాబ్దాన్ని సూర్యుడి వైపుకు తిప్పి**

**రేపటి తరం దోసిట్లో పెడతాం**

(రేపటి తరం కోసం 94)

**బెల్లి యాదయ్య కవిత్వం - భాష:**

బెల్లి యాదయ్య కవిత్వ భాష చాలా సున్నితమైంది. అందులోను ప్రజలకు అర్థమయ్యే రీతిలో పదాల ఎంపిక ఉంటుంది. ఆత్మ కథనాత్మక, సంభాషణాత్మక శైలి ప్రత్యేకంగా గమనించదగ్గది. అలాగే అనేక పదబంధాలను సృష్టించాడు. గొర్రెల వ్యాకరణంలో నేను సంధి పరిచ్ఛేదాన్ని, ఉష్ణ లేఖలు, ట్విటర్ పార్క్, నీటి బోగీలు, నదుల నందులు, వలస కోకిల, మట్టి ముండ్లు, మట్టి కళలు, మట్టి పూలు, ఉష్ణ స్నానం, ఎండ గంగ, స్వేద భగీరథి, చలి కిరీటాలు, నీటి ఆసనాలు, నీటి మోపులు, నీటి ప్రతిజ్ఞ, నీటి పాఠాలు, నీటి వార్త, జల వస్త్రం, నీటి కుచ్చిళ్లు, నీటి నరాలు, జల తిలకం, కాలువ రెక్కలు, జల తిలకం, జల భిక్ష, వాగు జోలె, నీటి రక్తం, జల కాండం, నీటి కరచాలనం, జల భాష, నెత్తురు ఎరువు, ధాన్య కరచాలనం వంటి పదాలను సృష్టించాడు. కవి జీవితమే కవిత్వంలో భాగం అవుతుంది. భాషలో నూతనత్వాన్ని సాధించడం, భాష కూడా చైతన్యానికి, సామాజిక విశ్లేషణకు ప్రధాన వనరుగా ఉపయోగపడుతుంది. ఈ కోణం నుంచి బెల్లి యాదయ్య కవిత్వంలో సాధ్యమైనంతవరకు అందరికి అర్థమయ్యే పదబంధాలు, ప్రతీకలు వాడి కవిత్వాన్ని అల్లాడు.

**ముగింపు:**

బెల్లి యాదయ్య కవిత్వంలో వృత్తి జీవితం మొదలు ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం కన్పిస్తుంది. ప్రపంచీకరణపై ధిక్కారం కన్పిస్తుంది. సామాజిక పెనుగులాటకు సాహిత్య వ్యక్తీకరణగా వచ్చిన దళిత ఉద్యమానికి అనుబంధంగా వచ్చిన బీసీ సాహిత్యం వృత్తి జీవితాన్ని చిత్రించింది. బీసీ కవిగా బెల్లి యాదయ్య కవిత్వంలో శిల్పం ప్రత్యేకత ఉంది. ఆయన బీసీ జీవితమే ఆయన వస్తువు వ్యక్తీకరణలో ప్రత్యేకతను సాధించి పెట్టాయి. అలాగే యాదయ్య ప్రతి సందర్భంలో తన బాధ్యతను నెరవేరుస్తూ వచ్చాడు. ఎవ్వరు చూడని జీవితాలను చూసాడు. వ్యాఖ్యానించాడు. వారి బాధలను విప్పి చెప్పాడు. తను చూసిన సమాజపు చైతన్యాన్ని, సామాజిక దొంతరలను, అన్యాయాలను, సంస్కృతిని అన్నింటికి తనదైన ప్రత్యేక పద్ధతిలో వ్యాఖ్యానం చేస్తూ పోయాడు. ఇప్పుడు మనం చేయాల్సిందల్లా దాన్ని పారాయణం చేయడమే. చైతన్య టానిక్‌ని సమూహం పైకి వెదజల్లడమే.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. ఆరుద్ర. సమగ్రాంధ్ర సంపుటాలు 1,2,3,4. హైదరాబాద్: తెలుగు అకాడమీ, 2011.

2. యాదయ్య, బెల్లి. నేను గొర్రెల్ని కాస్తుంటాను. నల్గొండ: పదం ప్రచురణలు, 2011.

★ **రచయిత: అసిస్టెంట్ ప్రొఫెసర్, సైఫాబాద్ కాలేజ్**

# జయరాజు పాట; ప్రకృతి కవిత్వం

ఎం.విప్లవకుమార్

**పరిచయం:**

మానవులకు సహజంగా ఉండే తాదాత్మ్య సంబంధాలలో ప్రకృతి కూడా ఒకటి. పర్యావరణంతో సహవాసం, పర్యావరణంపై ఆధిపత్యాన్ని సాధించే క్రమంలో మనిషి చాలాదూరం ప్రయాణించాడు. ఒక రకంగా చెప్పాలంటే పర్యావరణాన్ని ధ్వంసం చేసే స్థాయికి మానవుడు చేరుకున్నాడు. ఇదంతా సామూహికంగానే జరిగింది. విస్తరించింది. తెలుగు సాహిత్యంలో పర్యావరణ చైతన్యం ఏ ఉద్యమ చైతన్యానికి తీసిపోని విధంగా నిర్మాణం అయింది. ప్రతీ మనిషికి పర్యావరణంతో ఆత్మీయ సంబంధం ఉంటుంది.

తెలంగాణ నేల చాలా ప్రత్యేకమైనది. సమరం ఈ నేల ప్రత్యేకత. ఇక్కడి కవులు దోపిడీ, ఆధిపత్యం, పోరాటాలు, తిరుగుబాట్ల మీద చాలా కవిత్వాన్ని సృష్టించారు. పోరుకి ఆలంబనగా సాహిత్యాన్ని ఒక కార్యాచరణగా కూడా స్వీకరించారు. ఇదంతా ఒకవైపు. మరో వైపు ఎంత ఉద్యమ సాహిత్యం రాసినప్పటికీ, పర్యావరణ చైతన్యంతో కూడా కొంత సాహిత్యాన్ని సృష్టించారు. ఒక మాటలో చెప్పాలంటే ఉద్యమ సాహిత్యం రాసినంతగా పర్యావరణం మీద రాయకపోయినా, వీలైనంత ఎక్కువగానే ప్రకృతి మీద కవిత్వం రాసారు.

కవులు సహజంగానే సమాజం, ప్రకృతి, పంచభూతాలను కవితా వస్తువులుగా, వర్ణనీయ వస్తువులుగా చేసుకొని కవిత్వాన్ని అల్లుతారు. ప్రకృతి, ప్రేమలాంటి సున్నితమైన విషయాలను అనుభవంలోకి తీసుకురావడానికే కాకుండా, ఉద్యమ భావజాలాన్ని ప్రచారం చేసే కవులకు కూడా పంచభూతాలు ఆలంబనగా నిలిచింది. అయితే వాటిని భావ కవులు ఎక్కువగా ప్రేయసి, ప్రియుల కోసం తమ సాహిత్యాల్లో వాడారు. భావ కవులకు పంచ భూతాల అస్తిత్వం, బాగోగులు, వాటికి తలెత్తుతున్న ప్రమాదాల గురించి పెద్దగా పట్టింపులుండక పోవచ్చు. ఒకవేళ ఉన్నా అవి వారి రచనల్లో పెద్దగా ప్రస్ఫుటం కాకపోవచ్చు. కానీ ఉద్యమ కవులు ప్రజా పోరాటాలకు వెన్ను, దన్నుగా ఉంటూనే, ప్రకృతి రక్షణకు కూడా కలం, గళం ఎత్తారు. పంచ భూతాలను వ్యక్తులు చెరబట్టొద్దని, దాని వలన వాటి అస్తిత్వం ధ్వంసమైపోతుందని, తదుపరి పరిణామాలకు మానవాళి బలవుతుందని ఉద్యమ కవులు ఆవేదన చెందుతారు. వారు ముఖ్యంగా అడవి గురించి, చెట్టు గురించి, పదే పదే పచ్చదనంలా, పసరు గుణంలా పల్లవిస్తారు. అలా పల్లవై, చరణమై పోటెత్తిన ప్రజాకవి జయరాజు.

**జయరాజు కవిత్వం – ప్రకృతి:**

ప్రకృతి నుంచి అనంతం వైపు వేసిన ఒక అడుగే 'కళ' అంటాడు ప్రపంచ వైవిధ్య సాహిత్యకారుడు ఖలీల్ జిబ్రాన్. అలాంటి కళతోనే అనంతమైన ఈ ప్రపంచాన్ని ప్రకృతి వైపు మలిపే ప్రయత్నం చేస్తున్న వ్యక్తి ప్రజాకవి జయరాజు. సింగరేణి రాకాసి బొగ్గులో నుండి నిప్పురవ్వలలాంటి పాటల్ని వెదజల్లిన జయరాజు వాగ్గేయకారుడిగా అందరికీ సుపరిచితమే. జయరాజు పాటలతో జనం గుండెల్లో అగ్గిరవ్వను పుట్టించడమే కాదు, కొన్ని పాటల ప్రవాహంతో ప్రజల మనస్సుల్లో పచ్చటి చైతన్యపు పంట కూడా పండించాడు. అందుకే

**'పచ్చని చెట్టు నేను నేనురా/ పాలుగారె మనసు నాదిరా/ కొమ్మను నే రెమ్మను/ నీకు తోడుగ ఉండే అమ్మను..'**

అంటూ జయరాజు చెట్టు ఆత్మకథ వినిపిస్తాడు. ఏ కొంచెం పేరున్న వారైనా నేను హీరోను, మేధావిని, ఏకంగా దేవున్ని, జాతిపితను అని చెప్పుకుంటున్న కాలంలో జయరాజు, నేను ఒక చెట్టును అని ప్రకటించుకున్నాడంటే ఎంత ప్రకృతీకరించబడ్డాడో మనం అర్థం చేసుకోవచ్చు. అందుకే మనిషికీ వృక్షానికి తేడా లేదని కైగట్టి పాడుతున్నాడు. తనే చెట్టై, మహావృక్షమై పరకాయప్రవేశం చెంది మమ్మల్ని కాపాడితేనే మానవాళికి భవిష్యత్ అని నినదిస్తున్నాడు.

**'చెడ్డగాలి పీల్చి మంచి విడిచినం / మీకు ప్రాణవాయువుల్ని పోసినం/ అడవి కొచ్చిన మునులను సాధినం/ బోధివృక్షమై బుద్ధుల్ని చేసినం..'** అంటూ సమస్త జీవకోటికి ప్రాణ వాయువు నూది బతికించడం మాత్రమే కాదూ, అతి ప్రమాదకరమైన మరణ వాయువును సైతం చెట్లు స్వీకరిస్తున్నాయంటాడు. మానవాళి పరివర్తనకు, మానవీయ చరిత్రకు బుద్ధి కుశలతను, శాంతిని, సహజత్వాన్ని ప్రసాదించేది చెట్లు, అడవులేనన్న గొప్ప వాస్తవికతను గొంతెత్తి చాటి చెప్తాడు. 'మీ రోగాల నొప్పుల్లో మందులం/ మిమ్ము కడసారి కాల్చేటి కట్టెలం.' అని పాటను ముగిస్తాడు. అంటే జీవి పుట్టుక నుంచి చావు వరకు సమస్త మానవాళి బతుకు తెరువు చెట్టుతో మమేకమై ఉందన్న భౌతిక సత్యాన్ని కడసారి కాల్చేటి కట్టెలం అంటూ, చెట్లను జాగ్రత్తగా కాపాడుకొమ్మని ఒక విధమైన హెచ్చరిక చేస్తాడు జయరాజు. ఈ పాట చెట్ల జాతీయ గీతం అని చెప్పవచ్చు.

గద్దరన్న 'అడవి తల్లికి దండాలో' అని అంటే జయరాజన్న **'ఎంత చల్లనిదమ్మ ఈ నేల తల్లి/ ఎంత చక్కటిదమ్మ నను‌గన్న తల్లి/ పచ్చ పచ్చని పట్టు చీరల్ని కట్టింది/ పండుటాకుల వంటి రవికల్ని తొడిగింది/ కొండకోనలనేమో కొప్పున ముడిసింది/ రుతువు రుతువుకు నీవు బాలింత ఓయమ్మ/ రతనాల పంటంత నీ కడుపు పంటమ్మ..'** అని మనిషి జీవనానికి తోడ్పడే పుడమి వాతావరణాన్ని, నేల మన కోసం పొదిగి ఉంచిన పర్యావరణ సమతుల్యాన్ని, నేల తల్లి సహజ సంపదను తన బిడ్డలకోసం దాచి ఉంచిన తీరును తన కొడుకై మురుస్తూ రాగమెత్తుతాడు. సమశీతోష్ణ స్థితుల, రుతువు, రుతువుకు మారుతున్న వాతావరణ గతుల, పుట్టుక సంగతుల విప్పి చెప్తాడు. ఇలా పాట కవిత్వమే కాకుండ "అవని" ది ఫిలాసఫీ ఆఫ్ నేచర్" పుస్తకంతో వచనమై కూడా పర్యావరణ చైతన్య బాధ్యతను భుజానికెత్తుకున్నాడు. ఆ విధంగా ఆయన కేవలం ప్రజాకవి మాత్రమే కాదూ, ప్రకృతి కవి కూడా.

తెలుగు నోళ్ళను, తెలుగు బీళ్ళను తడుపుతున్న సుఖ దాయని కృష్ణానది ఒడ్డున ఉండి తెలుగు నేలకు 20శాతం ఆక్సిజన్ అందిస్తున్న నల్లమల అడవిని నాశనం చేసి, కృష్ణమ్మను కలుషితం చేసే యురేనియం తవ్వకాలకు కేంద్రప్రభుత్వం పూనుకుంటున్న వేళ, "నాకో పర్యావరణ పరిరక్షకుడు కావాలి, ధ్వంసమైతున్న అడవి నీడ నుండే రేపటి వసంతానికి స్వాగతం పలకాలి, నా చరిత్రను రేపటి తరానికి అందించే వాగ్గేయకారుడు కావాలి. ఓ కవిరాజు కావాలి అని విలవిలలాడుతున్న మాతృ హృదయంతో చేతులు చాచి అడుక్కుంటున్న ఈ అవనిని నేనున్నానంటూ అక్కున చేర్చుకున్నవాడు జయరాజు. అడవిలో చెట్లన్నీ అమ్మ రొమ్ముతో సమానం. వాటినేమన్నా అమ్మ చనుబాల వాసనే మనల్ని చుట్టుముడుతుందని అడవిని అంతం చేసే హరిత హంతకుడికి హిత బోధ చేస్తాడు. ప్రకృతిని పలగజీరి పండుగ జేసుకుంటున్న పాపుల విధ్వంసం వలన దెబ్బతింటున్న వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ఈ పుడమి తల్లికి పచ్చని ఓజోన్ దుప్పటి కప్పుదాం. రండీ అని జయరాజు ఇచ్చే పిలుపులో కొప్ హెగెన్, ప్యారీస్ ఒప్పందాలను తలదన్నే నిజాయితీ కనిపిస్తుంది. ఖలీల్ జిబ్రాన్ చెప్పిన అనంతం నుండి అనంతానికి ప్రవహించే మానవత్వపు నది ఏదో జయరాజులో ప్రవహించడం తన 'అవని' పుస్తకంలో గమనించవచ్చు.

శాస్త్రవేత్త జగదీష్ చంద్రబోస్ మొక్కలకు ప్రాణముందని నిరూపిస్తే, మనిషికున్నట్టే చెట్టుకూ అవయవాలున్నాయని తన 'అవని, ఫిలాసఫీ ఆఫ్ నేచర్' ద్వారా నిరూపిస్తున్నాడు ఈ ప్రకృతి శాస్త్రకారుడు జయరాజు. ప్రపంచంలోనే ప్రతి బడిలో వేయించదగ్గ 'చెట్టు నృత్య ప్రదర్శన' ద్వారా చెట్టులో మనిషిని మించిన మహిమాన్విత నిస్వార్థ పరోపకారపు గుణాన్ని వర్ణన చేస్తూ మనిషి కంటె మాను ఎందుకు తక్కువో చెప్పమని ప్రశ్నిస్తాడు. అభివృద్ధి పేరుతో అవనిని ధ్వంసం చేసి అడవులను ఆక్రమించే హక్కు మనకుంటే పట్టణాలను గృహ సముదాయాలను ఆక్రమించే హక్కు అటవీ జీవాలకూ ఉంటుంది. అందుకే కోతులు ఊళ్ళనేలుతున్నాయని గుర్తుచేస్తాడు. అడవి ప్రకృతి ప్రసాదం పరిణితికి జన్మస్థాన మంటాడు. పాండవులు, శ్రీరాముడు అరణ్యవాసం చేసింది, వాల్మీకి రామాయణం రాసింది, అన్నమయ్య కీర్తనలు పాడింది, సమ్మక్క సారక్క రాజ్యం చేసింది, కొమురం భీం కోరమీసం దువ్వింది అడవి నుండేనని గుర్తుచేస్తాడు. అడవి తిరుగుబాటుకు ఆదెరువు. జరుగుబాటుకు కల్పతరువు. పొట్టకూటికి బతుకు తెరువు. అందుకే అడవి చరిత్రను మళ్లీ మళ్లీ రాస్తానంటాడు.

చెట్టు తన ఆత్మకథ రాయగలిగితే అది ఒక జాతి చరిత్రకన్నా ఏమాత్రం తక్కువగా ఉండదన్న ఇండియన్ ఖలీల్ జిబ్రాన్ జయరాజు. పచ్చని ప్రకృతిలో పరచుకుంటున్న కాంక్రీట్ కీకారణ్యం, ప్లాస్టిక్ నవ్వులు, వాట్సఫ్ ప్రాయాలు, ఫేస్ బుక్ జీవితాలు, డబ్ స్మాష్ డైలాగులు, టిక్ టాక్ నటనలే జీవితాలయిపోయిన వేళ నట జీవితాన్ని వివరిస్తాడు. మనిషి తత్వాన్ని కోల్పోయి నటనే ఆశ్చర్యపోయేలా నటిస్తున్న జనాన్ని చూసి ప్రకృతి ఎంత బాధ పడుతుందోనని వెక్కి వెక్కి ఏడుస్తాడు. ప్రకృతి విరుద్ధ ప్రవర్తనలతో మనిషిలో పెంటగడ్డలా పేరుకుపోతున్న తత్వాన్ని నిలదీసే తన ప్రశ్న సున్నితమైనదే అయినా, దాని గాఢత మాత్రం లోతైనది. అభివృద్ధి జపంలో శృతిమించిన యాంత్రీకరణతో మనిషి మర యంత్రంగా మారిపోతున్నాడని తలపోస్తాడు. అలా మనం మర మనుషులం అయ్యాక మానవ చరిత్రలో కేవలం మనిషి చిత్రపటాలు మాత్రమే మిగిలే ప్రమాదం ఉందని వలపోస్తాడు. ప్లాస్టిక్ కి మనం ఫుల్ స్టాప్ పెట్టకపోతే అదే మనకు ఫుల్ స్టాప్ పెడుతుందని ఈ కాస్మోపాలిటిక్ కల్చర్ ని జయరాజు హెచ్చరిస్తాడు. సుద్దాల అశోక్ తేజ రోబో పాటలో చెప్పినట్లు సినిమాకొరకు ఇనుములోనైనా హృదయం మొలుస్తుందేమో కాని ప్లాస్టిక్ లో మాత్రం మొలవదంటూ ప్లాస్టిక్ జీవితాల చెంప చెళ్లుమనిపిస్తాడు. మొక్కలను పెంచడమంటే, అడవులను రక్షించడమంటే ప్రొఫైల్ పిక్స్ బొమ్మలు మార్చడం కాదు. అమ్మ చనుబాల రుణం తీర్చుకునేందుకు పర్యావరణ పరిరక్షణకు పూనుకోవడమేనంటూ మన మెదళ్ల నిండా ఆకుపచ్చని అవనిని పరుస్తాడు జయరాజు. తన సాహిత్యంతో మనిషి కణం కణంలోనికి పత్ర హరితం ఎక్కిస్తాడు. అలా పచ్చనాకు సాక్షిగా ప్రకృతికి ప్రణమిల్లమనే జయరాజు ప్రతి అక్షరం పత్రహరితమే.

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. జయరాజు. వసంతగీతం. ఖమ్మం: ప్రకృతి ఆశ్రమం ప్రచురణలు, 2011.
2. జయరాజు. అవని. హైదరాబాద్: స్వీయ ప్రచురణ, 2020.
3. ఖలీల్ జిబ్రాన్. న్యూ ఢిల్లీ: స్టెర్లింగ్ పబ్లిషర్స్, 2009.

**రచయిత: పరిశోధక విద్యార్థి**

# అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో అవినీతి వ్యతిరేకత

పి.రాజీవ్ కుమార్

**పరిచయం:**

ప్రస్తుతం మన దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల్లో అవినీతి అనేది అత్యంత ప్రధానమైన సమస్య. అవినీతి నిరోధక చట్టం (1988) ప్రకారం లంచగొండితనం, నిధుల దుర్వినియోగం, అధికారాన్ని స్వార్ధ ప్రయోజనాలకు ఉపయోగించడం, ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉండటం తదితర చర్యలన్నింటినీ అవినీతి చర్యలుగా చట్టంలో పేర్కొంది. అవినీతివల్ల సామాన్య ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను ఈ అవినీతి సమస్య పట్టిపీడిస్తుంది. మిగతా ప్రపంచంతో పోల్చి చూసినప్పుడు మన దేశంలో అవినీతి సమస్య మరీ ఎక్కువగా ఉన్నది.

జర్మనీ రాజధాని బెర్లిన్ కేంద్రంగా "ట్రాన్స్పరెన్సి ఇంటర్నేషనల్" అనే ప్రముఖ స్వచ్ఛంద సంస్థ అవినీతి నిర్మూలనకోసం పని చేస్తుంది. ఈ సంస్థ 2023 సంవత్సరంలో 180 దేశాలలో జరిపిన అధ్యయనం ప్రకారం భారత్ అవినీతిలో 93వ స్థానంలో ఉంది.(https://www.transparency .org/en/cpi/2023). ప్రపంచ దేశాలలో అంటే 92 దేశాలలో భారత్ కంటే తక్కువ అవినీతి, 87 దేశాలలో భారత్ కంటే ఎక్కువ అవినీతి ఉంది. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే ప్రపంచంలో ధనిక దేశాలుగా, అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్న అమెరికా, ఇంగ్లాండ్, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాలు అవినీతి నిర్మూలనలో మొదటి 25 ర్యాంకుల్లో ఉన్నాయి. పాకిస్తాన్, బంగ్లాదేశ్, కజకిస్తాన్, జింబాబ్వే లాంటి వెనుకబడిన, అత్యంత పేదరికం కలిగిన దేశాలు మాత్రమే మన సరసన ఉన్నాయి. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో మనది కూడా ఒకటి అని చెప్పుకుంటున్న నేటి సందర్భంలో మన దేశం ఉండాల్సింది మొదటి స్థానాల్లో తప్ప, చివరి స్థానాల్లో కాదు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ల నుంచి కూడా అక్కడక్కడ అవినీతికి సంబంధించిన వార్తలు వినిపించినప్పటికీ, 1975లో ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలం నుంచి అవినీతి అనేది చర్చనీయ అంశంగా మారింది. ఆ తర్వాత క్రమంగా అక్షరాస్యత పెరుగుతున్నకొద్దీ ప్రభుత్వాలు పాలనలో చేస్తున్న అక్రమాలను ప్రజలు తెలుసుకోగలుగుతున్నారు. సమాజంలో జరుగుతున్న ఇటువంటి అవినీతి చర్యలను ఖండిస్తూ కవులు కూడా స్పందించారు.

సమాజంలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వస్తుంటాయి. ఉద్యమాల ఆలంబనగా సాహిత్యం వెలువడుతుంది. సతీసహగమనం, బాల్యవివాహాలు, అస్పృశ్యత మొదలైన సాంఘిక సమస్యలమీద వీరేశలింగం, గురజాడవంటి కవులు స్పందించారు, రాజకీయపరమైన జాతీయ ఉద్యమానికి ఆలంబనగా చిలకమర్తి, గురజాడ, రాయప్రోలు, బసవరాజు, గరిమెళ్ళ వంటి వారు విస్తృతంగా రచనలు చేసారు. జల్ జంగిల్ జమీన్ అనే నినాదంతో వచ్చిన ఆర్థికపరమైన ఉద్యమం భారత విప్లవోద్యమం. ఈ ఉద్యమానికి మద్దతుగా సుబ్బారావు పాణిగ్రాహి, శ్రీ శ్రీ, చెరబండ రాజు, శివసాగర్, వరవరరావు, గద్దర్ వంటి వారు రచనలు చేశారు.

కానీ అవినీతి అనేది పాలనాపరమైన సమస్య. పైన పేర్కొన్న విభాగాల్లోకి ఇది చేరకపోవచ్చు. రాజనీతి శాస్త్రం నుంచి ప్రభుత్వ పాలనా శాస్త్రం విడివడి ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్న సందర్భంలో అవినీతిని కూడా పాలనాపరమైన సమస్యగా గుర్తించాల్సి ఉంటుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలను దాటుకొని పాలనాపరమైన సమస్యల మీద రచించే స్థితికి తెలుగు కవులు రచయితలు వచ్చారా అని చూసినప్పుడు, ఆ దిశగా తెలుగు కవులు దృష్టి సారించారనే చెప్పాలి. అవినీతికి వ్యతిరేకంగా పెద్ద ప్రజా ఉద్యమం ఏదీ రాకపోయినప్పటికీ కవులు తమ వ్యక్తిగత చైతన్యాన్ని అనుసరించి అవినీతికి వ్యతిరేకంగా కొన్ని రచనలు చేశారు. వాటిని అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అందులో భాగంగా అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో ఉన్న అవినీతి వ్యతిరేకతను ప్రస్తుత వ్యాసంలో పరిశీలిద్దాం.

*Keywords: అవినీతి, అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం, అవినీతి వ్యతిరేక కవిత్వం. అవినీతి వ్యతిరేక సాహిత్యం.*

**అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం:**

సామాజిక స్పృహతో కవిత్వం రాసిన కవులలో అలిశెట్టి ప్రభాకర్ ఒకరు. ఆయన కవిత్వంలో సమకాలీన జీవితం ప్రతిబింబిస్తుంది. అందరికీ అర్థమయ్యే రీతిలో, సులభ శైలిలో, పదునైన అక్షరంతో, ఆర్ద్రతతో కూడిన వాక్యాలు రాసాడు.

అలిశెట్టి ప్రభాకర్ కరీంనగర్ జిల్లా జగిత్యాలలో జన్మించారు. మొదట ఆర్టిస్ట్‌గా ఎదిగాడు. ప్రారంభంలో

పత్రికలకు, పండగలు, ప్రకృతి, సినీనటుల బొమ్మలు వేసేవాడు. తరువాత జగిత్యాలలో సాహితీ మిత్ర దీప్తి సంస్థ పరిచయంతో కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు. 1974లో ఆంధ్రసచిత్ర వారపత్రికలో అచ్చయిన మొదటి కవిత 'పరిష్కారం'. ఉపాధి కోసం జగిత్యాలలో 'స్టూడియో పూర్ణిమ' (1976), కరీంనగర్లో స్టూడియో శిల్పి (1979) హైదరాబాద్లో 'స్టూడియో చిత్రరేఖ' (1983) ఏర్పాటు, జీవిక కోసం ఫోటోగ్రాఫర్, జీవిత పోరాటంలో కవిగా ఎదిగాడు. ఏనాడూ సంపాదనకోసం ఆరాటపడలేదు. తన కళ ప్రజల కోసమే అని చివరకంటా నమ్మాడు. ఎర్ర పావురాలు (1978) మంటల జెండాలు, చురకలు (1979), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (1990) సిటీ లైఫ్ (1992) కవిత్వ సంకలనాలను వెలువరించాడు. విప్లవ రచయితల సంఘంలో కూడా చేరాడు.

తెలుగు సాహిత్యంలో ప్రసంగాలు, రచనల్లో కోట్ చేయబడ్డ కవిత్వంలో శ్రీశ్రీ తరువాత, ఎక్కువగా కోట్ చేయబడ్డ కవి అలిశెట్టి ప్రభాకరే అని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు (పుట: 20, అలిశెట్టి ప్రభాకర్ కవిత 2017). తెలుగు సాహితీరంగంలో అంతచిక్కటి కవిత్వాన్ని రాసి, నిలిచిన కవిగా అలిశెట్టి ప్రభాకర్ ప్రత్యేకతను మనం గ్రహించవచ్చు. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వంలో అవినీతి నిర్మూలన కాంక్ష బలంగా కనిపిస్తుంది. ఆయన రాసిన రక్త రేఖ కవితా సంపుటిలో చిలుం పేరుతో రాసిన కవిత ఇట్లా ఉంది.

**"ప్రతిరోజు/ప్రభుత్వ కార్యాలయం కుర్చీలో**
**లంచం/నెమలి పించంలా పురి విప్పుకుంటే**
**యధేచ్ఛగా/కాంట్రాక్టర్లు**
**ఇసుక సముద్రంలో మునిగి/జలకాలాడితే**
**ఈ దేశపు దళారి సంస్కృతి/పగలబడి నవ్వినప్పుడల్లా**
**కట్టడాలన్నీ/కృత్రిమ దంతాల సౌందర్యంతోనే**
**తలుక్కుమంటాయి"**

(అలిశెట్టి ప్రభాకర్ కవిత. 2017: 104)

ఈ కవితలో దళారి సంస్కృతి అనే మాటను వాడాడు. దళారి అంటే ఉత్పత్తిదారునికి బజారులో వర్తకులకు మధ్య కమీషన్ పుచ్చుకొని పనిచేసే మధ్యవర్తి. ప్రభుత్వం చేయాల్సిన నిర్మాణాలు, ప్రభుత్వ యంత్రాంగంతో ఏర్పాటుకావల్సిన వ్యవస్థలు ఏర్పాటు కాకుండా చూడటంద్వారా అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది. ప్రభుత్వ నిర్మాణాలలో ఎటువంటి నాణ్యతా పరమైన చర్యలు చేపట్టకుండా, ఆయా విభాగాల అధిపతులకు లంచాలు ఇవ్వడం ద్వారా నాసిరకం మెటీరియల్తో భవనాలు కడ్తారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు నష్టం ఏర్పడటమే కాకుండా తక్కువ సమయంలోనే నాశనం కావడం, కేవలం పైపై పూతల ద్వారా డబ్బును కాజేస్తున్న స్థితిని అలిశెట్టి ప్రభాకర్ పట్టుకున్నారు. కాంట్రాక్ట్ ఇచ్చి వారి దగ్గర కమిషన్ తీసుకోవడం వల్ల ప్రభుత్వ కట్టడాలన్నీ నాసిరకంగా, పైపై మెరుగులతో మాత్రమే పెట్టుడు దంతాల మాదిరిగా ఉంటున్నాయని కవి భావించాడు.

మంటల జెండాలు కవితా సంపుటిలో అంతు చూద్దాం అనే శీర్షికతో రాసిన కవితలో **"ప్రభుత్వ కార్యాలయాల ఫైళ్ల కింద పాకే లంచగొండి తేలుకొండుల్ని"** (అ. ప్ర. క. 2017: 75) అంతు చూద్దాం అంటున్నాడు. రక్త రేఖ అనే కవిత సంపుటిలో శీర్షిక లేని ఒక కవితలో

**"లక్షల రూపాయల చందాలతో**
**కుళ్ళు రాజకీయ మహాసభలు మొలిచి**
**కుక్క గొడుగులా రాలిపోతాయ్**
**కోటానుకోట్లు వెలగపండులా మింగి**
**ఏసియాడ్ ఏనుగు తోక ముడుచుకు వెళ్ళిపోతుంది**
**పుట్టే ప్రతి శిశు వీపు మీద**
**ఐ.ఎం. ఎఫ్ ముద్ర వేయమని**
**శాసించడం జరుగుతుంది**
**అల్లావుద్దీన్ దీపం**
**క్షయ పాత్ర**
**అన్నం పెట్టవు గనుక**
**దిశ మొలలతో దరిద్రం**
**దేశమంతా ఊరేగుతుంది"**

(అలిశెట్టి ప్రభాకర్ కవిత,2017:131)

దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టుకొస్తున్నాయి. ప్రజల నుంచి, వ్యాపారస్తుల నుంచి వసూలు చేసిన చందాలతో ఆ పార్టీలు నడుస్తున్నాయి. కానీ ఒక సిద్ధాంత భూమిక లేకుండా కేవలం ఎన్నికల్లో గెలుపుకోసం మాత్రమే ఏర్పడే పార్టీలు ఎన్ని వచ్చినప్పటికీ అవి కుక్క గొడుగులలాగా రాలిపోతాయని కవి అభిప్రాయపడుతున్నాడు. అలాగే ఐ.ఎం.ఎఫ్. అంటే ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (అంతర్జాతీయ ద్రవ్య నిధి). అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో దీని ప్రధాన కార్యాలయం ఉంటుంది. భారత్ లాంటి పేద దేశాలకు వడ్డీకి రుణాలు ఇస్తూ ఉంటుంది. స్వయం సమృద్ధి సాధించవలసిన మన పాలకులు నిధులను దుర్వినియోగం చేసి, దుబారా ఖర్చు చేసి ఐ ఎం ఎఫ్ దగ్గర లక్షల కోట్లు అప్పు తెచ్చి ఆ భారాన్ని పుట్టబోతున్న బిడ్డల మీద కూడా మోపుతున్నారని కవి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అలిశెట్టి ప్రభాకర్ దినపత్రికల్లో మినీ కవితలు రాసారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆరు సంవత్సరాల పాటు సీరియల్ గా 'సిటి లైఫ్' పేరుతో మినీ కవిత్వాన్ని వెలువరించారు. ఇవి ఆనాటి వర్తమానకాలం మొదలు నేటి వరకు పాఠకులను ఆకర్షిస్తూనే ఉన్నాయి. కదిలిస్తూనే ఉన్నాయి. వీరు కవిత్వాన్ని

ఆయుధంగా మలిచి, పాఠకుల్లో ప్రగతి ఆలోచనలను ప్రసరింపజేశాడు. నగర జీవితంలోని వాస్తవాలను పాఠకులకు కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

**ముడుపులు**
**ముట్టిన వారి బతుకే/మూడు చికెన్లు**
**ఆరు సీసాలు/మన కడుపులో**
**ఏముంటాయ్/చిన్నప్రేగులు**
**పెద్ద ప్రేగులు**

(అలిశెట్టి ప్రభాకర్ కవిత. 2017: 160)

ఈ కాలంలో ఏదైనా పనిని సక్రమ పద్ధతిలో సాధించాలంటే భగీరథ ప్రయత్నమే చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాలలోని అధికారులు జీతం మాత్రమే కాకుండా, అక్రమంగా లంచాలు తీసుకొని నిరంతరం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లు మూడు చికెన్ పీసులు, ఆరు బీరు సీసాల మాదిరిగా బతుకుతున్నారు. కూటికి గతిలేక కనీసం ప్రభుత్వం సాయం పొందుదామని ప్రయత్నించినా వాడికి ఈ స్థాయిలో లంచాలు ఇవ్వని పేద కడుపులలో కేవలం చిన్న పేగులు, పెద్ద పేగులు తప్ప వాటిలో చేరే ఆహారపదార్థాలు ఏమి ఉండవనే అర్థంలో ఈ చిన్న మినీ కవితను రాసారు. ఇందులోని సూక్ష్మ పరిశీలన, అలిశెట్టి జీవన తాత్త్వికతకు చిహ్నంగా నిలుస్తుంది. అలాగే ప్రజల్లో ఉండే ఒక సామెత స్పురించే విధంగా కవితనల్లడం వల్ల కవిత పాఠకులకు నూతన పద్ధతి అనుభవంలోకి వచ్చింది.

నిజానికి అవినీతికి పాల్పడేవాళ్లలో కిందిస్థాయి ఉద్యోగస్తులను మాత్రమే అవినీతి నిరోధక శాఖ వాళ్లు పట్టుకొని, కోటానుకోట్ల రూపాయల దోపిడి చేసేవానికి మాత్రం సలాములు కొడుతుంటారు. సూక్ష్మంగా అర్థం చేసుకుంటే 50, 100 రూ.ల లంచం తీసుకునేవారిని పట్టుకుని వారికి శిక్షలు వేస్తూ, లక్షల కోట్లను దోచుకునేవారిని చట్టం ముందు నిర్దోషులుగా చిత్రించే, లేదా నమ్మించే వ్యవస్థలను వారే సృష్టిస్తున్న దుస్థితి గురించి సిటీ లైఫ్ లో కవి ఈ విధంగా చెప్తున్నాడు

**ముప్పైరూపాయలకి**
**నేరస్తున్ని ఉరితీసేది**
**తలారి**
**ముప్పై లక్షలకి**
**ముప్పైకోట్లకి**
**దేశానికి ఉరిబిగించేది**
**దళారి**

(అలిశెట్టి ప్రభాకర్ కవిత. 2017:178)

సిటీలైఫ్‌లో ఇంకా వ్యంగ్యం, చమత్కారంతో కూడిన ఎన్నో మినీ కవితలు ఉన్నాయి. "గాలి వెలుతురు శోకని లాకర్లో/ రోజురోజుకీ ఉబ్బిపోయే శవం నల్లధనం" అని అంటాడు. అలాగే

**ఈ మధ్య బల్లితో నల్లి,**
**కుక్కతో పిల్లి, ఒకటే గుసగుస**
**బోఫోర్స్ కుంభకోణం**
**వాటిదాకా పాకినట్టుంది"**

అంటూ 1986లో అప్పటి భారత ప్రభుత్వం ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ నాయకత్వంలో స్వీడన్ దేశంతో ఆయుధ కొనుగోలులో జరిగిన ఒప్పందం విషయంలో అవకతవకలు జరిగాయని వార్తలు రావడంతో దుమారం చెలరేగింది. పారదర్శకతలేని లావాదేవీలు జరిగాయని, గాంధీ కుటుంబంతో సన్నిహితులకు ముడుపులు ముట్టాయని ఆరోపణలు వచ్చాయి. భారతదేశ చరిత్రలో ఇదొక పెద్ద అవినీతి కుంభకోణంగా మిగిలిపోయింది.

**"కుంభకోణం టోపీ**
**కొత్త బట్టతలపై వాలినట్టు**
**అవినీతి పొట్టని నల్లధనం బొడ్డు**
**మార్చినట్టు**
**ఛూ!**
**రాజకీయమంత**
**నీతి బాహ్యమైనది**
**మరొకటి లేదు"**

(అలిశెట్టి ప్రభాకర్ కవిత,2017:244)

అంటూ రాజకీయ వ్యవస్థలో అవినీతిపై కవి అసహనం వ్యక్తంచేస్తున్నాడు. అలిశెట్టి ప్రభాకర్ కవిత్వాన్ని పరిశీలిస్తే గాఢమైన విప్లవకాంక్షతోపాటు సుపరిపాలన, పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం, అక్రమార్జనపై వ్యతిరేకత, అధికార దుర్వినియోగాన్ని నిరసించటం, పాలనలో జవాబుదారీతనాన్ని కోరుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## ఉపయుక్త గ్రంధాలు:

1. నాగయ్య, జి. తెలుగు సాహిత్య సమీక్ష రెండో సంపుటం, 1985.

2. నారాయణ రావు, వేల్చేరు. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం: 1982.

3. తిరుమల రావు, జయధీర్. అలిశెట్టి ప్రభాకర్ కవిత. 2017

4. రంగనాథాచార్యులు, కె.కె.(సం) ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు: 1982

5. https://www.transparency.org/en/cpi/2023.

రచయిత: పరిశోధక విద్యార్థి T

# బుడ్డపొల్లగాడు మెత్తవడ్డడు

రవి కుర్మకోరి

అదినే... ఓ బూద్యవ్వ వదినే! యాడికోతున్నవో..?

ఓల్లురవ్వో... ఓల్లోగని జెర్ర సౌసుంండ్రి.

నెత్తిమీద సంచుంది, సేతిలేమో బస్తుంది.

బొండిగమల్పి సూడస్తలేదు, ఓల్లోగని జెర్రాగుండ్రి

అవ్‌మరి..! నాయసొంటిదాన్ని యాడికెని సూడస్తది.

సుఖమస్తే మొఖం కడ్గలేదట నీ అసోంటిది.

గట్లుందదినా నీ కత... ఇగేం నన్నేంజూస్తవ్ మరి!

ఓళ్లవ్వా.! ఓల్లోగని పొద్దున పొద్దున బాగనే పరేస్కమాడుతుర్రు

ఊకుంద్యవ్వ ఉరుకులాడుతదన్నట్టు దబదబ అంటనే ఉంర్డు.

ఈ కండ్ల సల్లగుండ కండ్లగూడ మంచిగ కన్పించిమన్నువడ్తలెవ్

ఓల్లురవ్వా...! సాయవ్వ! నువ్వవో! యాడికొయస్తున్నవో..!

శిన్నపోరి దగ్గరికొయ్యస్తున్న అదినే!

ఏం మతలబు... అంత మంచి ముచ్చటేనా?

ఏ! బుడ్డపొల్లగాడు మెత్తబడ్డడని సెప్పంపుతే

అరుసుకద్దమని ఐతారం పొద్దటి బస్సుకొయ్న.

ఓళ్లు.. సుక్కపొరంకిచ్చిన సిన్నదాని కొడుకా?

అవునదినే సుక్కపొరందాని కొడుకే!

నాల్గంగల్లుగా జెరం జుట్టుకుందట.

మందులైనయట, సూదులైనయట, అయినా! జెరం ఇడ్సుతలేదని సెప్పంపితే పొయిన.

పొయెసరికి పొల్లగానికి అగ్గోలె జెరముంది. పెయ్యంత పెంక కాలినట్టు కత్తన కాలుతుంది.

ముద్దదినడు, సంకదిగడు, పొద్దూక సన్నురొమ్ముపట్టుకొని సప్పరిస్తే కడ్పునిండదాయె, కుతిదీరదాయె.

ముసలిది మూల్గినట్టు ఇరాం లేకుంటే మూల్గుతనే ఉండు.

పోరిగుడ తిన్నది పెయినవట్టక, కంటికి నిద్రవట్టక పురాగ గుంజుకచ్చి బొక్కలుదేలినయ్.

ఎం రోగాలో ఏమో! రోగాలల్ల మన్నువడ, ఓల్లు జూసిన పానాలు బాగలెవ్వనే అంటుండ్రు.

ఇయెన్యాడల్ల చేసిన శేతంతా దవఖానలల్ల వెట్టుడే అయితుంది.

ఏమన్న మనిశి కోడో, దయ్యంకోడేవో అల్లుజూపియ్యకపొయినవ్!

అన్ని ఇద్దెలు వడ్డ అదినే! జిష్టిదీసినా! అల్లుజూపిచ్చిన!

పోతురాజోన్తోని మంత్రమేపిచ్చి, తాయితు కట్టిచ్చిన.

ఆడికి పొలగానిమీదికెని, తల్లిమీదికెని కోడిగుడ్డుదింపి మూడు తొవ్వలల్లవడేసచ్చిన.



గోజలచ్చే యాల్లకు ఊరవతల ఇంత కల్లుబిందు వెట్టొచ్చిన.

ఏమన్న జడుపేమని తల్లికి, పిల్లగానికి పెయ్యంత కానుబ్బాడిదివూసి సెరింత నోట్లేసిన.

అల్లుజూపిస్తే సేన్కాడ నిలవెట్టుకున్న ఎల్లమ్మ కోడని ఎల్లింది.

పొల్లగానికి సట్టన జెరందగ్గితే అచ్చె ఐతారం కోడిగూడ గోపిస్త అని మొక్కిన.

ఏ ఇద్దెలు పన్జేసినయోగానీ పొద్మీకె జాములకు జెర్ర శాంతనంకొచ్చిండు.

మరి! ఏం పాసిపోతుందని జెట్టన్నే మర్రినవ్? ఇంగో రెండొద్దులుండి రానుంటివి.

నాగ్గాడదేనిపించింది అదినే! అసలే పోరిది కొత్తగ ఏరువడ్డ సంసారమాయే!

దానత్తగ్గాడ దాని యారాల్ను జూసినట్టు దీన్నిజూడదు. ఇంగో రెండొద్దులుందామనిపిచ్చింది.

నా శిన్నబిడ్డేగ్గాడా బస్టాండుదాకచ్చి గోసోలే యవ్వా! రెండొద్దులుండిపోయే అని బతిమిలాడింది.

కానీ...! బుడ్డపొలగాడు మెత్తవడ్డడనంగానే ఎన్కముందు జూడకుండ బస్సెక్కిన.

రెండొద్దులు ఇంటిపట్టున లేకపోతే ఇళ్ళాకిలి పడుగులంగడయితది.

ఈడ మీ అన్నగ్గాడ సద్దిబువ్వకిబ్బందయితది, ఉ పాసముంటడు గని పిడికెడు బియ్యంబెట్టుకోడు.

తీరిన్నాడు మర్రో రెండొద్దులచ్చిపోతని శిన్నపోరికి అగులు, బుగులు అన్ని జెప్పి మస్కుండచ్చే పాల బస్సుకెక్కొచ్చిన.

అవునో...! నువ్వన్నదిగూడా సై మాటనే!

ఈరోజు రేపట్ల పోరగాండ్లుషారుంటెనే పానాలు యదార్థంగుంటయ్.

అవ్‌గని, అదినే! యాడికో ఊరికోతున్నట్టున్నవ్!

సంచి గించి జదురుకొని జోర్ దార్‌గా వోతున్నవ్! ఏ ఊరికోతున్నవ్?

నడిపోని కొడుకున్జూసొస్తని దర్మారం హాస్టల్లకోతున్న.

నడిపాయెన కొడుకు బుడ్డపొల్లగాడు సర్కారు హాస్టల్ల సదువుతుండా?

ఆ..! సదువుతుండు. సదువు సల్లగుండా! ఏం సదువుడో ఏమో?

అగో గట్లంటవేందదినే? సదువుకుంటే సక్కదనమేగదా!

ఏం సక్కదనమో? ఏం సదువో? శిత్తం శివునిమీద బక్తి సెప్పులమీదన్నట్టు

పోరడేమో ఆడా! పానమంత ఈడ!

ఏమైందదినే! ఏమన్న కిరికిరి జేస్తుండా! పిలగాడు హాస్టల్లుండనంటుండా?

అయినా గుడకకింద కమ్మిన మేకపిల్లలోలే హాస్టల్లనే దొరకవట్టినట్టుండుడుగ్గాడా రంజివెట్టుకుంటుండేమో.

అట్లేమంటలేడు. ఉండుడైతే మంచిగనుంటుండు. అండ్లేమ్ అర్రేకుడు జేస్తలేడు.

మరేమైంది? పానమిటెందుకు వెట్టుకుంటుండు.

తిండి సరిగ తినడో! సక్కగ తిండి కొట్టుకొని తినిపాడుగాడు.

పొయినప్పుడు బుజుడుకుక్కోలే వొయినోడు పురాగా గుంజుకొచ్చి కంటెబొక్కలు దేలినయ్!

మూడు మూడొద్దులకు మెత్తవడ్డడని పోన్ జేస్తరు.

ఆడ ఆస్టల్లున్నట్టుగాదు.. ఈడింటికాడ దిన్నట్టుగాదు.

అటిటు దిరుగుట్లనే అని సదువైపోతుంది. దిరగలేక నడిమిట్ల నాకు సావైతుంది.

అయినా! ఇప్పటి పోరగాండ్లకు ఏం పోయె కాలమొచ్చిందో తిండి సరిగ కొట్టుకొని దినిసావరు.

ఈడ ఇంటికాడ అరొక్క కూరలువండిపెడితెనే దినరు. ఆడ ఆస్టలల్ల దింటారు పోరగాండ్లు?

ఇంటికాడండినట్టు ఆడండుడు ఆండుతారు. ఈడింటికాడ నలుగురికండుతెనే నాలుగంకలు వెడుతరు.

ఆడ నాలుగైదు వందల మంది పోరగాండ్లాయే! ఎంతమందికంట అండుతరు. ఎంతమందికంట వెడుతరు.

పుట్టజెదిరిన సీమలోలే కలెబుల్గం బతుకుడాయె! కమ్మగ్యాడ దొరుకుతది.

అట్లెందుకో సాయవ్వ! ఒక్కొక్క పోరదు ఉడికిందో ఉడకందో కుక్కలుదిన్నట్టు దింటరు.

సీపురుపుల్లోలే ఉన్నోళ్లు గూడా రోకలిబండోలే అయితుర్రు. ఈనికేంబుట్టిందో తిని మన్నువడదు.

అయినా! ఒక్క ఆడిపోరెనకా ఒక్క మొగ పోరడేనాయే! ఈడింటికాడ సదివిపిచ్చుకుంటే కాకపోతుండెనా!

నేను గట్లనే అన్న. పదోజిదాక ఈన్నే జదివిపియ్యురా... పదైనంక నీ బుద్దున్నకాడ జదివిపిచ్చుకో అన్నా!

నా కొడుకింటెనా! ఇంటికాడుంటే సెడిపోతరంటా! హాస్టల్ల జదువుతెనే మంచిగుంటరంట.

నిజమే వదినే! ఈ పోరగండ్లకు గత్తర్రాను, ఇంటికాడ స్కూల్లకువంపితే బస్త స్కూల్ల, మనిషి బయట.

సేతులకేని సెల్లుదియ్యరు, టివిలకేని మొఖం మలుపరు.

సిన్నసిన్న పోరగాండ్లు గూడ లంగల సోపతివట్టి తాగుడుకు, తిరుగుడుకు మరుగుతుర్రు.

జానెడంత లేనోడు గూడా అయ్యవ్వల మీదికే మర్రవడుతుర్రు.

గిదంత బాధదప్పుతదనే గావచ్చు పోరగండ్లను హాస్టల్లవడేసస్తుర్రు.

ఆడకట్టు పోరగాండ్లంత హాస్టల్లకోతే! గల్లిమొత్తం పిల్లల్లేక గొడ్డువొయినట్టయితుంది.

మన జమాన్ల గంపెడు పిల్లలున్నా గడ్డలోలే జాదుకున్నమ్...!

ఈ జమాన్ల ఇద్దరు పిల్లలను జాదడానిగ్గాడా ఇచ్చుకపోతుర్రు.

సరె! సాయవ్వ బస్సస్తుంది. నేన్ వొయ్యస్త.

సరె! వదినే పైయిలంగ పొయ్‌రా! అంబటాల్లైంది నేన్గూడవోత.

★ **రచయిత:** తెలుగు అధ్యాపకుడు డిగ్రీ & పి.జి. కళాశాల, కామారెడ్డి

# దళిత సాహిత్యంలో ఆత్మకథలు-పరిశీలన

డా. గిన్నారపు ఆదినారాయణ

**పరిశోధన శీర్షిక :** (Title of the Research)

ఆత్మకథలు విద్యార్థులకు ప్రేరణను కల్గిస్తాయి. తెలుగు దళిత సాహిత్యంలో కృషి చేసిన కవుల, రచయితల జీవితాలు సంఘర్షణలతో కొనసాగినవిగా కన్పిస్తాయి. పరిశోధనకు పూర్వం గుర్రం జాషువ ఆత్మకథాత్మక అంశాలను కొన్ని తెలుసుకున్నాను. అలా దళిత సాహిత్యంలో కృషి చేసిన వారి జీవితాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలనే ఆలోచనతో నేను *"దళిత సాహిత్యంలో ఆత్మకథలు పరిశీలన"* అనే అంశంపై ఆచార్య దార్ల వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి 2017లో పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథాన్ని సమర్పించాను.

**పరిశోధన నేపథ్యం :** (Background of the Research)

నేను హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. తెలుగు చదువుతున్నప్పుడు(2009-2011) కొత్త కోర్సులను ప్రవేశపెట్టారు. అలా ప్రవేశపెట్టిన వాటిలో దళిత సాహిత్యం ఒకటి. ఎం.ఏ. తెలుగు ఒక కోర్సుగా చదువుతున్న సమయంలో నాకు కొన్ని సందేహాలు వచ్చేవి. దళిత కవిత్వంలో ముఖ్యంగా కవులు 'నేను','నా' 'నాకు' అనే పదాలతో ఆత్మాశ్రయంగా రాస్తున్న రచనాశైలిని గమనించాను. దీన్నిబట్టి వాళ్ళు రాస్తున్న కవిత్వంలో తమ జీవితం గురించి చెప్తున్నారా? తమ జాతి జీవితం గురించి చెబుతున్నారా? లేక తమ సమాజం గురించి చెప్తూ రాస్తున్నారా? అనే సందేహాలు వచ్చేవి. కొంతమంది పెద్దల దగ్గర నా ప్రశ్నలను అడిగాను. కానీ, సరైన సమాధానం దొరకలేదు. మాకు దళిత సాహిత్యం, సాహిత్య విమర్శ పాఠాలు చెప్పిన ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు దగ్గర ఈ అనుమానాల్ని బయటపెట్టాను. కవిజీవిత విమర్శలో భాగంగా దీన్ని గుర్తించాలన్నారు. అలాగే ఒక కవి లేదా రచయిత జీవితాన్ని ఒక పాత్ర లేదా కొన్ని పాత్రల్లోనో, కొన్ని సంభాషణల్లోనో చూడలేమనీ, కానీ కవి వ్యక్తిత్వాన్ని గుర్తించడానికి కొన్ని పద్ధతులున్నాయని వాటిని వివరించారు. అలా దళిత సాహిత్యం లో వచ్చిన ఆత్మకథలను విశ్లేషణ చేస్తూ, దళిత సృజనాత్మక సాహిత్యంలో వచ్చిన ఆత్మకథాత్మకాంశాలను సూత్రీకరించాలని నిర్ణయించుకొని నా పరిశోధనను కొనసాగించాను.

**దళితసాహిత్యంలో ఆత్మకథలు - పరిశీలన**

(పిహెచ్.డి., పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)

పరిశోధకుడు

గిన్నారపు ఆదినారాయణ

**12HTPH03**

పర్యవేక్షకులు

డా. దార్ల వేంకటేశ్వరరావు

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ.

జూన్ 2017

**పూర్వ పరిశోధనలు** (Review of the Literature)

ఆత్మకథపై మొదటిసారిగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డా.టి.దామోదరం, ఆచార్య పి. నరసింహారెడ్డి పర్యవేక్షణలో "తెలుగులో స్వీయచరిత్రలు సామాజిక, రాజకీయ, సాహిత్య విశ్లేషణ"(1988) అనే అంశం పై పరిశోధన జరిగింది. ఆ తర్వాత గుర్రం జాషువా రాసిన "నా కథ"(1966)అనే ఆత్మకథపై ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఎండ్లూరి సుధాకర్ ఎం.ఫిల్., పరిశోధన చేశారు. గుర్రం జాషువా "నా కథ" తెలుగులో దళిత మొట్టమొదటి ఆత్మకథ. డా.శ్యాంసుందర్ "తెలుగులో ఆత్మకథాత్మక కావ్యాలు"(1997) అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి., పూర్తిచేశారు. తెలుగు విశ్వవిద్యాలయ తులనాత్మక అధ్యయనం శాఖలో కొన్ని ఆత్మకథలపై విడివిడిగా పరిశోధనలు జరిగాయి. దళిత నేపథ్యంతో వచ్చినవి కొన్ని అయితే, సామాజిక కోణంలో వచ్చిన ఆత్మకథలు మరికొన్ని.

**పరిశోధన లక్ష్యం-**(Aims and Objectives )

ఈ పరిశోధనలో నేను ముఖ్యంగా దళిత ఆత్మకథలతో

పాటు దళిత సృజనాత్మక సాహిత్యంలో వచ్చిన గ్రంథాలను పరిశీలించాను. దళిత సృజనాత్మక సాహిత్యంలో వచ్చిన అనేక గ్రంథాలను గమనించాక, దళిత సాహిత్యం మొత్తం వారివారి ఆత్మకథకు సంబంధించిన అంశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయనిపించింది. కాబట్టి దళిత సాహిత్యం దాదాపు దళితుల ఆత్మకథలుగానే భావించవచ్చు అనేది నా ఊహా పరికల్పనగా ఈ పరిశోధనను ప్రారంభించాను. కాబట్టి వీటిని మనం ఏ విధంగా అర్థం చేసుకోవాలి? ఇందులో ఎంత వరకు వారి స్వీయానుభవాలు ఉండే అవకాశం ఉంది? మొదలైన విషయాలను వివరించాను.

ఇప్పటి వరకు ఆత్మకథ రూపంలో వచ్చిన గ్రంథంపై పరిశోధనలు జరిగాయే తప్ప, ఆత్మకథాత్మక రచనమీద పరిశోధనలు జరగలేదు. కొన్ని దళితుల ఆత్మకథలమీద జరిగినా దళితుల ఆత్మకథాత్మక రచనలపై ఇప్పటివరకు పరిశోధనలు జరుగలేదు. ఈ పరిశోధనలో దళిత ఆత్మకథాత్మక రచనల్లో అనగా కవిత్వం, కథ, నవల, నాటకం, మొదలైన ప్రక్రియల్లో కవి లేదా రచయిత జీవితానుభవం ఉన్నదా? లేక ఆ జాతి జీవన విధానం ఉందా అనే విషయాలను అధ్యయనం చేసాను. కొన్ని రచనల్లో అనేక సందర్భాల్లో తన (కవి లేదా రచయిత) జీవితానుభవం కన్పిస్తుంది. తన జాతి జీవితం కన్పిస్తుంది. ఇలాంటప్పుడు ఈ రచనను ఆత్మకథ అనాలా? తన జాతి ఆత్మకథ అనాలా? అనే అంశం నా పరిశోధనా గ్రంథంలో వివరించాను. ఉదాహరణకు నెమలికన్నులు, నల్లద్రాక్ష పందిరి, మా ఊరు(కవిత్వం) మన్నుబువ్వ, అస్పృశ్య గంగ, అవిటి కథలు(కథల సంపుటి) జగడం(నవల) మొదలైన రచనల్లో కవి లేదా రచయిత జీవితంతోపాటు దళిత సమాజం, జీవితం చాలా స్పష్టంగా కన్పిస్తుంది. ఇలా అనేక విషయాలను తెలియ జేయడమే నా పరిశోధన లక్ష్యంగా కొనసాగింది.

**పరిశోధన పరిధి :** (Boundary of the Research)

తెలుగు సాహిత్యంలో వచ్చిన మొత్తం దళిత ఆత్మకథలను నా పరిశోధన పరిధిగా ఎంచుకున్నాను. తెలుగులో దళిత సాహిత్యం 1985 తర్వాత మొదలైంది. అంతకుముందు దళితుల గురించి రచనలున్నప్పటికీ, వాటిని పూర్తిస్థాయి దళిత రచనలు అనలేమని విమర్శకుల అభిప్రాయం. అందువల్ల అప్పటినుండి తెలుగు సాహిత్యంలో కృషి చేసిన దళిత కవులు, రచయితలు వెలుగులోకి రానివారు అనేకం. ఒకవేళ సాహితీ రంగంలోకి వచ్చినా, అప్పుడున్న కాలపరిస్థితులకు అనుగుణంగా కావ్యం, కవిత్వం, కథ, నవలలు రాశారు తప్ప, ఆత్మకథలను చాలా తక్కువమంది రాశారు. కాబట్టి, ఈ పరిశోధనాంశానికి నాకు లభించినంతవరకు, తెలుగు సాహిత్యంలో కృషిచేసిన దళిత కవుల, రచయితల అందరి ఆత్మకథలను స్వీకరించాను.

**అధ్యాయ విభజన :** (Chapter Division)

నా పరిశోధన అంశాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించాను. 1. 'దళిత సాహిత్య – ఆత్మకథ పరిచయం' 2. 'దళిత ఆత్మకథలు వస్తు వైవిధ్యం' 3. 'దళిత ఆత్మకథలు నిర్మాణ శైలి' 04.'దళిత సృజనాత్మక సాహిత్యంలో ఆత్మకథాత్మకాంశాలు' 5. 'దళిత అనువాద ఆత్మకథలు విశ్లేషణ' 6. దళిత ఆత్మకథలు – భాషానుశీలన'

**ఫలితాంశాలు :** (Research findings)

ఈ పరిశోధన ద్వారా గుర్తించిన ఫలితాంశాల్లో కొన్ని ఇలా ఉన్నాయి. 1.దళితుల ఆత్మకథలకు, దళితేతర ఆత్మకథలకు తేడా కన్పిస్తుంది. 2. తెలుగులో ఉన్న దళిత ఆత్మకథలకు, ఇతర భాషల దళిత ఆత్మకథలకు సంస్కృతి, ఆహార, ఆచారాల పరంగా వ్యత్యాసం కన్పిస్తుంది. 3. దళిత ఆత్మకథల్లోని నిర్మాణ శైలిలో వ్యత్యాసం కన్పిస్తుంది. 4. దళిత కవుల, రచయితల జీవితాల సంఘర్షణ ఎంత ఉందో వ్యక్తమవుతుంది.

**భావి పరిశోధనలకు సూచనలు:** (Suggestion For Upcomeing Researchers)

దళిత ఆత్మకథ గ్రంథాలను లోతుగా అధ్యయనం చేస్తే ఆనాటి కాల సామాజిక, ఆర్థిక, రాజకీయ, ప్రాంతీయ, సాంఘికాంశాలు క్లుప్తంగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. ముఖ్యంగా దళిత ఆత్మకథల్లోని నిర్మాణశైలి పైన లోతుగా అధ్యయనం జరగాలి. దళిత ఆత్మకథల్లో సాంస్కృతిక అంశాలపై పరిశోధన చేయవచ్చు. దళిత ఆత్మకథల్లో భాష మీద పరిశోధన చేయడానికి అవకాశం ఉంది. దళిత సాహిత్యంలో వచ్చిన ఒక్కో ప్రక్రియల్లో అధ్యయనం చేస్తే దళిత కవుల, రచయితల ఆత్మకథాత్మకాంశాలు వెలువడే అవకాశం ఉంది.

**పరిశోధకుడి వివరాలు : డా.గిన్నారపు ఆదినారాయణ,** గ్రామం, మండలం : చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

ఫోన్: 9949532456,

mail id : aadi.ginnarapu@gmail.com

**రచయిత : అసిస్టెంట్ ప్రొఫెసర్, యూనివర్సిటి పి.జి, కళాశాల, సికింద్రాబాద్, ఉస్మానియా విశ్వవిద్యాలయం.**

★ **రచయిత: తెలుగు ఉపాధ్యాయుడు** T

RNI Number: APTEL/2011/37247 ISSN 2349-2376




Beware of Suspicious Links

Address for communication
Editor, Nadusthunna Telangana
Flat no.301, vaishnavi smart apartments,
street no.2, Kakateeya Nagar, Habsiguda,
Hyderabad-500007